ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 16 , జూన్ 2024

మెగా డీఎస్సీపై హర్షం

జిల్లాలో వెయ్యికిపైగా ఖాళీలు

అభ్యర్థుల్లో ఆనందం

ఒంగోలు(విద్య), జూన్ 15 : సాధారణ ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలిసంతకం చేయడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 16,347 టీచర్ పోస్టులను భర్తీచేయనున్నారు. పాఠశాల విద్యతోపాటు ఇతర శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలన్నింటిలో ఖాళీలు ఈ మెగా డీఎస్సీ ద్వారా నింపనున్నారు. ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ డిసెంబరు నాటికి పూర్తిచేయమని పాఠశాల విద్యాకమిషనర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ పాలనలో విద్యాశాఖను ప్రయోగశాలగా మార్చి రకరకాలుగా ప్రయోగాలు చేశారు తప్ప టీచర్ పోస్టుల భర్తీని విస్మరించారు. తీరా ఎన్నికల షెడ్యూల్‌కు నెలరోజుల ముందు ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేశారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు రాత పరీక్ష, నియామకాలకు షెడ్యూల్ ప్రకటించారు. అయితే సాధారణ ఎన్నికల షెడ్యూల్ దృష్ట్యా ఆ ప్రక్రియను హైకోర్టు నిలుపుదల చేసింది. గత ప్రభుత్వం కేవలం 6,100 పోస్టులను మాత్రమే ప్రకటించగా ప్రస్తుత మెగా డీఎస్సీలో 16,347 పోస్టులు ప్రకటించారు.



జిల్లాలోవెయ్యికిపైగా పోస్టులు

మెగా డీఎస్సీలో జిల్లాలో వెయ్యికిపైగా టీచర్ పోస్టులు ప్రకటించనున్నారు. గత డీఎస్సీలో ప్రభుత్వ, జడ్పీ, మండల, మునిసిపల్, ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 409 ఖాళీలు ప్రకటించారు. ప్రస్తుతం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, హెచ్‌ఎం పోస్టులు మొత్తం 988 ఖాళీలు ఉన్నాయి. ఇవి కేవలం ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లోనే ఉన్నాయి. గత డీఎస్సీ తరహాలోనే ఏపీ రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్ల ఖాళీలు కూడా కలుపుకొంటే వెయ్యి పోస్టులకుపైగా ఉంటాయి. జిల్లాలో ప్రస్తుతం 422 ఎస్జీటీ పోస్టులు, 24 హైస్కూలు హెచ్‌ఎంలు, 61 బయాజికల్ సైన్స్, 65 ఇంగ్లీషు, 25 హిందీ 65 గణితం, 167 ఫిజికల్ ఎడ్యుకేషన్, 45 ఫిజికల్ సైన్స్ 83 సోషల్, 21 తెలుగు ఖాళీలు ఉన్నాయి.

ఆశలకు జీవం



బీఏ బీఈడీ పూర్తిచేశాను. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా లేక ఎదురుచూస్తుండి పోవాల్సి వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ నెరవేర్చారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం చేసి డీఎస్సీ అభ్యర్థుల ఆశలకు జీవం పోశారు.

-ఉసురుపాటి ఎలిజబెత్, బీఏబీఈడీ (తిమ్మసముద్రం)



స్వామి ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నేడు జిల్లాకు మంత్రి స్వామి

ఘనస్వాగతం పలికేందుకు అభిమానుల ఏర్పాట్లు

బొప్పూడి నుంచి నాయుడుపాలెం వరకు ర్యాలీ

ఒంగోలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదివారం జిల్లాకు రానున్నారు. కొండపి నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు విజయం సాధించిన డాక్టర్ స్వామిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు ఈనెల 12న కేసరిపల్లి వద్ద జరిగిన సభలో మంత్రిగా డాక్టర్ స్వామి ప్రమాణస్వీకారం చేయగా అనంతరం ఆయనకు సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, సచివాలయాలు, గ్రామ వలంటీర్ల శాఖలను కేటాయించారు. కాగా మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం అమరావతిలోనే ఉన్న స్వామి ఆదివారం జిల్లాకు వస్తున్నారు. తొలిసారి మంత్రి హోదాలో జిల్లాకు వస్తున్న డాక్టర్ స్వామికి ఘనంగా స్వాగతం పలికేందుకు శ్రేణులు, అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా సరిహద్దు అయిన బొప్పూడి నుంచి స్వామి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెం వరకు భారీ వాహన ర్యాలీ నిర్వహించనున్నారు. కొండపి నియోజకవర్గ పార్టీ బాధ్యతలు చూస్తున్న టీడీపీ యువనేత దామచర్ల సత్య నేతృత్వంలో ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా విజయవాడ నుంచి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు బొప్పూడి చేరుకునే మంత్రి డాక్టర్ స్వామికి టీడీపీ శ్రేణులు, అభిమానులు స్వాగతం పలుకుతారు. అక్కడి ఆంజనేయ స్వామి గుడిలో పూజలు అనంతరం ర్యాలీతో సాయంత్రం నాలుగు గంటలకు వల్లూరమ్మ గుడి వద్దకు చేరుకుంటారు. అక్కడ పూజలు అనంతరం సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. తర్వాత నాయుడుపాలెంలోని అంబేడ్కర్, ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి జాతీయ రహదారిపై ఐటీసీ ఎదురుగా ఉన్న దామచర్ల కంపెనీ వద్దకు వస్తారు. అక్కడ సభ జరగనుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఆ సభలో పాల్గొంటారు. ఆ మేరకు షెడ్యూల్ రూపొందించి తదనుగుణమైన ఏర్పాట్లు యువనేత సత్య ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. కాగా 17న స్వగ్రామమైన నాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ స్వామి ప్రజలకు అందుబాటులో ఉంటారని సమాచారం.

లబ్‌డబ్.!



- బదిలీలు, తొలగింపులపై చిరుద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బందిలోనూ టెన్షన్
- రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్లపై తొలివేటు
- రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ ఉద్యోగులదీ అదే పరిస్థితి

అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులు, ఇష్టారీతిన పనిచేసిన ప్రభుత్వ, కాంట్రాక్టు సిబ్బంది ప్రస్తుతం వణికిపోతున్నారు. ఎక్కడ తమ అక్రమాలు, అవినీతి బయటపడుతుందో, ఎప్పుడు వేటు పడుతుందోనని భయపడుతున్నారు. తాజా ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలై టీడీపీ భారీ మెజారిటీతో గెలుపొందింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అడ్డగోలు నియామకాలు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు, తొలగింపులపై టీడీపీ శ్రేణులు దృష్టి సారించాయి. ప్రధానంగా వైసీపీ నేతల అండ చూసుకొని రెచ్చిపోయిన వారి చిట్టాను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయా ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

ఒంగోలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జిల్లాలో క్షేత్ర స్థాయిలో కీలక శాఖల పరిధిలో పనిచేసిన ఉద్యోగులు, వివిధ శాఖల పథకాలు అందిస్తూ నేరుగా ప్రజలతో సంబంధాలు ఉండే అనధికార సిబ్బందిలో ఆందోళన మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగిన లేదా నాయకుల కన్నా ఎక్కువగా తామే అన్నట్లు వ్యవహరించిన వారిలో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తోంది. గ్రామ, మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్‌శాఖల ఉద్యోగులు, సిబ్బంది ఈ కోవలో ఎక్కువగా ఉన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు వాటిని అందించే పేరుతో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించిన రేషన్ డీలర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్లు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు ఇలా పలు రంగాల వారిలో అత్యధికులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నియమింపబడిన వారే కావడంతో వారిని సమూలంగా మార్పులు చేయాలంటూ టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు అప్పుడే ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలపై ఒత్తిళ్లు ప్రారంభించారు. ఆ సమాచారం ఆతరహా ఉద్యోగులు, సిబ్బందిలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

ఇష్టారీతిన వ్యవహరించిన ఫలితం

సాధారణంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పర్మినెంట్ ఉద్యోగులకు ఇబ్బంది ఉండదు. అయితే అనుకూల ప్రభుత్వం, నాయకుల మద్దతు ఉంటే నివాసాలకు దగ్గరగా ఉండే ప్రాంతాలు అలాగే మంచి ప్రాధాన్యం ఉండే పోస్టింగ్‌ల కోసం ఉద్యోగులు ప్రయత్నిస్తారు. ఆ మేరకు నాయకులు కూడా ప్రాధాన్యం ఇస్తారు. అలాగే క్షేత్రస్థాయిలో కీలకంగా ఉండే రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర తాత్కాలిక సిబ్బంది నియామకాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ తరహా బదిలీలు, మార్పులు, చేర్పుల్లో ఆ పార్టీ నేతలు ఇష్టారీతిలో వ్యవహరించారు. అనుకూలురను ప్రాధాన్యత ఉండే వాటిలోకి తెచ్చుకోవడం అనే దాని కన్నా టీడీపీకి సానుకూలంగా ఉంటున్నారనే పేరుతో అనేక మందిని వేధింపులకు గురిచేసి తొలగించారు. ఇక క్షేత్రస్థాయి సిబ్బంది నియామకాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరించారు. కొందరు జిల్లా అధికారులైతే ఈ తరహా విషయాలలో వైసీపీ నేతల కన్నా మిన్నగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇష్టారీతిన అవుట్ సోర్సింగ్ నియామకాలు కూడా చేశారు.

మొదలైన కసరత్తు

ప్రభుత్వ శాఖల పరంగా చూస్తే మండలస్థాయిలో కీలకమైన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వీఆర్వోలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల ఇంజనీర్లు, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్‌లోని మండలస్థాయి సిబ్బంది మార్పులు కోరుతూ టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఇక గ్రామ స్థాయిలో నేరుగా నేతల పట్టుకు దర్పణంగా నిలిచే ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ డీలర్లు, షిఫ్ట్ ఆపరేటర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల వంటి వారి తొలగింపునకూ పట్టుబడుతున్నారు. ఇక వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల వ్యవస్థను తెచ్చి ఆ పార్టీ కార్యకర్తలను నియమించుకున్నారు. జిల్లాలో 14వేల మంది వలంటీర్లు ఉండగా ఎన్నికల సమయంలో నాలుగున్నర వేలమంది రాజీనామా చేసి వైసీపీకి పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రాగా ఆ వ్యవస్థను కొనసాగించడంతోపాటు గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని ప్రకటించింది. దీంతో వైసీపీకి చెందిన వారందరినీ తొలగించి టీడీపీకి మద్దతుగా ఉన్న వారిని నియమించేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఈ పరిణామాలతో వైసీపీ అనుకూలంగా పనిచేసిన చిరుద్యోగులు, సిబ్బందిలో వణుకు మొదలైంది.

పాఠశాలల్లో విస్తృత తనిఖీలు

- ఉత్తర్వులు జారీచేసిన కమిషనర్

ఒంగోలు(విద్య); జూన్ 15 : అధికారులు తరచుగా పాఠశాలలను సందర్శిస్తూ తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అతి కొద్దిమంది అధికారులు మాత్రమే తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు పాఠశాలల సందర్శనలు, తనిఖీలు నిర్వహిస్తూ తమ నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మెజార్టీ తమ లక్ష్యాలను విస్మరించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో తనిఖీ అధికారులు తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు సందర్శనలు, తనిఖీలు నిర్వహిస్తూ ఆన్‌లైన్ విజిట్/తనిఖీ ఫామ్‌లో వివరాలు తెలపాలన్నారు. ఆర్‌జేడీలు, డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు తమ నెలవారీ లక్ష్యాల మేరకు పాఠశాలలు తనిఖీలు పూర్తిచేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పశువుల రవాణాకు చెక్

- జిల్లాలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు
- రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ సుశీల

ఒంగోలు(క్రైం), జూన్ 15: బ్రకీద్ పండుగ సందర్భంగా గోవధను అరికట్టడానికి రవాణా శాఖ ఆధ్వర్యంలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్. సుశీల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పశువులను వాహనాలలో తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లారీ యజమానులు అక్రమంగా ఇలాంటి తరలింపులకు పాల్పడితే జరిమానాలు విధించడంతోపాటుగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరూ పశువుల తరలింపు చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. జిల్లా అంతా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

ఏ రకం చూసినా కిలో రూ.60 నుంచి రూ.70

సామాన్యుడు కొనలేని పరిస్థితి

చికెన్‌తో పోటీపడుతున్న బీన్స్



ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15 : కూరగాయలు అంటేనే సామాన్యుడు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండ తీవ్రత తగ్గిన తర్వాత కూడా ఏ కూరగాయ చూసినా కిలో రూ.60 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. చికెన్‌తో పోటీపడి బీన్స్ ధరలు ఉన్నాయి. కిలో చికెన్ రూ.250కి లభిస్తుండగా బీన్స్ రూ.210లకు చేరింది. నిన్నా మొన్నటివరకు అన్నిరకాల కూరగాయలు కిలో రూ.30 నుంచి రూ.50 లోపు లభించగా ఇప్పుడు 40శాతం మేర ధరలు పెరిగాయి. ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడంతో అన్ని రకాల ధరలకు రెక్కలు వచ్చాయి. వంద రూపాయలు చేతిలో పెట్టుకొని మార్కెట్‌కు వెళితే రెండు రకాలు కూడా రావడం లేదు. మరోవైపు నిత్యం వంటల్లో వినియోగించే టమోటా, పచ్చిమిర్చి ధరలు హోల్‌సేల్‌లోనే కిలో రూ.70 వరకు పలుకుతుండగా రిటైల్‌గా మరో 10 నుంచి 15శాతం వరకు పెంచి కిలో రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ఆలా అన్నిరకాల కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులు మార్కెట్‌వైపు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్తపట్నం, మార్టూరు ప్రాంతాల నుంచి పలురకాల కూరగాయలు దిగుమతి అవుతాయి. అయితే అక్కడ పంట ఉత్పత్తి తగ్గిపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో వాటి ధరలకు రెక్కలు వచ్చాయి. కూరగాయల ధరలు కిలో ఇలా ఉన్నాయి...

బీన్స్ :	రూ.210.00	బీర :	60.00
టమోటా :	70.00	క్యాబేజి :	50.00
పచ్చిమిర్చి :	100.00	గోరుచిక్కుళ్లు :	50.00
దొండ :	70.00	బీట్‌రూట్ :	50.00
క్యారెట్ :	65.00	బంగాళదుంప :	40.00
చామదుంప :	60.00	బెండకాయ :	40.00
కాకర :	60.00		



పేర్లు తొలగించిన తర్వాత మున్సిపల్ కార్యాలయం (ఇన్‌సెట్లో) సీహెచ్‌సీ భవనం గేటు

పేర్లు పోయె..!

చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం, సీహెచ్‌సీపై వైసీపీ నాయకుల పేర్లు తొలగింపు

చీమకుర్తి, జూన్ 15: నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయంపై ఏర్పాటుచేసిన వైఎస్‌ఆర్, బూచేపల్లి సుబ్బారెడ్డి కుటుంబసభ్యుల పేర్లను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. కాగా ఈ పేర్లను తొలగించింది టీడీపీకి చెందిన వారని ఆరోపిస్తూ కొందరి పేర్లతో సహా తమ ఫిర్యాదులో పేర్కొన్న వైసీపీ నాయకులు, ఘటనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీఐ దుర్గాప్రసాద్ స్పందిస్తూ పేర్ల తొలగింపు విషయంపై వైసీపీ నాయకులు కౌన్సిలర్ సోమా శేషాద్రి, కిష్టపాటి శేఖర్‌రెడ్డి, గోపవరపు చంద్ర, ఆముదాలపల్లి రామబ్రహ్మం ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ పూర్తయిన తర్వాత కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌పై ఉన్న నేతల పేర్లను కూడా కొందరు తొలగించారు.

వైద్యశాఖలో ఇష్టారాజ్యం

- మన అనుకుంటే అందలం.. కాదనుకుంటే రిలీవ్
- హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా పట్టించుకోని పరిస్థితి
- ఎక్కడో మారుమూల ప్రాంత వైద్యాధికారి అనధికారికంగా వైద్యశాఖలో పెత్తనం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: వైద్యశాఖలో కొందరు ఇష్టారాజ్యంగా రాజ్యమేలుతున్నారు. అంత వారు అనుకున్నట్లే ఆ శాఖలోని ఉద్యోగులు నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ నిబంధనలు కొందరికి మాత్రమే. మిగిలిన వారికి మాత్రం ఉండవు. తమకు ఉపయోగపడుతాడంటే అందలం ఎక్కిస్తున్నారు. వారి వల్ల ఎలాంటి ఉపయోగం లేదంటే దూరంగా పంపుతున్నారు. అదే విధంగా కార్యాలయంలో అనధికారికంగా కొందరితో పనిచేయించుకుంటున్నారు. అదేమంటే అత్యవసరం అంటున్నారే తప్ప కారణాలు చెప్పడం లేదు. కార్యాలయంలో అంత అవసరం ఉంటే అధికారికంగా నియమించుకునే అవకాశం ఉన్నా అవేమి పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు వైద్యశాలలపై పెత్తనం చేసేందుకు మారుమూల ప్రాంతంలో పనిచేసే ఒక వైద్యాధికారిని అనధికారికంగా వైద్యశాఖ కార్యాలయానికి తెచ్చుకున్నారు.

డిప్యుటేషన్లు రద్దుచేసినా..



ఎన్నికల సమయంలో డిప్యుటేషన్లు రద్దు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేయడంతో అనేకమంది వెనక్కి వెళ్లారు. ఎన్నికల అనంతరం మళ్లీ అదే ఉద్యోగుల్లో కొందరు అనధికారికంగా వైద్యశాఖ కార్యాలయంలో పెత్తనం చేస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అక్రమ పద్ధతిలో పదోన్నతులు పొందిన ఉద్యోగులకు రివర్షన్ ఇచ్చే క్రమంలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. అక్కడి నుంచి అందరూ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అయినా సరే కార్యాలయంలో పెత్తనం చేస్తున్న అధికారులు తమకు ఇష్టం లేని వారిని వెంటనే రిలీవ్ చేస్తున్నారు. అదేసమయంలో తమ మనసెరిగి పనిచేస్తున్న వారిని మాత్రం కొనసాగిస్తున్నారు. అక్రమంగా పదోన్నతులు పొందడం అనేది చట్ట వ్యతిరేకమైనందున అలాంటి వారిపై వేటు వేయాల్సిందిపోయి కాపాడుతున్నారు. వైద్యశాఖ కార్యాలయంలో పనిచేసే ఒక ఉద్యోగి తనకు కళ్లు కనిపించవని తప్పుడు సర్టిఫికెట్ తెచ్చుకొని ఉద్యోగంలో చేరడమే కాకుండా ఇప్పుడు పదోన్నతి పొందారు కూడా. ఇలా చెప్పుకుంటూపోతే పక్షంరోజుల నుంచి జిల్లావ్యాప్తంగా వైద్యశాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పలు ఆరోపణలు వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

రెవెన్యూ మంత్రికి సత్కారం


సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15 : రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. విజయవాడలో మంత్రి సత్యప్రసాద్‌ను అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాళం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కలిసి బొకే అందజేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చిరంజీవి, రౌతు రామకృష్ణ, డి.సాయిబాబా, గోపాల్, పి.శ్రీనివాస్, టి.సజీత్, ఆర్.మల్లికార్జునరావు, డీవీకే.సాయిగోపాల్, హనుమంతరావు పాల్గొన్నారు.









ప్రభుత్వ భవనాలపై సొంత పేర్లా..!

• చీమకుర్తి టీడీపీ నాయకుల ఖండన


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చీమకుర్తి, జూన్15: ప్రభుత్వ ధనం, ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన సొమ్ముతో నిర్మించిన ప్రభుత్వ భవనాలపై చీమకుర్తిలో వైసీపీ నాయకుల పేర్లు రాసుకోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం చీమకుర్తిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు పలు విషయాలను వెల్లడించారు. 2013సంవత్సరంలో ప్రభుత్వం స్టార్టప్ గ్రాంట్ కింద రూ.50 లక్షలు, 2014-19కాలంలో ఎస్ఎఫ్‌సీ కింద అప్పటి మంత్రి నారాయణ రూ.కోటి నిధులు చీమకుర్తి మున్సిపల్ భవన నిర్మాణానికి విడుదల చేశారన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి వసూలు చేసిన దాదాపు రూ.కోటి వెరసి రూ.2.5కోట్లతో నూతన మున్సిపల్ భవన కార్యాలయం నిర్మించారని తెలిపారు. అయితే ఈ భవనం, గేట్లపై వైసీపీ నాయకులు తమ సొంత పేర్లు రాకోవడం ఏమిటని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. అదేవిధంగా కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ నిర్మాణానికి రావిపాటి వెంకటేశ్వర్లు 2 ఎకరాలు ప్రభుత్వానికి 1980వ సంవత్సరంలో దాన సెటిల్‌మెంట్ చేయటం జరిగిందన్నారు. ఈ స్థలంలో భవన నిర్మాణానికి సుంకర మస్తాన్‌రెడ్డి 1982వ సంవత్సరంలో రూ.25వేలు విరాళం అందించారని చెప్పారు. కానీ వైసీపీ నాయకులు చిన్నచిన్న గేట్లు పెట్టి వాటిపై వారి పేర్లు రాసుకోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పైన తెల్పిన రెండు నిర్మాణాలకు గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయలేదని, అలాంటి వాటిపై వారి పేర్లు రాసుకోవటాన్ని ఎన్‌డీఏ కూటమి తీవ్రంగా తప్పుపడుతుందని తెలిపారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, నాయకులు యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, సూరంపల్లి హనుమంతరావు, పుట్టా బ్రహ్మయ్య, ముప్పూరి చలమయ్య, నర్రా నాగరాజు, గొల్లపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి వాతావరణంలో బక్రీద్‌ను జరుపుకోవాలి

• జేసీ గోపాలకృష్ణ


మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా మంచి వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. ఈనెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం, హిందూ మతపెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారుల తో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఏఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గోవధ నిషేధం చట్టం అమలులో ఉన్నందున పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీటీసీ ఆర్.సుశీల మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణా జరగకుండా నిఘాను పెంచినట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి, డీపీవో ఉషారాణిలు తమశాఖల పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా, ఓవర్ లోడింగ్ కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఘర్షణలకు దారితీసిన ప్రాంతాలపై ఈసారి మరింత దృష్టి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. వెటర్నరీ డాక్టర్లందరూ ఆది, సోమవారాల్లో కచ్చితంగా ఆయా మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు కలెక్టరేట్‌లో 24గంటలు పని చేసే కంట్రోలు రూమును ఏర్పాటు చేశామని, అందుకోసం 7093472086, 8096257844 సెల్‌నెంబర్లతో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు బి.నారాయణ, జశ్వంత్‌రావు, ఆర్డీవోలు బీవీ.సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, కమిషనర్లు, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

శింగరకొండకు జనసేన నాయకుల పాదయాత్ర


పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు జూన్ 15: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ విజయం సాధించడంతో శనివారం మద్దిపాడులో జనసేన పార్టీ నాయకులు శింగరకొండకు మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్ర చేపట్టారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద మండలాధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పాదయాత్రను ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు కడియాల రఘుబాబు, ఆర్ఎం.వెంకటేశ్వర్లు, దమ్ము సురేష్, ఎంపీటీసీ దుర్గభవాని, దేవబత్తిన ప్రసాద్, నవులూరి శివకృష్ణ, తిరుమలశెట్టి సురేష్, మండవ గోపి, ఏడుకొండల సత్యనారాయణ, శివశంకరవరప్రసాద్, విజయ్, దరిమడుగు నాగరాజు, కోటా సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

• 11 రోజులపాటు నిర్వహణ


వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

సింగరాయకొండ, జూన్ 15 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం రాత్రి అంకుర్పాణ చేయనున్నారు. 11 రోజులపాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆలయ చరిత్ర

పురాణాల ప్రకారం.. దేవరుషి అయిన నారద మహాముని ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతంలోని పర్ణశాలలో తపస్సు చేస్తుండగా శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి స్వయంబుగా వెలుస్తారు. అప్పట్నుంచి ఇక్కడ స్వామివారు పూజలందుకుంటున్నారు. త్రేతాయుగంలో మహావిష్ణువు అవతారమైన శ్రీరాయచంద్రుడు శ్రీయోగనంద లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి క్షేత్రానికి వస్తారు. ఆ సమయంలో అయన అనుగ్రహంతో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామిని శ్రీరాముడు ప్రతిష్ఠించినట్లు ఆలయంలోని శాసనాల ద్వారా తెలుస్తోంది. అప్పటి నుంచి వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంగా విరాజిల్లుతోంది. ఈ క్షేత్రంలో రాజ్యలక్ష్మీ, గోదాదేవి అమ్మవార్లు, స్వయంభుగా వెలిసిన వీరాంజనేయస్వామి భక్తుల నుంచి విశేష పూజలందుకుంటున్నారు. పల్లవుల కాలం నుంచి విజయనగర సామ్రాజ్య ప్రభువైన శ్రీకృష్ణదేవరాయుల వరకూ స్వామి వారిని సేవించి దానాలు, భూరి విరాళాలు ఇచ్చినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకుర్పారణ చేస్తారు. 17వ తేదీన ధ్వజారోహణ, చంద్రప్రభ వాహనం, 18న సూర్యప్రభ వాహనం, హంసవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు. 19న చప్పరసేవ, శేషవాహన సేవ, 20న చప్పరసేవ, హనుమంతసేవ, 21న మోహిని ఉత్సవం, గరుడవాహనంపై సేవ, 22న వసంతోత్సవం, తెల్లవారు జామున గజోత్సవం, 23న కల్యాణోత్సవం, రథోత్సవం, 24న గుర్రపు వాహనం, 25వ తేదీ లక్ష్మీసంవాద ఉత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహణం, పూర్ణాహుతి ఉంటాయి. 26న పుష్పయాగం నిర్వహిస్తారు.

పలువురు రక్తదానం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15 : అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) జిల్లా విభాగం ప్రతినిధి డాక్టర్ పీఎస్ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని రెడ్‌క్రాస్‌బ్రాంచిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధులు వైద్యులు జాకబ్ జక్రయ్య మురళీ, నితిన్, రంగనాథ్, జాగర్లమూడి కృష్ణ, మెడికల్ రిప్రజంటెటివ్ అధ్యక్షుడు చిరంజీవి హాజరై రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు పి.సుధాకర్, వై.జనార్దన్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అంజయ్య జీవితం స్ఫూర్తిదాయకం

మద్దిపాడు జూన్ 15 : నల్లూరి అంజయ్య జీవితం స్ఫూర్తిదాయకమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం మారెళ్ళగుంటపాడులో కమ్యూనిస్టులు నల్లూరి అంజయ్య, ఎద్దు సుబ్బారావు వర్ధంతి సభను సీపీఐ గ్రామ కార్యదర్శి నల్లూరి రామారావు అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఎంఎల్.నారాయణ, జిల్లా కార్యదర్శి ఉప్పుటూరు ప్రకాశరావు, కమ్యూనిస్టు సంపాదకవర్గ సభ్యులు ఎంసీ.వెంకటేశ్వర్లు, పావులూరి అంజయ్య, గోగినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలబాలికలు కోలాటం ఆకట్టుకుంది.

నీట్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: నీట్ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ డిమాండ్ చేశారు. స్థానిక విద్యార్థి జేఏసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా పరీక్ష రాశారన్నారు. నీట్ పరీక్షా పత్రాలు లీకైనట్లు పరీక్షకు ముందు తెలిపినా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీంతో పేద విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిడతల కరుణాకర్, నగర అధ్యక్షుడు శ్రీకృష్ణ, సురేంద్ర, సూర్యప్రకాష్, సాయి, లోకేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

34వేల పోస్టులను భర్తీ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో 34వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవన్‌లో శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 50వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేవలం 16,434 పోస్టులనే మెగా డీఎస్సీని ప్రకటించారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.వెంకటేశ్వర్లు, సీహెచ్.సిసింద్రీ, కె.సుధాకర్, సి.తిరుమలరావు, సీహెచ్.శ్యాం పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: ప్రతిపక్ష హోదాలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో వచ్చేనెల 6,7తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి వర్క్‌షాపును, 8న జరిగే రాష్ట్ర సమితి సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రావూఫ్, సీహెచ్.వెంకటేశ్వర్లు, పీవీఆర్.చౌదరి పాల్గొన్నారు.

జీజీహెచ్ సమస్యలపై త్వరలో సమీక్ష : దామచర్ల


ఎమ్మెల్యే జనార్దన్‌ను సత్కరిస్తున్న దుర్గాభవానీ, ఏడుకొండలు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 15 : నగరంలోని జీజీహెచ్, రిమ్స్‌లోని సమస్యలపై త్వరలోనే సమీక్ష నిర్వహిస్తానని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. శనివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాభవానీ, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ జీజీహెచ్ ద్వారా పేదలకు నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించాలని, త్వరలోనే ఆసుపత్రిని సందర్శించి, సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు.

మంత్రి స్వామికి శుభాకాంక్షలు

టంగుటూరు, జూన్ 15 : మండలంలోని తూర్పునాయుడుపాలెంకు చెందిన పలువురు టీడీపీ నాయకులు శనివారం విజయవాడలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు దామచర్ల బుజ్జి, అనీల్, గడ్డం శివ, కొమ్మినేని శ్రీనివాసరావు, మొలకలపల్లి కమలాకర్, విజయవాడలోని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య గృహంలో మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్య పూర్ణచంద్రరావు కూడా పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి రెండు రోజుల పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో దామచర్ల సత్య ఆధ్వర్యంలో జరిగే మంత్రి డాక్టర్ స్వామి విజయోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. సోమవారం ఉదయం 8 గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే కార్యక్రమంలోను, రాత్రి 8గంటలకు మార్కాపురంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు.

ఇరువురికి గాయాలు

ఒంగోలు(క్రైం), జూన్ 15: మొబైల్ దుకాణానికి ఆటోను అడ్డుగా పెట్టడంతో ఇరువురు ఘర్షణ పడి స్వల్పగాయాలు అయ్యాయి. ఈ సంఘటన ఒంగోలు నగరం ఆర్టీసీ డిపో ఇన్‌గేట్ వద్ద శనివారం జరిగింది. వివరాలోకి వెళితే.. ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద పూజ మొబైల్ వద్ద ఇందిరమ్మకాలనీలో నివాసం ఉండే ఎన్.వెంకటరమణయ్య తన ఆటోను ఆపాడు. దీంతో పూజ మొబైల్ నిర్వాహకుడైన సంతపేటలో నివాసం ఉండే నంబూరి వెంకటనారాయణ తన దుకాణం ఎదురుగా నిలిపిన ఆటోను తీయాలని కోరాడు. దీంతో ఇరువురు మధ్య మాటామాట పెరిగి ఘర్షణపడ్డారు. దీంతో ఇరువురికి స్వల్పగాయాలు అయ్యాయి. వన్‌టౌన్ పోలీసులకు ఇరువురు ఫిర్యాదు చేశారు.

నేడు తిరుమలకు ఇంటూరి పాదయాత్ర

నాగులుప్పలపాడు, జూన్ 15: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుమలకు పాదయాత్రగా వస్తానని సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు మొక్కుకున్నారు. ఈక్రమంలో ఆదివారం శ్రీనివాసరావు స్వగ్రామం చేకూరపాడు నుంచి పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, మండలపార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్ పాల్గొననున్నారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

చీమకుర్తి, జూన్15 : మండలంలోని ఓ గ్రామంలో దివ్యాంగురాలిపై జరిగిన అఘాయిత్యం కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈమేరకు శనివారం సీఐ దుర్గాప్రసాద్ వెల్లడించారు.

కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలి


పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న హరిబాబు, అంకారావు

సంతనూతలపాడు, జూన్ 15: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. శనివారం సంతనూతలపాడు జడ్పీహైస్కూలులో ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు, కిట్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలికలను సైతం చదువులో మరింత ప్రోత్సహించేందుకు గతంలో సైకిళ్లను కూడా అందజేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రమౌళీశ్వర్, ఎంపీడీవో ప్రసాద్, ఆర్.అంకారావు, ఎం.శ్రీనివాసరావు, టి.శ్రీను, హెచ్ఎం ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఒంగోలు(విద్య), జూన్ 15: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ఉప విద్యాధికారి అనితారోజ్‌రాణి పేర్కొన్నారు. శనివారం స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో కిషోర్‌బాబు, హెచ్ఎం బి.కృష్ణకుమారి, డి.చంద్రశేఖర్, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వాగతం ... సుస్వాగతం
నిగర్వి నిజాయితీపరుడు, మృధుస్వభావి, మంచి మనిషి కొండపి నియోజకవర్గ
ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామాత్యులుగా
బాధ్యతలు చేపట్టి నేడు జిల్లాకు విచ్చేయుచున్న గౌరవనీయులు
డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారికి
స్వాగతం... సుస్వాగతం...
నన్నూరి సుబ్బరామయ్య
కొండపి టిడిపి నాయకులు
ముప్పరాజు శ్రీనివాసరావు
వీరేంద్ర ట్రేడర్స్, కొండపి
షేక్ ఖాయూషా
కొండపి మండల తెలుగు యువత అధ్యక్షులు
అద్దేపల్లి శ్రీనివాసరావు
వాసవిసేవాదళ్ అధ్యక్షులు
పాదర్తి సుధాకర్
ఆర్యవైశ్య మండల అధ్యక్షులు
కందిమళ్ళ రమేష్
కొండపి
పారెళ్ళ రాము
ఆర్.ఎం.పి., కొండపి
ఇజ్జగిరి కాశయ్య
కొండపి
ముసునూరి వెంకటేశ్వర్లు
(దేవర) కొండపి
యనమదిన వెంకటేశ్వర్లు
మాజీ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి, కొండపి
పాటిబండ్ల వెంకటేశ్వర్లు
(పెద్దన్న) కొండపి
రావిపాటి బాలక్రిష్ణ
చోడవరం
గుంటుపల్లి హరిప్రసాద్
మాజీ ప్రెసిడెంట్, చోడవరం
పొట్టేళ్ళ మాలకొండయ్య
చోడవరం
శ్రీ డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రివర్యులు
శ్రీ దామచర్ల సత్యనారాయణ (సత్య)గారు
టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



స్వాగతం... సుస్వాగతం...
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామాత్యులుగా
ప్రమాణస్వీకారం చేసి మొదటిసారిగా ప్రకాశం జిల్లాకు విచ్చేయుచున్న
గౌరవనీయులు డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారికి
అభినందనలు
శ్రీ డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర మంత్రివర్యులు
గుమ్మడి సాయిబాబు
మద్దిరాలపాడు
కాకర్ల లక్ష్మీవరప్రసాద్
కె. తక్కెళపాడు (చిన్న)
మండల టిడిపి కార్యదర్శి
నాగులుప్పలపాడు
చిడిపోతు సురేష్‌బాబు
స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్,
కందుకూరు

ట్రాఫిక్ సమస్యతో నిత్యం అవస్థలు



తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు ఇలా..

- ట్రాఫిక్‌కు అనుగుణంగా విస్తరించని రోడ్లు
- నానాటికి తీవ్రమవుతున్న సమస్య
- పట్టించుకోని అధికారులు

పొదిలి, జూన్ 15 : పొదిలి నగర పంచాయతీగా మారి సుమారుగా నాలుగు సంవత్సరాలు దాటింది. అయినా రోడ్లు వెడల్పు చేయకపోవడంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ చిక్కులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగైదు సంవత్సరాలుగా రోజురోజుకు వాహనాల రద్దీ పెరిగిపోయి ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి.

ఒంగోలు - నంద్యాల రహదారి విస్తరణకు నోచుకోక పోవడంతో ప్రజలకు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. పొదిలి నుంచి బేస్తవారిపేట, గిద్దలూరు వరకు రెండు వరుసల రహదారి ఏర్పాటు చేసేందుకు గతంలో రెండుసార్లు సర్వేలు నిర్వహించారు. ఒంగోలు నుంచి కర్నూలు, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, యర్రగొండపాలెం తదితర పట్టణాలకు వెళ్లాలంటే పొదిలి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అయితే ప్రధానరహదారులకు ఇరువైపుల ఆక్రమణలు పెరిగాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణంలో అన్నీ ఇరుకు రహదారులే దర్శన మిస్తున్నాయి అయినా సంబంధిత అధికారులకు మాత్రం పట్టించుకోవడం లేదు. పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకోవడంలో విఫలమౌతున్నారు.

పొదిలిలో సుమారు 55 వేలకుపైగా ప్రజలు ఉన్నా, దానికి తగినట్లు రహదారి విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ, ఆక్రమణల తొలగింపు వంటి చర్యలు లేవు. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్, విశ్వనాథపురం, జూనియర్ కళాశాల రోడ్డు, తహశీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయం, మాయాబజార్ తదితర వీధుల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమౌతోంది. వ్యాపారులు దుకాణాల ముందు ఎవరి ఇష్టానుసారంగా వారు వ్యవహరి స్తున్నారు. డ్రైనేజీలను ఆక్రమించడం, వీధులపైకి కూడా దుకాణాలు తీసుకురావడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతుందని పలువురు విమర్శిస్తు న్నారు. వర్షంపడితే ప్రధాన రహదారులు చిన్నపాటి కుంటను తలపిస్తు న్నాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు తప్పుకొనే వీలులేకుండా ఉంది. అయితే సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూనే ఉంటున్నారు. ఇది ఏమిటి అని ప్రశ్నించరు. కాటూరి వారిపాలెం గ్రామం నుంచి మార్కాపురం అడ్డరోడ్డు వరకు జాతీయ రహదారికి ఇరువైపుల ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రోడ్డును విస్తరించక పోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా పొదిలి ప్రాంతంలో ఎక్కడా కూడా రహదారులపై ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుం టున్నాయని పలువురు తెలియజేస్తున్నారు. రహదారులకు ఇరువైపుల ఏత్తుగా ఏర్పాటు చేసిన మట్టిని, బంకులను తొలగించి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని ప్రజలు, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



పొదిలి ప్రధాన రహదారిలో నిలిచిన ట్రాఫిక్

అవీ..ఇవీ..

విదేశీ ఉద్యోగాల కల్పనకు కార్యాచరణ


టీడీపీ లోగోను అందుకుంటున్న ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకులు

కంభం, జూన్ 15 : ఎన్నికల సమయంలో టీడీపీ ఇచ్చిన లక్ష ఉద్యోగాల హామీలో భాగంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కంభం మండల టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకులు సయ్యద్ రఫి తెలిపారు. ఆ మేరకు ఎన్‌ఆర్‌ఐ సెల్ విభాగం అధ్యక్షులు రవి, ఎన్‌ఆర్‌ఐ టీడీపీ జీసీసీ అధ్యక్షులు రాధాకృష్ణ, శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారన్నారు. అనంతరం టీడీపీ విభాగం ముఖ్యులను కలిసి చర్చించినట్లు తెలిపారు. లక్ష ఉద్యోగాల కల్పన వాగ్దానం ప్రజలు, నిరుద్యోగుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఈ వాగ్దానాన్ని కార్యాచరణ గురించి ఎన్‌ఆర్‌ఐ సెల్ విభాగం అధ్యక్షులు రవి, ఎన్‌ఆర్‌ఐ జీసీసీ అధ్యక్షులు రాధాకృష్ణలు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని సంప్రదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించడానికి ఎన్‌ఆర్‌ఐలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారన్నారు.

హక్కులను, ప్రయోజనాలను పునరుద్ధరించాలి

గిద్దలూరు, జూన్ 15 : గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులు కోల్పోయిన హక్కులను, ప్రయోజనాలను టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వై.శ్రీనివాసులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి 117 జీవో ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని కూడా రద్దు చేయాలని కోరారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీమ మీడియాలను కొనసాగించాలన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తే మెగా డీఎస్సీ విజయవంతం అవుతుందని పేర్కొన్నారు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి 12వ పీఆర్‌సీకి ముందే ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు చెల్లించాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అమ్మఒడిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వై.శ్రీనివాసులు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు వంట సామగ్రి అందజేత


వంట సామగ్రి అందజేస్తున్న దాతలు

గిద్దలూరు, జూన్ 15 : పట్టణంలోని యాదవ బజారులోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలకు పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు వంట సామగ్రి సమకూర్చగా ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

కంభం, జూన్ 15 : కంభం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్త కాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో శార్వాణి తెలిపారు. మండలంలో అన్ని యూపీ, జడ్పీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

'నేను బడికి పోతా' కార్యక్రమం ప్రారంభం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

ఎర్రగొండపాలెం, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు, 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఎర్రగొండపాలెంలో శనివారం ప్రారంభించినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగి హాజరుశాతం పెరుగుతుందన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు మండలంలో ఈ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాల పరిధిలో చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం జూలై 12వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఆరు సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లలు అందరు బడుల్లో చేర్పించేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు గాను మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఇంటింటికి ప్రచారం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచనలు ఇచ్చామ న్నారు. ఈ రోజు ఎర్రగొండపాలెంలో ప్రత్యేక అవసరాలు ఉన్న ముగ్గురు విద్యార్థులను బడిలో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


పూజలు నిర్వహిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 15 : శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ దేవస్థాన అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. అభివృద్ధి ప్రణాళికను పరిశీలించి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బి.చంద్రశేఖర్, టీడీపీ నాయకులు ఉలాపు బాలచెన్నయ్య, దుత్తా బాలీశ్వరయ్య టీడీపీ మండల అధ్యక్షుడు కటికె యోగానంద్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి కార్పెంటర్ మృతి


మృతిచెందిన అశోక్

కంభం, జూన్ 15 : నూతనంగా నిర్మిస్తున్న ఓ గృహంపై నుంచి పట్టుతప్పి కిందపడిన వ్యక్తి తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. ఈ ఘటన కంభం పట్టణంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం వాసవీ పాఠశాల వెనుక వైపున వ్యవసాయ పొలంలో నూతనంగా నిర్మిస్తున్న గృహంలో కోవెలకుంట్ల అశోక్ (40) కార్పెంటర్ పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఒక్కడే కూర్చుని మద్యం సేవించాడు. మద్యం మత్తులో అలాగే వెనక్కు పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. మిద్దెపై మద్యం, గ్లాసులు ఉన్నాయి. శనివారం ఉదయం ఇంటి నిర్మాణ పనులకు వచ్చిన కూలీలు మరణించిన అశోక్‌ను చూసి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అశోక్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై పులి రాజేష్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి, జూన్ 15 : ప్రజాసమస్యల పరిష్కారం కోసమే డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పొదిలి ఆర్టీసీ డీఎం జె.సుందరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పొదిలి డిపో పరిధిలోని కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి పొదిలి, కురిచేడు, దొనకొండ మండలాల్లోని ప్రజలు ఆర్టీసీకి సంబంధించిన ఏదైనా సమస్య ఉంటే ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959225700 నంబరుకు ఫోన్‌చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు.

యథావిధిగా అడ్మిషన్లు

- హైకోర్టులో విశ్వభారతికి ఊరట

గిద్దలూరు టౌన్, జూన్ 15 : పట్టణంలోని విశ్వభారతి పాఠశాలకు హైకోర్టులో ఊరట లభించింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు యథావిధిగా అడ్మిషన్లు చేసుకోవచ్చని హైకోర్టు తాజా ఉత్తర్వులలో పేర్కొంది. వివిధ ఆరోపణలపై విచారణ చేసిన అధికారులు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ఆపివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ విషయంపై పాఠశాల యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నూతన అడ్మిషన్లు యథావిధిగా నిర్వహించవచ్చని హైకోర్టు ఆదేశించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి, కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

గోవధ నిషేధం

- మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

గిద్దలూరు టౌన్, జూన్ 15 : గోవధ నిషేధమని, రానున్న బక్రీద్ రోజున గోవధ జరుగకుండా పండుగ జరుపుకోవాలని మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో గోవధ నిషేధ చట్టం గురించి సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ముస్లిం, హిందువులు అన్నదమ్ముల్లాగా శాంతియుతంగా పండుగ జరుపుకోవాలన్నారు. ప్రభుత్వం గోవధను నిషేధించిందన్నారు. సమావేశంలో సీఐ సోమయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ చెట్టుకు ఢీకొని డ్రైవర్ మృతి


మృతిచెందిన లక్ష్మయ్య

త్రిపురాంతకం, జూన్ 15: ప్రమాద వశాత్తు టిప్పర్ చెట్టుకు ఢీకొని డ్రైవర్ మృతి చెందిన ఘటన పల్నాడు వినుకొండ మండలంలోని శివాపురం సమీపంలోని మామిడి తోటవద్ద శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే తిపురాంతకం మండలం ఎండ్లూరివారిపాలెం చెందిన కొల్లి లక్ష్మయ్య (45) గ్రామ సమీపంలోని ఇటుకల మట్టిని టిప్పర్ సాయంతో వినుకొండలో అన్‌లోడ్ చేశారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా శనివారం తెల్లవారుజాము శివాపురం సమీపంలోని మామిడి తోటవద్ద ప్రమాదవశాత్తు టిప్పర్ చెట్టుకు ఢీ కొంది. దీంతో డ్రైవర్ లక్ష్మయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతిడికి భార్య పేరమ్మ, ఇరువురు కుమారులు ఉన్నారు.

ఆశావర్కర్ వేధింపులు తాళలేక ఏఎన్‌ఎం ఆత్మహత్యాయత్నం


వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న ఏఎన్‌ఎం

పొదిలి, జూన్ 15 : ఆశావర్కర్ వేధింపులు తాళలేక ఏఎన్‌ఎం ఆత్మహత్యకు యత్నించిన ఘటన పొదిలి పట్టణంలోని శనివారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే నగరపంచాయితీ పరిధిలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న విజయ పరిధిలో ఏడుగురు ఆశావర్కర్లు పనిచేస్తున్నారు. అయితే వీరిలో పద్మ అనే ఆశావర్కర్ ఏ పనిచెప్పినా చేయకుండా పదిమంది ప్రజల ముందు తనను అవమానకరంగా మాట్లాడుతోందని ఏఎన్‌ఎం విజయ తెలిపారు. ఆశావర్కర్‌కు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నాయని తనను ఎవరు ఏమిచేయలేరని తనను బెదిరిస్తోందన్నారు. సదరు ఆశవర్కర్ పద్మ వేధింపులు తట్టుకోలేక మత్తుబిల్లలు మింగి తాను ఆత్మహత్యకు యత్నించినట్లు విజయ తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వైద్యశాలకు వెళ్లి బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రథమ చికిత్స అనంతరం విజయ ఇంటికి వెళ్లారు.

చంద్రుని రాకతో రాష్ట్రంలో తొలిగిన చీకట్లు

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరూక్ షుబ్లీ

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 15: రాష్ట్రంలో ఉన్న చీకట్లు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో తొలగిపోయాయని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరూక్ షుబ్లీ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కర్నూలు శాంతిరాం కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి షుబ్లీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా షుబ్లీ మాట్లాడుతూ.. కంటి చూపు లేనివారికి కంటి చూపు తెప్పించే విధంగా ఈ శిబిరాన్ని నిర్వహించామన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా సర్వతోముఖాభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరా లు పేద, మధ్య తరగతి కుటుంబాలకు వరం అన్నారు. ఈ వైద్యశిబిరం ద్వారా రోగులను పరీక్షించి కంటి ఆపరేషన్ కోసం కర్నూలు తీసుకెళ్తున్నామని మార్కాపురం పట్టణ మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మొఘల్ జాబీర్ హుస్సేన్ బేగ్ తెలిపారు. కార్యక్రమంలో అజీమతుల్లా, తాజ్, మహబూబ్ బాషా, షాకీర్, నాసర్, జిలానీ, కబీర్, షకీల్, తౌఫిక్, రఫి తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో రోగులను పరామర్శిస్తున్న నారాయణరెడ్డి, షుబ్లీ


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దివ్యాంగులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక శ్రీనివాస్‌హాల్ సమీపంలో మార్కాపురం దివ్యాంగుల విభాగం పట్టణ అధ్యక్షులు సురేంద్ర ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పించన్‌ల పెంపుపై సంతకం చేసి లక్షలాది మందికి న్యాయం చేశారన్నారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు వృద్ధులపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రమణారెడ్డి, రెహమాన్, వెంకటరమణ, అశోక్, శేఖర్, వీరా, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

జిల్లా వనరుల కేంద్రం ఏవో శైలజ

పెద్ద దోర్నాల, జూన్ 15: మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వనరులకేంద్రం వ్యవసాయాధికారిణి శైలజ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆత్మ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజనులో చేపట్టవలసిన జాగ్రత్తలపై రైతులకు శనివారం శిక్షణ నిచ్చారు. మండల వ్యవసాయాధికారి డీ జవహర్‌లాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ తరగతుల్లో భాగంగా హాజరైన జిల్లా అధికారులు శైలజ, వీవీ.శేషమ్మ మాట్లాడుతూ నాణ్యమైన పంటల దిగుబడులకు సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు వినియోగించాలని తద్వారా నేల సారవంతంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఏవో మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావలసిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పలు సూచనలు చేశారు. వివిధ పంటల్లో తీసుకోవాలసిన సూచనలు, మెళకువలపై కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : ఫార్మర్ ఓరియంటెడ్ యాక్టివిటీ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే పంటలలో అధిక దిగుబడి సాధించడంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటిని అధిగమించే పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం త్రిపురాంతకం ఆర్‌బీకేలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి ఏ.శైలజారాణి మాట్లాడుతూ జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవ శిలీంద్ర నాశినులు తదితర అంశాలపై రైతులకు వివరించారు. ప్రధాన పంటకు ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నివారణ రకాల ఎంపిక, మేలైన యాజమాన్య పద్ధతులు వివరించారు. స్థానిక వ్యవసాయాధికారిణి కె.నీరజ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ, ప్రస్తుతం వ్యవసాయశాఖలో అందుబాటులో ఉన్న పథకాలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న ఏవో శైలజ

గిద్దలూరు : మండలంలోని బురుజుపల్లి, కెఎస్‌పల్లి రైతుభరోసా కేంద్రాలలో మట్టి పరీక్షలపై ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ రైతులకు అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ఆధారంగా వచ్చిన ఫలితాలకు అనుగుణంగా రసాయన ఎరువుల యాజమానాన్ని చేపట్టాలని, తద్వారా తక్కువ పెట్టుబడులకు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ మిరప రైతులకు సలహాలు, సూచనలు మొబైల్‌లో అందిస్తారని, పంట కోత అనంతరం నాణ్యత పరీక్షలు నిర్వహించి మార్కెటింగ్ కూడా సహకరిస్తారని పేర్కొన్నారు.

నెమలిగుండ్లకు టీడీపీ కార్యకర్తల పాదయాత్ర

కార్యకర్తలకు కలిసి ఉత్సాహ పరిచిన ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, జూన్ 15 : ముత్తుముల అశోక్‌రెడ్డి ఎన్నికలలో విజయం సాధించినందుకు గిద్దలూరు నుంచి నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయానికి పాదయాత్ర నిర్వహిస్తానని పట్టణానికి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్ స్వామి వారికి మొక్కుకున్నారు. అందులో భాగంగా మొక్కు తీర్చుకునేందుకు శనివారం చంద్రశేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవినాయకస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయానికి పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర అంబవరం, వెల్లుపల్లె, జయరాంపురం గ్రామాల మీదుగా 20 కిలోమీటర్లు కొనసాగి నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి చేరుకున్నారు. సుమారు 200 మంది టీడీపీ శ్రేణులు ఈ పాదయాత్రలో పాల్గొనగా దేవాలయం వద్ద ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారితో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాద యాత్ర నిర్వహించిన వారిని అభినందించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారం భించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, బోదనబోయిన గోపాలక్రిష్ణయాదవ్, మస్తాన్‌వలి, గోపాల్‌రెడ్డి, పందిళ్ళపల్లి శ్రీనివాసులు, నంది శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్ర ప్రారంభిస్తున్న టీడీపీ కార్యకర్తలు

మంత్రికి శుభాకాంక్షలు



గిద్దలూరు టౌన్, జూన్ 15 : రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ జన్మదినం సందర్భంగా శనివారం గిద్దలూరు నగర పంచాయతీ కమీషనర్ శ్రీనివాసరావు విజయవాడలో ఆయనను కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తల సమష్టి కృషి ఫలితమే ఈ విజయం

- నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యం
- శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, జూన్ 15: సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు క్రమశిక్షణతో సమష్టిగా కృషి చేసి టీడీపీని విజయతీరాలకు చేర్చారని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలో శనివారం మార్కాపురం పట్టణం, మండలం, తర్లుపాడు మండలాల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లిఖార్జున్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలకు తాను జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా కార్యకర్తలు ఎక్కడా అధైర్య పడకుండా మొక్కవోని దీక్షతో పార్టీ విజయానికి పాటుపడ్డారని కొనియాడారు. వారి కష్టం వ్యర్థం కానివ్వనని అన్నారు. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సహకారం మరువలేనిదన్నారు. ముఖ్యంగా మార్కాపురం నియోజకవర్గంలో తాను గతంలో గెలిచినా పార్టీ అధికారంలో లేకపోవడం, పార్టీ అధికారంలోకి వచ్చినా తాను ఎమ్మెల్యేగా గెలవకపోవడం తదితర కారణాలతో నియోజకవర్గాన్ని అనుకున్న మేర అభివృద్ధి చేయలేకపోయినట్లు తెలిపారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. ఇక నియోజకవర్గ అభివృద్ధిని ఎవరూ ఆపలేరని అన్నారు. ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో మార్కాపురం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ క్రమంలో ఎలాంటి ఆటుపోట్లు ఎదురైనా తాను తట్టుకుంటానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేష్, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డిల సహకారంతో ప్రతి గ్రామంలో రోడ్లు, మురుగు కాలువలు, లైటింగ్ నూరుశాతం పూర్తిచేస్తానని అన్నారు. ముఖ్యంగా కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు వచ్చినా పార్టీ విజయానికి అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేదిలేదన్నారు. ఇంకా చాలా గ్రామాల్లో పార్టీ బలోపేతం కావాల్సి ఉందన్నారు. మన ప్రభుత్వం ఉన్నప్పుడు గ్రామాల్లో ఎంతోమందికి మనం పనిచేసినా ఓట్ల రూపంలో రాబట్టలేకపోయామని అన్నారు. అలాంటి లోపాలపై ఇప్పటి నుంచే దృష్టిసారించి ప్రతి గ్రామంలో పార్టీ ఆధిపత్యం వహించే విధంగా కష్టపడాల్సి ఉందన్నారు. గత సైకో పాలనలో టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. మనల్ని ఇబ్బందులకు గురిచేసిన ఎవరినీ వదిలేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి పఠాన్ ఇబ్రహీంఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, మార్కాపురం, తర్లుపాడు మండలాల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డి, ఉడుముల చిన్నపరెడ్డి, మాజీ ఎంపీపీ పి.ఏసుదాసు, కనిగిరి బాలవెంకటరమణ, పుచ్చనూతల గోపీనాథ్, పట్టణ, రెండు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


విద్యార్థులకు కిట్లు పంపిణీచేస్తున్న హెచ్ఎం, పీఎంసీ చైర్మన్ తదితరులు

విద్యార్థులకు కిట్లు పంపిణీ

దొనకొండ, జూన్ 15: మండలంలోని తెల్లబాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంజూరైన కిట్లను ప్రధానోపాధ్యాయురాలు సీతమ్మ నేతృత్వంలో శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీడీపీ మండల నాయకుడు బండారు శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు టీడీపీ ప్రభుత్వం చేయూతనిస్తుందని చెప్పారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని ముందుకు సాగాలని కోరారు. హెచ్ఎం సీతమ్మ మాట్లాడుతూ కిట్‌లో విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్, టెస్టుబుక్స్, యూనిఫాం, బ్యాగు, బూట్లు తదితర విద్యాసామగ్రి ఉంటుందని చెప్పారు. వీటిని విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మెన్ మారం సత్యానారాయణరెడ్డి, పెద్దనాగిరెడ్డి, బండారు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో నిలిచిన ఆన్‌లైన్ సేవలు

దొనకొండ, జూన్ 15: దొనకొండలోని పోస్టాఫీస్‌లో బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ ఆన్‌లైన్ సేవలు గత రెండు రోజులుగా మొరాయించాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి పోస్టాఫీస్‌కు వచ్చిన వినియోగదారులకు కంప్యూటర్లు పనిచేయకపోవటంతో వెనుతిరిగి వెళ్తున్నారు. పోస్టాఫీస్‌లో పోస్టల్, పార్శిల్ బుకింగ్, రిజిస్టర్ పోస్టు, ఆర్‌డీల చెల్లింపులు, ఆధార్, ఇన్సూరెన్సు, తదితర సేవలు వినియోగదారులకు అందిస్తుంటారు. ఈ సేవలు పొందేందుకు రెండు రోజులుగా ప్రజలు పోస్టాఫీస్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన పోస్టాఫీస్‌లో ఆన్‌లైన్ సేవలు రెండు రోజులుగా నిలచిపోయినా బీఎస్ఎన్ఎల్ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి పోస్టాఫీస్‌లో ఆన్‌లైన్ సేవలు జరిగేలా తక్షణ చర్యలు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యశాల సిబ్బంది నిర్లక్ష్యంపై ఫిర్యాదు


జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తున్న కోటపాటి

పామూరు జూన్ 15 : మండలంలోని బొట్లగూడూరు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యంపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ సురేష్, డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ సృజనకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేశారు. స్థానిక వైద్యశాలలోని డాక్టర్ బాధ్యతారాహిత్యం, సిబ్బంది నిర్లక్ష్యం గురించి బొట్లగూడూరు, రేణిమడుగు, మోపాడు, అప్పమాంబపురం, కంభాలదిన్నె గ్రామస్థులు జనార్దన్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. ఆయా గ్రామస్థులతో కలిసి శనివారం కోటపాటి వైద్యశాలను పరిశీలించారు. వైద్యశాలలో పనిచేస్తున్న ఒక డాక్టర్‌పై మహిళా సిబ్బంది చేసిన ఆరోపణలపై జిల్లా వైద్యాధికారులు శనివారం విచారణ చేపట్టారు. వైద్యశాల సిబ్బంది పనితీరులో మార్పు రాకపోతే ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఈసందర్భంగా కోటపాటి హెచ్చరించారు. అధికారులను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సర్పంచ్ వై.బాల, అనపర్తి శశిమహేశ్వరరావు, కోటపాటి నరసింహారావు, కోట వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

మొక్కులు చెల్లించుకున్న టీడీపీ కార్యకర్తలు

పీసీపల్లి, జూన్ 15: కనిగిరి ఎమ్మెల్యేగా డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఎన్నికైతే కాలినడకన మాలకొండకు వస్తామని టీడీపీ కార్యకర్తలు మొక్కుకున్నారు. ఆయన విజయం సాధించడంతో శనివారం మాలకొండకు నడిచివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. దివాకరపల్లి గ్రామానికి చెందిన నీలం వెంకటేష్, అడివిలోపల్లి గ్రామానికి చెందిన కోడూరి మల్లికార్జున్‌లు ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందితే పుణ్యక్షేత్రమైన మాలకొండకు నడిచివచ్చి నరసింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటామని మొక్కుకున్నారు. ఈనెల 4వ తేదీన జరిగిన ఓట్ల లెక్కింపులో ఉగ్ర నరసింహారెడ్డి విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో వీరిరువురు శనివారం వారివారి గ్రామాల నుండి మాలకొండకు కాలినడకన వెళ్లారు. అక్కడ నరసింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

దొనకొండలో.. దొనకొండ, జూన్ 15: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం భారీ మెజార్టీ సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల టీడీపీ నాయకులు శనివారం 101 టెంకాయలు కొట్టి మొక్కుబడి తీర్చుకున్నారు. టీడీపీ మండల నాయకులు బీరాల సీతారామయ్య, బత్తుల బ్రహ్మయ్యలు చందలూరు వద్దగల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 101 టెంకాయలు కొట్టి సీఎం చంద్రబాబు పట్ల వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

దర్శి, జూన్ 15: మండలంలోని చలివేంద్ర గ్రామానికి చెందిన దారా రాములు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మృతుడు దర్శి-అద్దంకి రోడ్డులోని శేషం చిన్నరమణయ్య ఇంటి వద్ద కొన్ని రోజులుగా పెయింటింగ్ పని చేస్తున్నాడు. గత వారం రోజులుగా అనివార్యకారణాలతో పనులు నిలిచిపోయాయి. రాములు ఆఇంటి వద్దే తిరుగుతూ ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యం సేవించి అక్కడ మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ క్షతగాత్రుడు మృతి

దర్శి, జూన్ 15: దర్శి-కురిచేడు రోడ్డులో రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడిన సీహెచ్ నర్సింహారావు శనివారం గుంటూరులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని మారెడ్డిపల్లికి చెందిన నర్సింహారావు ఈనెల 12వ తేది రాత్రి దర్శి-కురిచేడు రోడ్డులో ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తర లించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి.. రూ.60 వేలు, సెల్‌ఫోన్ చోరీ

దొనకొండ, జూన్ 15: మండలంలోని ఇండ్లచెరువు గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఒక వ్యక్తిపై దారికాచి దోపిడి చేసిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు.. ఇండ్లచెరువు గ్రామానికి చెందిన శ్రీరామ్ కాశయ్య దొనకొండలోని బస్టాండ్ సెంటర్‌లో పండ్ల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. ప్రతిరోజు ఉదయం వచ్చి రాత్రి దుకాణం మూసి ఇండ్లచెరువు వెళ్తుంటాడు.

శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో మరో ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు అ నుసరిస్తూ కాశయ్య తలపై వెనుకనుంచి కొట్టారు. దీంతో ఆయన కిందపడి పోవటంతో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.60వేలు నగదు, సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యారు. బాధితుడు కాశయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై సంపత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు అదుపుతప్పి యువకుడు మృతి

పీసీపల్లి, జూన్ 15: ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నేరేడుపల్లి అడ్డరోడ్డు సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన స్వర్ణ రమేష్(38) పీసీపల్లి నుండి ద్విచక్ర వాహనంపై నేరేడుపల్లి వెళ్తున్నాడు. నేరేడుపల్లి అడ్డరోడ్డు సమీపంలోని చప్టా వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంకితభావంతో అధికారులు పనిచేయాలి

- గాడి తప్పిన వ్యవస్థలను దారిన పెడతా!
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, జూన్ 15: అంకితభావంతో అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రజలకు పనులు చేయకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే సహించేది లేదన్నారు. పనుల కోసం ప్రజల నుంచి ముడుపులు తీసుకుంటే ప్రతి పైసా కక్కిస్తానని హెచ్చరించారు. గాడి తప్పిన వ్యవస్థలను దారిన పెట్టాడానికే వచ్చానని చెప్పారు. శనివారం ఎంపీపీ రామణ మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ శాఖ లంచాలకు నిలయంగా మారిందన్నారు. మండలంలోని చందులూరుపాడు గ్రామానికి చెందిన నరసయ్య అనే రైతు ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే లంచంగా 25వేలు అడిగారని ఎమ్మెల్యేకు, అధికారులకు ఫిర్యాదు చేశారు. నాకు సంబంధంలేదని అంతా ఈఈ స్థాయిలో జరుగుతుందని విద్యుత్ ఏఈ రసూల్ చెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

వెలుగుశాఖలో అవినీతికి అంతేలేకుండా పోయిందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. కమీషన్లు ఇస్తేనే పని జరుగుతుందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వైసీపీ నాయకులు చెప్పిన విధంగా నీళ్లు ఇస్తున్నారని, టీడీపీ కార్యకర్తలకు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఈక్రమంలో ఏఈ పవన్ సమాధానం చెప్పేందుకు ప్రయత్నించచగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షకాలం వస్తున్నా చెరువులు మరమ్మతులు చేయలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పందువ గండి ప్రాజెక్ట్ లాకులు తెగిపోయినా మరమ్మతులు గురించి పట్టించుకోలేదని తెలపడంతో ఇరిగేషన్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. వెంటనే అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు కూడా సరిగాలేదని డాక్టర్ ఉగ్రకు ఫిర్యాదుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో సాగర్ నీళ్ల సరఫరా చేయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేశారని, అలాంటి వారిని వదలనని ఎమ్మెల్యే హెచ్చరించారు.

సమావేశంలో ఎంపీడీవో రామచంద్రరావు, తహసీల్దార్ డానియల్, జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మారని వైసీపీ నేతల తీరు

- యథేచ్ఛగా మట్టి తరలింపు
- రెండు టిప్పర్ల పట్టివేత


పోలీసుస్టేషన్‌కు తరలించిన టిప్పర్

దర్శి, జూన్ 15: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం అందటంతో దర్శి సీఐ షేక్ షమీముల్లా ఆధ్వర్యంలో పోలీసులు వాటిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం మారినప్పటికీ వైసీపీ నాయకుల తీరు మారలేదు. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండలు, ప్రభుత్వ భూముల్లోని మట్టిని యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకున్న విషయం తెలిసిందే. ఆసమయంలో అధికారులు కూడా పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా కొందరు వైసీపీ నాయకులు రహస్యంగా మట్టి తరలిస్తున్నారు. ఈవిషయాన్ని గుర్తించిన పోలీసులు టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేశారు.

జరిమానాతో వదిలించుకునే యత్నాలు

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను సులభంగా బయటకు తెచ్చుకునేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తహసీల్దార్ కార్యాలయంలో జరిమానా చెల్లించి విడుదల చేయించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన రెవెన్యూ, పోలీసు అధికారులు వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా మట్టి తరలింపునకు బాధ్యులైన వారిపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సి ఉంది.

ఏఎంసీ చైర్మన్ పదవీ కోసం టీడీపీ నేతల యత్నాలు

దర్శి, జూన్ 15: దర్శి ఏఎంసీ చైర్మన్ పదవి కోసం పలువురు టీడీపీ నాయకులు ప్రయత్నాలు ఆరంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటుచేసిన కార్యవర్గం కొద్ది రోజుల క్రితం స్వచ్ఛందంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఏఎంసీ నూతన కార్యవర్గం ఏర్పాటుకు మార్గం సులభమైంది.

ఈ నేపథ్యంలో పలువురు టీడీపీ నాయకులు చైర్మన్ పదవి కోసం కృషి చేస్తున్నారు. దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్‌ను పలువురు నాయకులు కలిసి ఏఎంసీ చైర్మన్ పదవి ఇప్పించాలని కోరినట్లు తెలిసింది. పదవుల కేటాయింపు విషయంలో వారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

గత ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం మనస్ఫూర్తిగా కృషిచేసిన వారిలో ఒకరికి ఈ పదవి ఇవ్వాలని ఆలో చిస్తున్నట్లు సమాచారం. కొంతమంది నాయకులు ఎన్నికల సమయంలో నిబద్ధతతో పనిచేయలేదనే విమర్శలు ఉన్నాయి. మరికొంతమంది వెన్నుపోటు పొడిచారనే ప్రచారం జరుగుతుంది దీంతో పదవుల కేటాయింపు విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించాలని నాయకులు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం

ఈనేపథ్యంలో ఏఎంసీ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో వేచి చూడాలి.

పేద కుటుంబాల్లో వెలుగులు విద్యతోనే సాధ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, జూన్ 15: పేదల కుటుంబాల్లో వెలుగులు విద్యాభివృద్ధితోనే సాధ్యమతుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు విద్యాభివృద్ధి పేరుతో పక్కదోవ పట్టాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా సరళతరమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులు ఇంగ్లీషులో కూడా సరళతరంగా మాట్లాడేవిధంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇకనుంచి ఉపాధ్యాయులు బాత్‌రూంల వద్ద పడిగాపులు పడాల్సిన అవసరం లేదన్నారు. ఇక నుంచి ఉపాధ్యాయులు ఒత్తిడితో పాఠ్యాంశాల బోధించాల్సిన పనిలేదన్నారు. ప్రతి కుటుంబలో చదువుకునే విద్యార్థులు ఎంతమంది ఉన్నా వారికి ఉచిత విద్యాబోధనతోపాటు ప్రతి ఏటా తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తామన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటి, విద్యార్థులతోనూ నాటించారు. కార్యక్రమంలో ఎంఈవోలు దేవిరెడ్డి రామిరెడ్డి, యూవీ నారాయణరెడ్డి, సంజీవి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు కృషి

వెలిగండ్ల, జూన్ 15: వెలిగండ్లలో క్రీడాప్రాంగణం ఏర్పాటుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థులు మంచి ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. విద్యార్థులకు ప్రత్యేకంగా విహారయాత్ర ఏర్పాటు చేస్తానని తెలిపారు. క్రీడా ప్రాంగణం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్కూల్ పక్కనే ఉన్న దేవుడు మాన్యం భూమిని ఎండోమెంట్ అధికారులతో మాట్లాడి కొనుగోలుచేసి క్రీడా ప్రాంగణంగా ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఎంఈవో దాస్ ప్రసాద్, రామిరెడ్డి, హెచ్ఎం రాఘవాచారి, పీవీఎన్ రవికుమార్, మాలపాటి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బొద్దికూరపాడు ఉన్నత పాఠశాల

- పెచ్చులూడుతున్న గది శ్లాబ్
- పొంచి ఉన్న ప్రమాధం
- నూతన భవనాల పనులు పూర్తిచేసి మార్చాలని తల్లిదండ్రుల విన్నపం

తాళ్లూరు, జూన్ 15: మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. శుక్రవారం ఏడు, ఎనిమిది తరగతి గదలుకు చెందిన వరండా శ్లాబ్ పెచ్చుకలు ఊడి పడ్డాయి. హైస్కూలు ముగిసిన తరువాత సాయంత్రం వేళ విద్యార్థులు లేని సమయంలో వరండా శ్లాబ్ కూలడంతో ప్రమాదం తప్పింది. బొద్దికూరపాడు జడ్పీ హైస్కూల్‌లో పూర్వపు రేకులషెడ్ తరగతి గదులకు 20ఏళ్ల క్రితం శ్లాబ్ వేశారు. ఆ గదులకు పిల్లర్స్ లేకపోవటంతో రెండు తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిస్థానంలో నూతన భవనాలు నిర్మాణాలు చేపట్టినా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తరగతుల నిర్వహణకు అనువుగా లేకపోవటంతో గత్యంతరం లేక శిథిలభవనాల్లోనే కొనసాగుతున్నాయి.


శిథిలమైన వరండా పిల్లర్

వేసవి సెలవులు ముగిసినా అసంపూర్తిగా ఉన్న భవనాల పనులను అధికారులు పూర్తి చేయలేదు. ఈనెల 13 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. తరగతి గదుల్లోని పెచ్చుకలు ఊడి పడుతూ ప్రమాదకంగా ఉన్నా ప్రత్యామ్నాయం లేక ఆ గదుల్లోనే క్లాసులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంభయంగా గడుపుతున్నారు. ఆ గదుల శ్లాబ్ పెచ్చుకలు ఊడి పడి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. ఆ గదుల్లో క్లాసులు నిర్వహిస్తే ఏదైనా అనుకోని సంఘటన జరిగే ప్రమాదముందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.


పెచ్చులు ఊడిన జడ్పీహైస్కూల్ వరండా శ్లాబు

అసంపూర్తి పనులతో మిగిలిన తరగతి గదులకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాల్సి ఉంది. అధికారయంత్రాంగం మీనమేషాలు లెక్కించకుండా తరగతి గదుల పనులను పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాకాండా శిథిలావస్థకు చేరిన గదుల్లోనే క్లాసులు నిర్వహిస్తే భవిస్యత్తుల్లో ఏదైనా జరగరాని సంఘటన జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. బొద్దికూరపాడు గ్రామం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ స్వగ్రామం కావటం కొసమెరుపు.

ఏవోకు శాస్త్రవేత్తల ప్రశంసలు


సర్టిఫికెట్ అందుకుంటున్న వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు

తాళ్లూరు, జూన్ 15: సామాన్య రైతులు అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునన్న అంశాన్ని స్థానిక వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు ప్రయోగాత్మకంగా వివరించి పలువురు శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకున్నారు. ఆశాఖ ఉన్నతాధికారుల చేతులమీదుగా ఉత్తమ శిక్షణకుడిగా సర్టిఫికెట్ అందున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డివలప్‌మెంట్, పంచాయతీరాజ్ నిర్వహించిన ఇంప్లిమెంటింగ్ గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్, ప్రాసెస్ అండ్ ప్రొటోకాల్ ఫర్ సర్టిఫికెషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి శిక్షణలో ఏవో బి.ప్రసాదరావు నాణ్యమైన పంటల సాగు, దిగుబడి గురించి వివరించారు. సెమినార్‌లో అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా మన ఉత్పత్తులు, రసాయన రహితంగా చేపట్టాల్సిన సాగు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆశాఖ డైరెక్టర్లు నిత్య వి.జి, సూర్జిత్ విక్రమన్, డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్ చేతుల మీదుగా ఏవో సర్టిఫికెట్ అందుకున్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, జూన్ 15: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి కె.భరత్‌చంద్ర పేర్కొన్నారు. ఈనెల 29న జరిగే ఈ కార్యక్రమంలో పోలీసులు రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవటంతో విలువైన సమయంతో పాటు ప్రశాంతమైన జీవనం గడపవచ్చునని చెప్పారు. అలాగే, న్యాయవాదులు, పోలీసులు జాతీయ లోక్‌అదాలత్‌తో కలిగే ప్రయోజనాలు కక్షిదారులకు వివరించాలన్నారు. ఎక్కువ కేసులు రాజీ చేసేవిధంగా కృషి చేయాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

పామూరు, జూన్ 15: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం మాలకొండ లోని లక్ష్మీనరసింహస్వామి దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో బొట్లగూడురు, బోడవాడ గ్రామస్థులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులపై ఉగ్రతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు చర్చించారు.. అనంతరం మోపాడు గ్రామంలో సీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, ఇరిగినేని రవీంద్ర, గుర్రం వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, ఎంహాసేన్‌రావు యాదవ్, బొయిళ్ల నారాయణరెడ్డి, బొల్లా నరసింహా రావు, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, తిరివీధి జనార్దనరావు, దేవరపు మాల్యాద్రి, దారపనేని సుబ్బారావు, ఎం.గిద్దయ్య యాదవ్, తెలజాల ప్రసాద్, బాబు, డాక్టర్ చంద్రశేఖర్, సర్పంచ్‌లు దాసరి రత్తయ్య, వై.బాల, మాజీ సర్పంచ్ కోటపాటి విశాలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మార్కెట్.. పట్టించుకోని పంచాయతీ పాలకులు


అధ్వానంగా ఉన్న మటన్ మార్కెట్

పామూరు, జూన్ 15: పామూరులోని మటన్ మార్కెట్ నిర్వహణ సక్ర మంగా లేక అధ్వానంగా తయారైంది. పామూరు మేజర్ పంచాయతి ఆధ్వ ర్యంలో స్థానిక కందుకూరు రోడ్ చెరువు కట్ట ముందు భాగంలో రేకుల షెడ్లతో 8 గదులు సుమారు 12 సంవత్సరాల క్రితం నిర్మించి బోరును ఏ ర్పాటుచేశారు. అప్పటినుంచి ఆ గదుల్లో మటన్ వ్యాపారం చేసుకొనేవారు పంచాయతికి అద్దెలు చెల్లిస్తూ వ్యాపారం చేసుకొంటున్నారు. రేకులన్నీ పగి లిపోయాయి. గదుల ఫ్లోరింగ్‌లో గుంతలు ఏర్పడ్డాయి. మాంసం, చికెన్ ఒకే స్టాల్‌లో అమ్మకాలు జరుగుతుండటంతో మార్కెట్ అపరిశుభ్రంగా ఉంటున్నది. దీంతో కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి మార్కెట్‌ను మరమ్మతులు చేయించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని పలువుంర కోరుతున్నారు.

ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌గా వెంకటేశ్వర్లు

పామూరు జూన్ 15: పామూరు ఎస్‌బీఐ నూతన బ్రాంచ్ మేనేజర్‌గా ఏ.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దర్శి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా రావిగుంటపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు.



నరసరావుపేటలోని స్టేడియం వద్ద నాటి అన్న క్యాంటీన్(పాత చిత్రం)

అన్న క్యాంటీన్లకు పునర్వైభవం



- పునరుద్ధరణ పనులు చేపట్టిన పురపాలక సంఘాలు
- త్వరలోనే మళ్లీ రూ.5కే అల్పాహారం, రూ.5కే భోజనం
- పేదలకు ఆహార భద్రత కల్పించనున్న కూటమి ప్రభుత్వం



నరసరావుపేటలోని స్టేడియం వద్ద అన్న క్యాంటీన్ నేటి దుస్థితి



నేడు అన్న క్యాంటీన్ లోపల పరిస్థితి

నరసరావుపేట, జూన్15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు అన్న క్యాంటీన్‌లను మళ్లీ నిర్వహించనుంది. రూ.5కే భోజనం.. అల్పాహారం లభించే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయి. రానున్న వంద రోజుల్లో పేదలకు ఆహారం అందించే దిశగా ప్రభుత్వం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. అన్న క్యాంటీన్‌లు పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ విధ్వంసంలో శిథిలమైన అన్న క్యాంటీన్‌ల పురుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న అన్న క్యాంటిన్‌లను పురపాలక సంఘ అధికారులు శనివారం స్వాధీన పరచుకున్నారు. పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.

క్యాంటీన్‌ల ప్రాంగణాలు పిచ్చిమొక్కలు, దుమ్ముతో నిండిపోయాయి. వీటిని శుభ్రపరిచే పనులు నిర్వహిస్తున్నారు. గతంలో క్యాంటీన్ నిర్వహణకు వినియోగించిన ఫర్నిచర్ చాలాచోట్ల మాయమైంది. ఫ్యాన్‌లు కూడా అపహరించారు. క్యాంటీన్‌ల అద్దాలను ధ్వంసం చేశారు. క్యాంటీన్‌ల రూపురేఖలు మారిపోయాయి. పురపాలక సంఘ అధికారులు క్యాంటీన్‌లను శుభ్రపరిచే పనులు చేపట్టారు. అన్న క్యాంటీన్‌లకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు పురపాలక సంఘాలు పనులు నిర్వహించనున్నాయి.

అన్న క్యాంటీన్‌లో అహారం పంపిణీ ఏర్పాట్లు (పాత చిత్రం)



వివిధ శాఖల అధీనంలో

ఉన్న క్యాంటీన్ భవనాలను మునిసిపాల్టీలు స్వాధీనం చేసుకున్నాయి. నరసరావుపేటలోని ఒక క్యాంటీన్ భవనంలో కళాక్షేత్రం ఏర్పాటు చేశారు. దీనిని ఖాళీ చేయించి భవనాన్ని మునిసిపాల్టీ స్వాధీనం చేసుకుంది. మునిసిపల్ కమిషనర్‌లు క్యాంటీన్ భవనాలను పరిశీలించి తాజా పరిస్థితి, ఫర్నిచర్, పరికరాలు తదితర అంశాలపై ప్రాథమిక నివేదికను రూపొందించారు. క్యాంటీన్‌ల పునరుద్ధరణకు పాత డిజైన్ ప్రకారం భవనంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అంచనాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియను మునిసిపాల్టీలు ప్రారంభించాయి. రానున్న వంద రోజుల్లో అన్న క్యాంటీన్‌లను ప్రారంభించేందుకు ప్రభుత్వ ఏర్పాటు చేస్తోంది.

ప్రభుత్వం పేదలకు అన్న క్యాంటీన్‌ల ద్వారా ఆహార భద్రత కల్పించేందుకు తెలుగుదేశం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లను ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. కనీసం వీటికి భద్రత కూడా కల్పించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్‌లకు పూర్వవైభవం త్వరలోనే సంతరించుకోనుంది. పేదలకు రూ.5కే అల్పాహారం, అదే ధరకు భోజనం అన్న క్యాంటీన్‌ల ద్వారా అందించనున్నారు. గతంలో అక్షయపాత్ర ఫౌండేషన్ క్యాంటీన్‌లో భోజనం పంపిణీ చేసింది. జిల్లాలోని క్యాంటీన్‌ల ద్వారా ఒక్కో చోట ఐదు వందల మంది కి అల్పాహారం, భోజనం క్యాంటీన్‌ల ద్వారా అందించారు. రుచికరమైన భోజ నం, అల్పాహారం రూ.5కే అందించారు. అల్పాహారం ఇడ్లీ, పూరి, ఉప్మా ఇలా రోజుకో రకం క్యాంటీన్ లో ఏర్పాటు చేశారు. భోజనం ఒక కూర, సాంబారు, పెరుగు, రైస్ వడ్డించారు. రూ.15 చెల్లిస్తే ఒక రోజుకు సరిపడా అల్పాహారం, భోజనం క్యాంటీన్ ద్వారా లభించేది. ఒక్కో క్యాంటీన్ సుమారు రూ.39 లక్షల వ్యయంతో నాడు నిర్మించారు.

గ్రానైట్ గగ్గోలు



వేమవరం : గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద అమ్మకాలకు సిద్ధంగా ఉన్న హద్దు రాళ్లు

ఫ్యాక్టరీల్లో పేరుకుపోయిన జగనన్న హద్దు రాళ్లు



- గతంలో ఒత్తిడి తెచ్చి తయారు చేయించిన అధికారులు
- టీడీపీ అధికారంలోకి రావడంతో రాళ్ల గతి ఏమిటని ఆందోళన
- ఏపీఎండీసీని నమ్మి నష్టపోయామని యాజమాన్యాల ఆవేదన
- సీఎం చంద్రబాబును కలిసేందుకు ఫ్యాక్టరీల యజమానుల సిద్ధం

బల్లికురవ. జూన్ 15: గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన వైఎస్ ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల పాలిట శాపంలా మారింది. పంట భూములను సర్వే చేసి వాటికి హద్దులు ఏర్పాటు చేసేందుకు అవసరమని బలవంతంగా లక్షలు వెచ్చించి హద్దు రాళ్లను తయారు చేయించారు. అయితే వీటిని వైసీపీ ప్రభుత్వం కొను గోలు చేయకపోవడంతో గ్రానైట్ పరిశ్రమలు సంక్షోభంలోకి వెళ్లాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో భూరక్ష హద్దు రాళ్లు గుది బండలా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఫ్యాక్టరీకి గతంలో టార్గెట్లు ఇచ్చి మరీ రాళ్లను కట్ చేయించారని తెలిపారు. బల్లికురవ, మార్టూరు మండలాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీల్లో మూడేళ్లుగా హద్దు రాళ్లను తయారు చేయించింది. ఒక్కో రాయికి రూ.300 వంతున చెల్లిం చేలా ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ (ఏపీఎండీసీ) ద్వారా కాంట్రాక్టు పొందిన వారు ఫ్యాక్టరీల యజమానులతో ఒప్పందం చేసుకున్నారు. మొదట్లో తమకు గిట్టుబాటు కావడం లేదని అడ్డం తిరగ్గా ఆ కాంట్రాక్టరు అధికార్లతో బెదిరించి రాళ్ల తయా రు చేయించారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యేకంగా పెట్టు బడులు పెట్టిన యాజమానులు హద్దు రాళ్లు తయారు చేసి, వాటిపై జగనన్న భూరక్ష అని పేరు ముద్రించి అందించారు. మొదట్లో కొంత ఆలస్యమైనా నగదు ఇచ్చారని ఏడాది నుంచి రాళ్లను కొనుగోలు చేయడం లేదు. దీంతో గ్రానైట్ ఫ్యాక్టరీలలో సుమారు పది లక్షల పైచిలుకు హద్దు రాళ్ల నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి. భూసర్వే కమిషనర్, ఏపీఎండీసీ కార్యాలయాల్ని పలుమార్లు సంప్రదించిన వారు ఒకరిపై ఒకరు చెప్పు కుంటున్నారు తప్ప రాళ్ల విషయం తేల్చడంలేదని యజమానులు తెలిపారు. తమ చేత బలవంతంగా తయారు చేయించిన హద్దు రాళ్లు నిరుపయోగమని వాటని ఏమి చేసుకోవాలో అర్థం కావడం లేదని, ఫ్యాక్టరీల ప్రాంగణాల్లో తమ పనులకు కూడా అడ్డంకిగా ఉన్నాయని వారంటున్నారు. హద్దు రాళ్ల విషయంలో ఒత్తిడి తెచ్చిన వారు ఏడాది నుంచి పట్టించు కోలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం చొరవ తీసుకుని హద్దు రాళ్లను త య ా ర ు చే యిం చిన అధికార్లపై చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

మూత పడిన ఏపీఎండీసీ ఫ్యాక్టరీ

భూరక్ష పథకం హద్దు రాళ్లను తయారు చేసి అన్ని జిల్లాలకు పంపేందుకు ప్రభుత్వం బల్లికురవలో రెండేళ్ల క్రితం కటింగ్ మిషన్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసింది. ఆరు నెలల నుంచి ఈ ఫ్యాక్టరీలో పనులు నిలిచి పోయాయి. కోట్ల పెట్టుబడులు పెట్టిన ఏపీఎండీసీ ఫ్యాక్టరీ మూత పడినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గుదిబండలా హద్దు రాళ్లు



గత వైసీపీ ప్రభుత్వం మైనింగ్ అధికార్లతో బెదిరించి జగనన్న భూరక్షణ పథకానికి అవసరమని తయారు చేయించిన హద్దు రాళ్లు గుదిబండలా మారాయి. ఒక్కో ఫ్యాక్టరీలో వేలల్లో రాళ్లు నిల్వలు ఉన్నాయి. వీటిని కొనుగోలు చేయా లని ఎన్నిమార్లు కోరినా పట్టించు కోలేదు. ఈ రాళ్లతో తమకు తీవ్ర నష్టాల తప్పవు. భూసర్వే సక్రమంగా జరగ లేదు. రాళ్లను తయారు చేయించిన అధికార్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుని గ్రానైట్ యజమానులను ఆదుకోవాలి.

- చిట్టిపోతు మస్తానయ్య, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం అధ్యక్షుడు, బల్లికురవ

జేఎన్‌టీయూపై.. నీలినీడలు



జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల

- నరసరావుపేటలో కళాశాలపై వర్సిటి పెద్దల కుట్ర
- అధ్యాపకుల నియామకంలో అంతులేని నిర్లక్ష్యం
- అతిథి అధ్యాపకులే దిక్కు
- నాలుగేళ్లుగా ఇదే తంతు
- ప్రిన్సిపాల్‌నూ బదిలీ చేశారు
- విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న వర్సిటీ అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్శిటీ పెద్దలు పనిచేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడం లేదు. కళాశాలలో ఏ ఒక్క సమస్యా పరిష్కారానికి నోచుకోవడం లేదు. నూతన భవనాల నిర్మాణంలోనూ అలసత్వాన్ని ప్రదర్శి స్తోంది. చివరకు విద్యార్థులకు బోధనా సమస్యల పరిష్కారాన్ని గాలికొదిలేసింది. అధ్యాపకులను నియమించడంలో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో వర్సిటీ ఘోరంగా విఫలమైంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇంజనీరింగ్ విద్యాభివృద్ధి లక్ష్యంతో నాడు సీఎం చంద్రబాబు నాయుడు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పారు. ఈ కళాశాలను 2016లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించింది. సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. ఒక్కో బ్రాంచ్‌కి 60 సీట్లు ఉన్నాయి. కళాశాలలో దాదాపు వెయ్యి మం దికి పైగా విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తు న్నారు. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి రూ.7.11 కోట్ల వార్షిక బడ్జెట్ ను నాడు కేటాయించింది. తొమ్మిది మంది ప్రొఫెసర్‌లు, 53 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, 18 అసోసియేట్ ప్రొఫెసర్‌లను కళాశాలకు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేసింది. ఈ మేరకు అధ్యా పకులను యూని వర్సిటీ నేటికీ నియమించలేదు.

అతిథి అధ్యాపకులతో కాలక్షేపం

పర్మినెంట్ అధ్యాపకులను నియమించాల్సిన యూనివర్సిటీ అతిథి అధ్యాపకులతో కాలం వెళ్ళబుచ్చుతోంది. 73 మంది అధ్యాపకుల కొరత నెలకొంది. నామమాత్రంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి చేతులు దులుపుకుంది. కనీసం అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించే విషయంలోనూ వర్శిటీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. గెస్ట్ లెక్చరర్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఆ అధ్యాపకులు అప్పుడప్పుడు వచ్చి తరగతులు నిర్వహిస్తుంటారు.

గత ఏడాది మిగిలిన 80 సీట్లు

అధ్యాపకుల కొరత వెంటాడుతుండటంతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. అధ్యాపకులు లేకపోడంతో ఇక్కడ విద్యార్థులు చేరేందుకు ఇష్టపడటంలేదు. దీంతో గత ఏడాది సీట్లు మిగిలిపోయాయి. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఎంతగానే ఉపయోగపడాల్సిన కళాశాలను నిరుపయోగంగా వర్శిటీ మార్చేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్లు వెచ్చించి భవనాలను నిర్మిం చారు. అధ్యాపకులను భర్తీ చేయడాన్ని విస్మరించడం గమనార్హం. కళాశాలలో ఐదు బ్రాంచ్‌లలో 300 సీట్లు ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో 220 సీట్లు భర్తీ అయ్యాయి. 80 సీట్లు మిగిలిపోయాయి.

ఎమ్మెల్యేలు.. ఎంపీలు చొరవ తీసుకోవాలి

కాకినాడ జేఎన్‌టీయూ నిర్లక్ష్యానికి బలై పోతున్న నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను కాపాడటంతో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు.. ఎంపీలు చొరవ తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరు తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో స్థాపించి, అధ్యాపకుల నియమకాలకు ఉత్తర్వులు విడుదల చేయడంతో పాటు ఇందుకు బడ్జెట్‌కు కేటాయింపులు జరి గాయి. నాడు సీఎంగా చంద్రబాబు నాయుడు కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మళ్లీ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కళాశాల అభివృద్ధి చెందుతుందని తల్లిదండ్రులు ఆశపడు తున్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను నియమించే విధంగా ఎమ్మెల్యేలు.. ఎంపీలు కృషి చేయాల్సి ఉంది.

కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

కళాశాల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. పనులు సాగుతున్నాయి. వసతి గృహాలు అందుబాటులోకి రాలేదు. మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. తరగతి గదులు, ల్యాబ్‌లను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలి. నరసరావుపేట పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉండటం వసతి గృహాలు క్యాంపస్‌లో లేకపోవడంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. యుద్ధప్రాతిపదికన వసతి గృహాల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలి.

ఏడుగురే అధ్యాపకులు.. వీరిలో ప్రిన్సిపల్ బదిలీ

పర్మినెంట్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నది ఒకే ఒక ప్రొఫెసర్ అది కూడా ప్రిన్సిపల్. ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాసరావును కూడా రెండు రోజుల క్రితం బదిలీ చేశారు. ప్రొఫెసర్ పోస్టులు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు 53 మందికి గాను నలుగురు మాత్రమే ఉన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్‌లు 18 మందికి గాను కేవలం ఇద్దరే ఉన్నారు. ఇద్దరిలో క్రీడలకు సంబంధించి ఒక అసోసియేటెడ్ ప్రొఫెసర్ ఉన్నాడు. కొత్త ప్రిన్సిపల్‌ను నియమించారని చెబుతున్నారు. 73 మంది అధ్యాపకుల నియమాకాల విషయంలో వర్సిటీ పెద్దలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

అమర్నాథ్‌కు.. న్యాయం జరిగేనా?



అమర్నాథ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చంద్రబాబునాయుడు, అనగాని సత్యప్రసాద్ (పాత చిత్రం)

- బాలుడి హత్య జరిగి నేటికి ఏడాది
- నత్తనడకన సాగుతున్న విచారణ..
- ఇప్పటికీ బెయిల్‌పైనే నిందితులు

బాపట్ల, జూన్15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న బాలుడు అమర్నాథ్‌గౌడ్‌ను నడిరోడ్డుపై పెట్రోలు పోసి తగలబెట్టిన అమానవీయ ఘటన జరిగి నేటికి ఏడాది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బాలుడి మృతదేహంతో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ చెరుకుపల్లి సెంటర్‌లో మూడు గంటల పాటు నడిరోడ్డుపై ధర్నాకు దిగారు. అయినప్పటికీ ప్రభు త్వం వైపు నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో బాలుడి కుటుంబానికి ఆర్థిక పరమైన అండను టీడీపీ అందించింది. అప్పటి ప్రతిపక్ష నేత, నేడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు సైతం బాలుడి కుటుం బాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అమ ర్నాథ్‌గౌడ్ హత్య తదనంతర పరిణామా లలో కూడా గత ప్రభు త్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. ము ఖ్యంగా నిందితులకు త్వరితగతిన శిక్ష పడే విషయంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచా రణను వేగవంతం చేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వ మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. హత్య జరిగి ఏడాది కావొ స్తున్నా నిందితులు నలుగురూ బెయిల్ పై బయటే ఉన్నారు. వారంతా అరెస్ట్ జరి గిన రెండు నెలల్లోనే బయటకు వచ్చి ఏకంగా బాధిత కుటుం బాన్నే మరో మారు భయభ్రాంతులకు గురిచేసే సాహసానికి ఒడిగట్టారు. బాలుడి కుటుంబానికి న్యాయం జరగడంతో పాటు నిందితులకు శిక్ష పడాలని నినదించిన నాటి పతిపక్ష నేత చంద్రబాబు నేడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. మృతదేహంతో నడి రోడ్డుపై మూడు గంటల పాటు ధర్నా చేసిన ఎమ్మెల్యే అనగాని ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా కొలువుదీరారు. ఆ కుటుంబాన్ని మరింతగా ఆదుకోవడంతోపాటు నిందితులకు శిక్షపడే విషయంలో ప్రభుత్వం వైపు నుంచి ఇవ్వాల్సిన న్యాయ సహాయాన్ని త్వరితగతిన ఇస్తూ వారికి శిక్షపడేటట్లు చేస్తేనే బాలుడి అమర్నాథ్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరడంతో పాటు నాడు టీడీపీ చేసిన పోరాటానికి సార్థకత లభిస్తుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గతేడాది జూన్ 16న..

తన అక్కను ఎందుకు వేధిస్తున్నారని అడిగిన పాపానికి బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను అతి కిరాతకంగా పెట్రోలు పోసి తగులబెట్టిన ఉదంతం గతేడాది జూన్ 16న రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లి మండల పరిధిలో జరిగింది. ఈ దారుణ ఘటనలో ఏ1 నిందితుడిగా ఉన్న పాము వెంకటేశ్వరరెడ్డి(20) వైసీపీ సానుభూతిపరుడు కావడం గమనార్హం. ఇతనితో పాటు మరో ముగ్గురిని నిందితులుగా పోలీసులు చూపెట్టారు. ఆ ఉన్మాద చర్యలకు పాల్పడిన నిందితులలో ఏ1గా ఉన్నది వైసీపీ సానుభూతిపరుడు కావడం వల్లే అప్పటి సీఎం జగన్ ఆ బాధిత కుటుంబాన్ని పరామ ర్శించడానికి రాలేదనే చర్చ ఆ సమయంలో నడిచింది.



అమర్నాథ్ మృతదేహంతో రోడ్డు ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే అనగాని (పాత చిత్రం)

రోడ్డెక్కిన ప్రజా సంఘాలు

బాలుడి దారుణ హత్యను ఖండిస్తూ పార్టీలకతీతకంగా పెదఎత్తున ప్రజా సంఘాలతో పాటు బలహీనవర్గాల ఐక్య వేదికలు కూడా రోడ్డెక్కి బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని నినదించాయి. రేపల్లె టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బాలుడి మృతదేహంతో రోడ్డుపైనే మూడు గంటలు బైఠాయించి బాధిత కటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హత్య జరిగిన తర్వాత బాధిత కుటుంబం విషయంలో స్థానిక నేత, ఎంపీ మోపిదేవి వ్యవహరించిన తీరు కూడా విమర్శలను మూటగట్టుకుంది.

సత్వర విచారణ అపహాస్యం

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా సత్వర విచారణ చేపట్టి నిందితులకు శిక్ష పడేటట్లు చూస్తామని అప్పటి వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదు. అలాంటిదేమీ లేకపోగా నిందితులు దర్జాగా బెయిల్‌పై బయటకు వచ్చి బాధిత కుటుంబాన్నే తిరిగి బెదిరించడం పోలీసు వైఫల్యానికి నిదర్శనంగా నిలిచింది. నెలల వ్యవధిలోనే నిందితులందరూ బెయిల్‌పై బయటకు వచ్చి వారి కళ్లముందే తిరుగుతుండడం ఆ బాలుడి కుటుంబానికి మరింత వేదన మిగిల్చింది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణను వేగవంతం చేయడంతో పాటు నిందితులకు కఠిన శిక్ష పడేలా చేసి ఉన్మాద మూకలకు గట్టి హెచ్చరికలను కొత్త ప్రభుత్వం పంపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పశువుల రవాణాకు చెక్

- జిల్లాలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు
- రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల

ఒంగోలు(క్రైం), జూన్ 15: బ్రకీద్ పండుగ సందర్భంగా గోవధను అరికట్ట డానికి రవాణా శాఖ ఆధ్వర్యంలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్. సుశీల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పశువులను వాహనాలలో తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. లారీ యజమానులు అక్రమంగా ఇలాంటి తరలింపులకు పాల్పడితే జరిమానాలు విధించడంతోపాటుగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరు పశువుల తరలింపు చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. జిల్లా అంతా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్‌ను జరుపుకోవాలి



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: ఇతరుల మనోభావాలు దెబ్బతిన కుండా సుహృద్భావ వాతా వరణం లో బక్రీదు పండుగను జరుపుకోవా లని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. ఈనెల 17న బక్రీదు పండుగ సందర్భంగా ముస్లిం, హిందూ మతపెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారుల తో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఏ ఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గోవధ నిషేధం చ ట్టం అమలులో ఉన్నందున పశువుల అక్రమ రవాణా ను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా 18 చెక్‌పోస్టులను ఏ ర్పాటు చేసినట్లు తెలిపారు. డీటీసీ ఆర్.సుశీల మాట్లా డుతూ నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణా జ రగకుండా నిఘాను పెంచినట్లు తెలిపారు. పశుసంవ ర్ధకశాఖ జేడీ బేబీరాణి, డీపీవో ఉషారాణిలు తమశా ఖల పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా, ఓవర్ లోడింగ్ కట్టడికి చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. గతంలో ఘర్షణలకు దారితీసిన ప్రాంతాలపై ఈసారి మరింత దృష్టి పెట్టనున్నట్లు పే ర్కొన్నారు. వెటర్నరీ డాక్టర్లందరూ ఆది, సోమవారాల్లో కచ్చితంగా ఆయా మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. మరో వైపు కలెక్టరేట్‌లో 24గంటలు పని చేసే కంట్రోలు రూ మును ఏర్పాటు చేశామని, అందుకోసం 7093472086, 8096257844 సెల్‌నెంబర్లతో సంప్రదించాలని సూచిం చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు బి.నా రాయణ, జశ్వంత్‌రావు, ఆర్డీవోలు బీవీ.సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, కమిషనర్లు, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలు

ఒంగోలు(క్రైం): బక్రీద్ పండుగ సందర్భంగా గోవధ నివారణ కోసం రవాణశాఖ ఆధ్వర్యలో 18 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు రవాణశాఖ డిప్యూటీ కమిషనర్ ఆ ర్.సుశీల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోవులు, పశువులను వాహనాలలో తరలిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. లారీ యజమానులు అక్ర మంగా ఇలాంటి తరలంపులకు పాల్పడితే జరిమానాలు విధిచడంతో పాటుగా కేసులు నమోదు చేస్తామని స్ప ష్టం చేశారు. పశువులు, గోవులు తరలింపు చర్యలకు పా ల్పడవద్దని హితవు పలికారు. అక్రమంగా పశువులు త రలిస్తే వాహనాలను నిలిపివేస్తామని, జిల్లా అంతా ము మ్మరంగా తనిఖీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ భవనాలపై సొంత పేర్లా!

- టీడీపీ నాయకుల ఖండన

చీమకుర్తి, జూన్15: ప్రభుత్వ ధనం, ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన సొ మ్ముతో నిర్మించిన ప్రభుత్వ భవనాలపై చీమకు ర్తిలో వైసీపీ నాయకుల పేర్లు రాసుకోవటాన్ని తీ వ్రంగా ఖండిస్తున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం చీమకుర్తిలోని టీడీపీ కార్యాల యంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు పలు విషయాలను వెల్లడించారు. 2013సంవత్సరంలో ప్రభుత్వం స్టార్టప్ గ్రాంట్ కింద రూ.50 లక్షలు, 2014-19కాలంలో ఎస్‌ఎఫ్‌సీ కింద అప్పటి మంత్రి నారాయణ రూ.కోటి నిధులు చీమకు ర్తి మున్సిపల్ భవన నిర్మాణానికి విడుదల చేశా రన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి వసూలు చేసిన దాదాపు రూ.కోటి వెరసి రూ.2.5కోట్లతో నూ తన మున్సిపల్ భవన కార్యాలయం నిర్మించారని తెలిపారు. అయితే ఈ భవనం, గేట్లపై వైసీపీ నాయకులు తమ సొంత పేర్లు రాకోవడం ఏమి టని టీడీపీ నాయకులు ప్రశ్నించారు.

అదేవిధంగా కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ నిర్మాణానికి రావి పాటి వెంకటేశ్వర్లు 2 ఎకరాలు ప్రభుత్వానికి 1980వ సంవత్సరంలో దాన సెటిల్ మెంట్ చేయ టం జరిగిందన్నారు. ఈ స్థలంలో భవన నిర్మా ణానికి సుంకర మస్తాన్‌రెడ్డి 1982వ సంవత్సరంలో రూ.25వేలు విరాళం అందించారని చెప్పారు. కానీ వైసీపీ నాయకులు చిన్నచిన్న గేట్లు పెట్టి వాటిపై వారి పేర్లు రాసుకోవటాన్ని తీవ్రంగా ఖం డిస్తున్నామని తెలిపారు. పైన తెల్పిన రెండు ని ర్మాణాలకు గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎ లాంటి నిధులు మంజూరు చేయలేదని, అలాం టి వాటిపై వారి పేర్లు రాసుకోవటాన్ని ఎన్‌డీఏ కూటమి తీవ్రంగా తప్పుపడుతుందని తెలిపారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొల్లపూ డి సుబ్బారావు, నాయకులు యడ్లపల్లి రామబ్ర హ్మం, కాట్రగడ్డ రమణయ్య, సూరంపల్లి హను మంతరావు, పుట్టా బ్రహ్మయ్య, ముప్పూరి చల మయ్య, నర్రా నాగరాజు, గొల్లపూడి శ్రీనివాసరా వు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురికి గాయాలు

ఒంగోలు(క్రైం), జూన్ 15: మొబైల్ దుకాణానికి ఆటోను అడ్డుగా పెట్టడంతో ఇ రువురు ఘర్షణ పడి స్వల్పగాయాలు అయ్యాయి. ఈ సంఘటన ఒంగోలు నగరం ఆర్టీసీ డిపో ఇన్‌గేట్ వద్ద శనివారం జరిగింది. వివరాలోకి వెళితే.. ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద పూజ మొబైల్ వద్ద ఇందిరమ్మకాలనీలో నివాసం ఉండే ఎస్.వెంకటరమణయ్య తన ఆటోను ఆపాడు. దీంతో పూజ మొబైల్ నిర్వాహకుడైన సంతపేటలో నివాసం ఉండే నంబూరి వెంకటనారాయణ తన దుకాణం ఎదురుగా నిలిపిన ఆటోను తీయాలని కోరాడు. దీంతో ఇరువురు మధ్య మాటామాట పెరిగి ఘర్షణపడ్డారు. దీంతో ఇరువురికి స్వల్పగాయాలు అయ్యాయి. వన్‌టౌన్ పోలీసులకు ఇరువురు ఫిర్యాదు చేశారు.

నేడు తిరుమలకు ఇంటూరి పాదయాత్ర

నాగులుప్పలపాడు, జూన్ 15: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుమ లకు పాదయాత్రగా వస్తానని సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షు లు ఇంటూరి శ్రీనివాసరావు మొక్కుకున్నారు. ఈక్రమంలో ఆదివారం శ్రీనివాసరావు స్వగ్రామం చేకూరపాడు నుంచి పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథులుగా ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎ న్.విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, మండలపార్టీ అధ్యక్షు లు తేళ్ళ మనోజ్‌కుమార్ పాల్గొననున్నారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

దర్శి, జూన్ 15: మండలంలోని చలివేంద్ర గ్రామానికి చెందిన దారా రాము లు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మృతుడు దర్శి-అద్దంకి రోడ్డులోని శేషం చిన్నరమణయ్య ఇంటి వద్ద కొన్ని రోజులుగా పెయింటింగ్ పని చేస్తున్నా డు. గత వారం రోజులుగా అనివార్యకారణాలతో పనులు నిలిచిపోయాయి. రాములు ఆఇంటి వద్దే తిరుగుతూ ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యం సేవించి అక్కడ మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ క్షతగాత్రుడు మృతి

దర్శి, జూన్ 15: దర్శి-కురిచేడు రోడ్డులో రెండు రోజుల క్రితం జరిగిన ప్ర మాదంలో గాయపడిన సీహెచ్ నర్సింహారావు శనివారం గుంటూరులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని మారెడ్డిపల్లికి చెందిన నర్సింహారా వు ఈనెల 12వ తేదీ రాత్రి దర్శి-కురిచేడు రోడ్డులో ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తర లించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లబ్‌డబ్.!

- బదిలీలు, తొలగింపులపై చిరుద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బందిలోనూ టెన్షన్
- రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్లపై తొలివేటు
- రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ ఉద్యోగులదీ అదే పరిస్థితి



అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులు, ఇష్టారీతిన పనిచేసిన ప్రభుత్వ, కాంట్రాక్టు సిబ్బంది ప్రస్తుతం వణికిపోతున్నారు. ఎక్కడ తమ అక్రమాలు, అవినీతి బయటపడుతుందో, ఎప్పుడు వేటు పడుతుందోనని భయపడుతున్నారు. తాజా ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలై టీడీపీ భారీ మెజారిటీతో గెలుపొందింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అడ్డగోలు నియామకాలు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు, తొలగింపులపై టీడీపీ శ్రేణులు దృష్టిసారించాయి. ప్రధానంగా వైసీపీ నేతల అండ చూసుకొని రెచ్చిపోయిన వారి చిట్టానే సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయా ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచ రంగా తయారైంది.

ఒంగోలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జిల్లా లో క్షేత్ర స్థాయిలో కీలక శాఖల పరిధిలో పనిచేసిన ఉద్యోగులు, వివిధ శాఖల పథకాలు అందిస్తూ నేరుగా ప్రజలతో సంబంధాలు ఉండే అనధికార సిబ్బం దిలో ఆందోళన మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంట కాగిన లేదా నాయకుల కన్నా ఎక్కువగా తామే అన్నట్లు వ్యవహరించిన వారి లో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తోంది. గ్రామ, మండల స్థాయిలో రెవెన్యూ పోలీసు, పంచాయతీరాజ్‌శాఖల ఉద్యోగులు, సిబ్బంది ఈ కోవలో ఎక్కువగా ఉన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు వాటిని అందించే పేరుతో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించిన రేషన్ డీలర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్లు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు ఇలా పలు రం గాల వారిలో అత్యధికులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నియమింపబడిన వారే కావడంతో వారిని సమూలంగా మార్పులు చేయాలంటూ టీడీపీ ద్వితీ యశ్రేణి నాయకులు అప్పుడే ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలపై ఒత్తిళ్లు ప్రా రంభించారు. ఆ సమాచారం ఆతరహా ఉద్యోగులు, సిబ్బందిలో తీవ్ర ఆందో ళన కలిగిస్తోంది.

ఇష్టారీతిన వ్యవహరించిన ఫలితం

సాధారణంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పర్మినెంట్ ఉద్యోగులకు ఇబ్బంది ఉండదు. అయితే అనుకూల ప్రభుత్వం, నాయకుల మద్దతు ఉంటే నివాసాలకు దగ్గరగా ఉండే ప్రాంతాలు అలాగే మంచి ప్రాధాన్యం ఉండే పోస్టింగ్‌ల కోసం ఉద్యోగులు ప్రయత్నిస్తారు. ఆ మేరకు నాయకులు కూడా ప్రాధాన్యం ఇస్తారు. అలాగే క్షేత్రస్థాయిలో కీలకంగా ఉండే రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర తాత్కాలిక సిబ్బంది నియామకాల్లో మార్పులు చోటుచేసు కుంటాయి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ తరహా బది లీలు, మార్పులు, చేర్పుల్లో ఆ పార్టీ నేతలు ఇష్టారీతిలో వ్యవహరిం చారు. అనుకూలురను ప్రాధాన్యత ఉండే వాటిలోకి తెచ్చుకోవడం అనే దాని కన్నా టీడీపీకి సానుకూలంగా ఉంటున్నారనే పేరుతో అనేక మందిని వేధింపులకు గురిచేసి తొలగించారు. ఇక క్షేత్రస్థాయి సిబ్బంది నియామకాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరించారు. కొందరు జిల్లా అధికారులైతే ఈ తరహా విషయాలలో వైసీపీ నేతల కన్నా మిన్నగా వ్యవహరిం చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇష్టారీతిన అవుట్ సోర్సింగ్ నియా మకాలు కూడా చేశారు.

మొదలైన కసరత్తు

ప్రభుత్వ శాఖల పరంగా చూస్తే మండలస్థాయిలో కీలకమైన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వీఆర్వోలు, ఎస్ ఐలు, కానిస్టేబుళ్లు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల ఇంజనీర్లు, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్‌లోని మండలస్థాయి సిబ్బంది మా ర్పులు కోరుతూ టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఇక గ్రామ స్థాయిలో నేరుగా నేతల పట్టుకు దర్పణం గా నిలిచే ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ డీలర్లు, షిఫ్ట్ ఆప రేటర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల వంటి వారి తొలగింపునకూ పట్టుబడుతున్నారు. ఇక వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల వ్యవ స్థను తెచ్చి ఆ పార్టీ కార్యకర్తలను నియమించుకున్నారు. జిల్లాలో 14వేల మం ది వలంటీర్లు ఉండగా ఎన్నికల సమయంలో నాలుగున్నర వేలమంది రాజీ నామా చేసి వైసీపీకి పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రాగా ఆ వ్యవ స్థను కొనసాగించడంతోపాటు గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని ప్రకటిం చింది. దీంతో వైసీపీకి చెందిన వారందరినీ తొలగించి టీడీపీకి మద్దతుగా ఉన్న వారిని నియమించేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఈ పరిణామాలతో వైసీపీ అనుకూలంగా పనిచేసిన చిరుద్యోగులు, సిబ్బందిలో వణుకు మొదలైంది.

వైద్యశాఖలో ఇష్టారాజ్యం

- మన అనుకుంటే అందలం.. కాదనుకుంటే రిలీవ్
- హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాపట్టించుకోని పరిస్థితి
- ఎక్కడో మారుమూల ప్రాంత వైద్యాధికారి అనధికారికంగా వైద్యశాఖలో పెత్తనం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: వైద్యశాఖలో కొందరు ఇష్టారాజ్యంగా రాజ్య మేలుతున్నారు. అంత వారు అనుకున్నట్లే ఆ శాఖలోని ఉద్యోగులు నడవా ల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ నిబంధనలు కొందరికి మాత్రమే. మిగి లిన వారికి మాత్రం ఉండవు. తమకు ఉపయోగపడుతాడంటే అందలం ఎక్కిస్తున్నారు. వారి వల్ల ఎలాంటి ఉపయోగం లేదంటే దూరంగా పంపు తున్నారు. అదే విధంగా కార్యాలయంలో అనధికారికంగా కొందరితో పనిచే యించుకుంటున్నారు. అదేమంటే అత్యవసరం అంటున్నారే తప్ప కార ణాలు చెప్పడం లేదు. కార్యాలయంలో అంత అవసరం ఉంటే అధికారి కంగా నియమించుకునే అవకాశం ఉన్నా అవేమి పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు వైద్యశాలలపై పెత్తనం చేసేందుకు మారుమూల ప్రాంతంలో పనిచేసే ఒక వైద్యాధికారిని అనధికారికంగా వైద్యశాఖ కార్యా లయానికి తెచ్చుకున్నారు.

డిప్యుటేషన్లు రద్దుచేసినా..

ఎన్నికల సమయంలో డిప్యుటేషన్లు రద్దుచేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేయడంతో అనేకమంది వెనక్కి వెళ్లారు. ఎన్నికల అనం తరం మళ్లీ అదే ఉద్యోగుల్లో కొందరు అనధికారికంగా వైద్యశాఖ కార్యాల యంలో పెత్తనం చేస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు అక్రమ పద్ధతిలో పదోన్నతులు పొందిన ఉద్యోగులకు రివర్షన్ ఇచ్చే క్రమంలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. అక్కడి నుంచి అందరూ ఉత్తర్వులు తెచ్చుకున్నారు.

అయినా సరే కార్యాలయంలో పెత్తనం చేస్తున్న అధికారులు తమకు ఇష్టం లేని వారిని వెంటనే రిలీవ్ చేస్తున్నారు. అదేసమయంలో తమ మనసెరిగి పనిచేస్తున్న వారిని మాత్రం కొనసాగిస్తున్నారు. అక్రమంగా పదోన్నతులు పొందడం అనేది చట్ట వ్యతిరేకమైనందున అలాంటి వారిపై వేటు వేయా ల్సిందిపోయి కాపాడుతున్నారు. వైద్యశాఖ కార్యాలయంలో పనిచేసే ఒక ఉద్యోగి తనకు కళ్లు కనిపించవని తప్పుడు సర్టిఫికెట్ తెచ్చుకొని ఉద్యో గంలో చేరడమే కాకుండా ఇప్పుడు పదోన్నతి పొందారు కూడా. ఇలా చెప్పు కుంటూపోతే పక్షంరోజుల నుంచి జిల్లావ్యాప్తంగా వైద్యశాఖలో జరుగు తున్న అవినీతి, అక్రమాలపై పలు ఆరోపణలు వస్తున్నా ఎవరూ పట్టించు కోవడం లేదు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

ఏరకం ధర చూసినా కిలో రూ.60 నుంచి రూ.70

సామాన్యుడు కొనలేని పరిస్థితి

చికెన్‌తో పోటీ పడుతున్న బీన్స్



ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: కూరగాయలు అంటేనే సామాన్యుడు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండ తీవ్రత తగ్గిన తర్వాత కూడా ఏ కూరగాయ చూసినా కిలో రూ.60 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. చికెన్‌తో పోటీపడి బీన్స్ ధరలు ఉన్నాయి. కిలో చికెన్ రూ.250కి లభిస్తుండగా బీన్స్ రూ.210లకు చేరింది. నిన్నా మొన్నటివరకు అన్నిరకాల కూరగాయలు కిలో రూ.30 నుంచి రూ.50 లోపు లభించగా ఇప్పుడు 40శాతం మేర ధరలు పెరిగాయి. ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడంతో అన్నిరకాల ధరలకు రెక్కలు వచ్చాయి. వంద రూపాయలు చేతిలో పెట్టుకొని మార్కెట్‌కు వెళితే రెండు రకాలు కూడా రావడం లేదు. మరో వైపు నిత్యం వంటల్లో వినియోగించే టమోటా, పచ్చిమిర్చి ధరలు హోల్‌సేల్ లోనే కిలో రూ.70 వరకు పలుకుతుండగా రిటైల్‌గా మరో 10 నుంచి 15శాతం వరకు పెంచి కిలో రూ.80 వరకు విక్రయిస్తున్నారు. అలా అన్నిరకాల కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులు మార్కెట్‌వైపు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్తపట్నం, మార్టూరు ప్రాంతాల నుంచి పలురకాల కూరగాయలు దిగుమతి అవుతాయి. అయితే అక్కడ పంట ఉత్పత్తి తగ్గిపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో వాటి ధరలకు రెక్కలు వచ్చాయి. కూరగాయల ధరలు కిలో ఇలా ఉన్నాయి...

బీన్స్ :	రూ.210.00	బీర :	60.00
టమోటా :	70.00	క్యాబేజి :	50.00
పచ్చిమిర్చి :	70.00	గోరుచిక్కుళ్ళు :	50.00
దొండ :	70.00	బీట్‌రూట్ :	50.00
క్యారెట్ :	65.00	బంగాళదుంప :	40.00
చామదుంప :	60.00	బెండకాయ :	40.00
కాకర :	60.00		

పేర్లు పోయె..!

చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం, సీహెచ్‌సీపై వైసీపీ నాయకుల పేర్లు తొలగింపు



పేర్లు తొలగించిన తర్వాత మున్సిపల్ కార్యాలయం

చీమకుర్తి, జూన్ 15: నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాల యంపై ఏర్పాటుచేసిన వైఎస్ఆర్, బూచేపల్లి సుబ్బారెడ్డి కుటుంబస భ్యుల పేర్లను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. కాగా ఈ పేర్లను తొలగించింది టీడీపీకి చెందిన వారని ఆరోపిస్తూ కొందరి పేర్లతో సహా తమ ఫిర్యాదులో పేర్కొన్న వైసీపీ నాయకులు, ఘట నపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీఐ దుర్గాప్రసాద్ స్పందిస్తూ పేర్ల తొలగింపు విషయంపై వైసీపీ నాయ కులు కౌన్సిలర్ సోమా శేషాద్రి, కిష్టపాటి శేఖర్‌రెడ్డి, గోపవరపు చంద్ర, ఆముదాలపల్లి రామబ్రహ్మం ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ పూర్తయిన తర్వాత కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే కమ్యూనిటీ హెల్త్‌సెంట ర్‌పై ఉన్న నేతల పేర్లను కూడా కొందరు తొలగించారు.

మెగా డీఎస్సీపై హర్షం

- జిల్లాలో వెయ్యికిపైగా ఖాళీలు
- అభ్యర్థుల్లో ఆనందం



ఒంగోలు(విద్య), జూన్ 15 : సాధారణ ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలిసం తకం చేయడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎ స్సీలో 16,347 టీచర్ పోస్టులను భర్తీచేయనున్నారు. పాఠశాల విద్యతో పాటు ఇతర శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలన్నింటిలో ఖాళీలు ఈ మెగా డీఎస్సీ ద్వారా నింపనున్నారు. ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ డిసెంబరు నాటికి పూర్తిచేయమని పాఠశాల విద్యాకమిషనర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ పాలనలో విద్యాశాఖను ప్రయోగశాలగా మార్చి రకరకాలుగా ప్రయోగాలు చేశారు తప్ప టీచర్ పోస్టుల భర్తీని విస్మరించారు. తీరా ఎన్నికల షెడ్యూల్‌కు నెలరోజుల ముందు ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేశారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు రాత పరీక్ష, నియామకాలకు షెడ్యూల్ ప్రకటించారు. అయితే సాధారణ ఎన్ని కల షెడ్యూల్ దృష్ట్యా ఆ ప్రక్రియను హైకోర్టు నిలుపుదల చేసింది. గత ప్రభుత్వం కేవలం 6,100 పోస్టులను మాత్రమే ప్రకటించగా ప్రస్తుత మెగా డీఎస్సీలో 16,347 పోస్టులు ప్రకటించారు.

జిల్లాలోవెయ్యికిపైగా పోస్టులు

మెగా డీఎస్సీలో జిల్లాలో వెయ్యికిపైగా టీచర్ పోస్టులు ప్రకటించను న్నారు. గత డీఎస్సీలో ప్రభుత్వ, జడ్పీ, మండల, మునిసిపల్, ఆశ్రమ పాఠ శాలల్లో మొత్తం 409 ఖాళీలు ప్రకటించారు. ప్రస్తుతం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, హెచ్‌ఎం పోస్టులు మొత్తం 988 ఖాళీలు ఉన్నాయి. ఇవి కేవలం ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లోనే ఉన్నాయి. గత డీఎస్సీ తరహాలోనే ఏపీ రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్ల ఖాళీలు కూడా కలుపుకొంటే వెయ్యి పోస్టులకుపైగా ఉంటాయి. జిల్లాలో ప్రస్తుతం 422 ఎస్జీటీ పోస్టులు, 24 హైస్కూలు హెచ్‌ఎంలు, 61 బయాజి కల్ సైన్స్, 65 ఇంగ్లీషు, 25 హిందీ 65 గణితం, 167 ఫిజికల్ ఎడ్యుకేష న్, 45 ఫిజికల్ సైన్స్, 83 సోషల్, 21 తెలుగు ఖాళీలు ఉన్నాయి.

పాఠశాలల్లో విస్తృత తనిఖీలు

- ఉత్తర్వులు జారీచేసిన కమిషనర్

ఒంగోలు(విద్య); జూన్ 15 : అధికారులు తరచుగా పాఠశాలలను సందర్శిస్తూ తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు పాఠశాల విద్యా కమిష నర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అతి కొద్దిమంది అధికా రులు మాత్రమే తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు పాఠశాలల సందర్శ నలు, తనిఖీలు నిర్వహిస్తూ తమ నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తు న్నారు. మెజార్టీ తమ లక్ష్యాలను విస్మరించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్స రంలో తనిఖీ అధికారులు తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు సందర్శనలు, తనిఖీలు నిర్వహిస్తూ ఆన్‌లైన్ విజిట్/తనిఖీ ఫామ్‌లో వివరాలు తెలపా లన్నారు. ఆర్జేడీలు, డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు తమ నెలవారీ లక్ష్యాల మేరకు పాఠశాలలు తనిఖీలు పూర్తిచేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదే శించారు. నిర్దేశిత లక్ష్యాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాలినడకన శింగరకొండకు



తిమ్మాయపాలెం నుంచి శింగరకొండకు కాలినడకన వెళ్తున్న శ్రేణులు
ఏలూరి గెలుపుతో పావులూరు సమీపంలో కొనసాగుతున్న పాదయాత్ర.. మొక్కు తీర్చుకునేందుకు ట్రాక్టర్లతో తరలివెళ్తున్న శ్రేణులు

- మొక్కులు తీర్చుకున్న తిమ్మాయపాలెం, బొమ్మనంపాడు టీడీపీ శ్రేణులు
- గొట్టిపాటి విజయంపై ఆలయానికి కదిలిన నాయకులు, కార్యకర్తలు

అద్దంకి, జూన్ 15 : టీడీపీ అధికారంలోకి రావడం, అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ విజయం సాధించడం, అతనికి మంత్రివర్గంలో స్థానం దక్కడం తో టీడీపీ శ్రేణులు శింగరకొండలో శనివారం మొ క్కులు తీర్చుకున్నారు. పట్టణానికి చెందిన టీడీపీ నేత లు అత్తులూరి రమేష్, దొప్పలపూడి ప్రసాద్, బచ్చుల వా సు, వలి తదితరుల ఆధ్వర్యంలో 116 కొబ్బరికాయ లు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. మండలంలోని తిమ్మాయ పాలెం, బొమ్మనంపాడుకు చెందిన టీడీపీ శ్రేణులు శని వారం ఆయా గ్రామాల నుంచి శింగరకొండకు కాలిన డకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మ హిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిమ్మాయపాలెం టీడీపీ నేతలు పరిటాల అరుణ శ్రీనివాసరావు, ఏనుగంటి శివ, తోకల రాజేష్, అడుసుమల్లి శ్రీనివాసరావు, సు బ్ర హ్మణ్యం, నాగరాజు, పవన్, బొమ్మనంపాడు టీ డీపీ నేతలు మోటుపల్లి నాగేశ్వరరావు, బాబు, నాగరాజు పాల్గొన్నారు.

ఏలూరి గెలుపుపై టీడీపీ నేతల మొక్కులు

ఇంకొల్లు : ఏలూరి సాంబశివరావు గెలుపుతో ప ర్చూరు నియోజకవర్గంలోని కొసరాజు సురేంద్ర ఆధ్వ ర్యంలో కారంచేడు మండలం స్వర్ణపాలెం,కొడవలివారి పాలెం, కేశవరప్పాడు గ్రామ ప్రజలు ఇంకొల్లు మం డలం పావులూరు పొలిమేర ఆంజనేయస్వామి గుడి సన్నిధి వరకు పాదయాత్ర చేసి మొక్కులు తీర్చుకు న్నారు. రైతులు, మహిళలు, యువత ఉత్సాహంగా పా దయాత్రలో పాల్గొన్నారు. నవ్యాంధ్ర నిర్మాత చంద్రబా బు జై, ఏలూరి జై అంటూ నినాదాలు చేసారు. ప్రధా నరహదారిలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి బాణ సంచా కాల్చారు. అనంతనం నాగులచెరువు కట్ట వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో డాక్టర్ కొడాలి కమలాకరరావు, కొడాలి బుచ్చయ్యచౌదరి, గరికపాటి పూర్ణచంద్రరావు, వాసుబాబు, దిలీప్, తాండవకృష్ణ, వెంకటేశ్వర్లు, బత్తిన శ్రీనివాస్, బ్రహ్మాజీ, మంగిశెట్టి సుబ్బారావు, పగడాల కిషోర్, కిషోర్, పున్నయ్య, మహేశ్వరి పాల్గొన్నారు.

రేపు కడవకుదురులో ఓపెన్ క్రాస్ కంట్రీ పోటీలు

చినగంజాం, జూన్ 15 : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 17వ తేదీ ఉద యం 5.30 గంటలకు ఓపెన్ క్రాస్ కంట్రీ పోటీలు నిర్వ హిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగిరెడ్డి స్వామిరెడ్డి, కార్యదర్శి మారుబోయిన వెంకటరె డ్డిలు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పురుషులకు 10 కిలోమీటర్ల విభాగంలో, స్త్రీలకు 5 కిలో మీటర్ల విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో మొదటి విజేతలైన ముగ్గురికి నగదు బ హుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలి గిన క్రీడాకారులు 16వ తేదీ మధ్యాహ్నం 2గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో పాల్గొ నే క్రీడాకారులు తమ పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకొని రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు.. 8247318995, 7416825797, 8978482329 సెల్ నెంబర్లను సంప్రదిం చాలని తెలిపారు. కడవకుదురు జడ్పీ పాఠశాల ఆవర ణలో గత నెల 1వ తేదీ నుంచి రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసి యేషన్, జిల్లా అథెటిక్స్ స్పోర్ట్స్ అథారిటీ గైడ్‌లెన్స్‌తో కడ వకుదురు శ్రీ వెంకటేశ్వర హిందుస్థాన్ స్పోర్ట్స్ క్లబ్, గ్రామ పెద్దల సహకారంతో ఉచిత వేసవి క్రీడా శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఉచిత వేసవి క్రీడా శిబిరం ముగింపు సందర్భంగా క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తు న్నట్లు స్వామిరెడ్డి తెలిపారు.



ఎంపీ కృష్ణప్రసాద్ సత్కరిస్తున్న పంగులూరు నేతలు

ఎంపీ కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు

అద్దంకి, జూన్ 15 : ఎంపీ కృష్ణప్రసాద్‌ను టీడీపీ పట్టణ నేతలు శనివారం బాపట్లలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లుగా ఉన్న పట్టణ నేతలు యర్రాకుల రామాంజనేయులు, దాసరి వెంకటసుబ్బారావు, ఇ ర్ల వీరాం జనేయులు, గుంజి విజయ్, గాలి స్వరాజ్, కంచర్ల ఏడుకొండలు తదితరులు ఎంపీ కృష్ణ ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీని కలిసిన నాయకులు

పంగులూరు : ఎంపీ కృష్ణప్రసాద్‌ను టీడీపీ నాయకులు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణప్ర సాద్‌ను మండల పార్టీ నేతలు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, అల్లం నేని బ్రహ్మానందస్వామి, గుదిబండ్ల చినఆదిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు, మాజీ సర్పంచ్ అమృతపూడి ఏసోబు, ఎల్లాల నాగిరెడ్డి, వెంకట రావు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటిస్తే రోగాలు దూరం

చీరాలటౌన్, జూన్ 15 : సమతుల్యమైన ఆరోగ్య సూత్రాలు పాటిస్తే అనారో గాలు దరిచేరవని ప్రముఖ ప్లాస్టిక్ మరియు కాస్మోటిక్ సర్జన్ డా.సునీత శంకర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కామాక్షి కేర్ హాస్పిటల్‌లో లైపోసెక్షన్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా హాజరయిన వైద్యురాలు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వయసుకు అనుగుణంగా మాత్రమే బరువు ఉండాలని వివరించారు. అధిక బరువు ఉన్నట్లయితే హాస్పిటల్ నందు ఎటువంటి ఇతర సైడ్ ఎఫె క్ట్‌లు లేకుండా బరువు తగ్గేందుకు లైపో సెక్షన్ వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారికి పలు సందేహాలను నివృత్తి చేశారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ డా.తాడివలస దేవరాజ్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అన్ని వేళల్లో అందుబాటులో వైద్యం అందిస్తు న్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు హాజరయి వైద్య పరీక్షలు చేయించు కున్నారు.



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న అధికారులు

సదుపాయాలను వినియోగించుకోవాలి

చినగంజాం, జూన్ 15 : విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకొని విద్యాభివృద్ధి చెందాలని రాష్ట్ర ఎంఐఎస్ కోఆర్డినేటర్ హైమారావు అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్‌ల కిట్ల పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు. చినగంజాం జడ్పీ పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో మండలానికి వచ్చిన నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను షూస్, బెల్ట్‌లను రాష్ట్ర ఎంఐఎస్ కోఆర్డినేటర్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలోని 37 పాఠశాలలలోని 3534 మంది విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశా లలోని వి ద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఆయన సీఎంఓ, ఎంఈవోలతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సీఎంఓ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈవోలు బీ అజ య్‌బాబు, ఎస్.కోటేశ్వరరావు, చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్ఎం రత్నకుమారి, సీఆర్పీలు పాల్గొన్నారు.

కేఆర్‌కేలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకిటౌన్, మే 15: కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు తెలి పారు. అద్దంకి ప్రాంతంలోని చేరాలనుకునే విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు శనివారం కళాశాల నందు జరిగిన సమావేశంలో బ్రోచర్‌ను అధ్యాప కులతో కలసి ఆయన ఆవిష్కరించారు. కళాశాలలో బిఎస్‌సి బోటనీ, మేథమెటిక్స్, కంప్యూట ర్ సైన్స్, బీకాం, కంప్యూటర్స్ అప్లికేషన్స్, బీఏ ఎకనామిక్స్ కోర్సులలో ప్రవే శాలకు దరకాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులు, నిష్ణాతులైన అధ్యా పకులు, సిబ్బందితోపాటు జేకేసీ ద్వారా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ను కల్పిస్తున్నామని మోహనరావు తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు. కార్యక్ర మంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మునిసిపల్ అత్యవసర కౌన్సిల్

చీరాలటౌన్, జూన్ 15 : చీరాల మునిసిపల్ కౌన్సిల్ హాలులో శని వారం అత్యవసర కౌన్సిల్ సమా వేశం ప్రశాంతంగా జరిగింది. కార్యక్ర మానికి మునిసిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షత వహించగా, అజెండాలోని 11 అంశా లకు గాను 9 అంశాలను ఆమో దిస్తూ ముగించారు. మిగిలిన రెండు అంశాలు పురపాలక సంఘా నికి చెందిన పీఎస్ఆర్ కాంపెక్స్‌లోని ఖాళీ స్థలాల లీజు రెన్యువల్‌కు సంబంధించినవి కావడం విశేషం. సమావేశంలో మునిసిపల్ అధికారులు పలు వురు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జైసన్‌బాబు

మత్స్యకారులకు అండగా ఉంటాం

వాడరేవు(చీరాలటౌన్), జూన్ 15 : మత్స్యకారులకు అండగా ఉండి సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తానని మా జీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. సంధికాలం పూర్తయి వేట ప్రారం భించడం తో శనివారం వాడరేవు గ్రామానికి చేరుకుని వా రితో సమావేశం నిర్వహించారు. సమ స్యలు ఎదురయితే ఆయన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

చీరాలటౌన్, జూన్ 15 : కోర్టు ప్రాంగణంలో ఈనెల 29వ తేదీన నిర్వహించే జా తీయ లోక్ అదా లత్‌ను వినియోగించుకోవాలని సీనియర్ సివిల్‌న్యాయాధికారి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.సుధ అన్నారు. విలువైన సమయాన్ని కక్షలతో వృథా చేసుకోవద్దని సూచించారు. అ న్ని క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, కుటుంబ, ప్రీలిటిగెంట్ సమస్యలకు పరిష్కారం పొందా లని న్యా యాధికారి వివరించారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, జూన్ 15 : మండలం లోని ధేనువకొండలో అక్ర మంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకొని ఒకరి ని అదుపులోకి తీసుకున్నారు. ధేనువకొండలో తేలుకట్ల వెంకట్రావు వద్ద 10 మద్యం బాటిళ్లను శనివారం స్వాధీనం చేసుకొని, వెంకట రావును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సైమన్ తెలిపారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

దేశాయిపేట(చీరాలటౌన్), జూన్ 15 : చీరాల నియోజకవర్గ ప్రజల సమస్యలు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతోనే పరిష్కారమ వుతాయని పలువురు కూటమి నాయకులు పే ర్కొన్నారు. ఎన్నికల ప్రచారం సమయంలో వేటపాలెం మండలం దేశాయిపేట పంచా యతీ నవజ్యోతి కాలనీకు చెందిన సుమారు 60 కుటుంబాలు తాగునీటి సమస్యను ఎమ్మె ల్యే కుమారుడు మహేంద్రనాథ్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో స్పందించిన యువనాయ కులు సుమారు రూ.50 వేలు తన సొంత నిధులతో రెండు వీధులకు సంబంధించి మంచినీటి పైపులను శనివారం నిర్మాణాలు చేయించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు, వీరభద్రయ్య, రఫి, గుత్తి ప్రసాద్, హకీమ్, అర్జున్ పాల్గొని కొళా యిలు ప్రారంభించగా నాయకులు, కార్యక ర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కొళాయిని ప్రారంభిస్తున్న నేతలు

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



11 రోజులపాటు నిర్వహణ

సింగరాయకొండ, జూన్ 15 : దక్షిణ సింహాచ లంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం రాత్రి అంకుర్పాణ చేయనున్నారు. 11 రోజులపా టు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకుర్పా రణ చేస్తారు. 17వ తేదీన ధ్వజారోహణ, చంద్ర ప్రభ వాహనం, 18న సూర్యప్రభ వాహనం, హంసవాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు.

గంగవరం దారిని రెండులైన్లుగా మార్చాలి

పురందేశ్వరికి బీజేపీ నేతల వినతి

ఇంకొల్లు, జూన్ 15 : ఇంకొల్లు నుంచి గంగవరం మీదుగా పంగులూ రు వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని రెండు లైన్ల రహదారిగా మార్చా లని బాపట్ల జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు కొల్లూరి హరిబాబుతో పాటు బీజేపీ మండల నాయకులు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి విన్నవించారు. ఇంకొల్లు - ముప్పవరం ఆర్అండ్‌బీ రహ దారిలో పంగులూరు నుంచి హైవే వరకు రెండు రెండువరుసల రహ దారిగా అభివృద్ధి చేసారని, పంగులూరు- ఇంకొల్లు వరకు కూడా రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందని ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇంకొల్లు - పంగులూరు వరకు ఈ రహ దిరి ప్రస్తుతం గుంట మయమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వి ద్యా సంస్థలు ఉన్న ఈ రోడ్డులో ఆరు వాగు చిన్నపాటి వర్షానికి పొంగి ప్రవహించినప్పుడు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పు రందేశ్వరికి విన్నంచారు. సమస్యలను లిఖితపూర్వకంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సమస్య పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించి నట్లు కలిసిన నాయకులు తెలిపారు.

పింఛన్ నిలిపివేత ఆరోపణపై విచారణ

సిబ్బందిపై చర్యలకు గ్రామస్థుల డిమాండ్

పంగులూరు, జూన్ 15 : రామకూరు గ్రామంలో మిరయాల నాగ రాజుకు మంజూరైన వితంతు పింఛన్ అందకుండా చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అందిన సమా చారం మేరకు 2023 జనవరి 31న గ్రామానికి చెందిన మిరియాల జాన కిరామయ్య మృతి చెందగా, ఆమె భార్య వితంతు పింఛన్ కోసం సచివా లయంలో దరకాస్తు చేసుకున్నారు. అర్హత గుర్తించిన అధికారులు మిరి యాల నాగరాజుకు 2024 జనవరిలో పింఛన్ మంజూరు చేశారు. పింఛన్ కోసం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను తరచూ కలిసిన నాగ రాజుకు మంజూరైన పింఛన్‌కు సంబంధించి ఈకేవైసీ చేయకుండా కాల యాపన చేయడంతో పాటు శాశ్వతంగా వలస పోయినట్లు పైఅధికారు లకు సమాచారం ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయమై మిరియాల నాగరాజు ఎంపీడీవో మ్యాత్యూబాబును సంప్రదించగా ఆయన వెల్ఫేర్ అ సిస్టెంట్‌ను వివరణ కోరేందుకు వెళ్లారు. తనను వివరణ కోరేందుకు మెమో జారీ చేసేందుకు వెళ్లిన ఎంపీడీవో ఇతర కార్యాలయ సిబ్బందిపై ఎస్సీ యాక్ట్ కింద కేసు పెడతాననడంతో ఎంపీడీవో ఈ విషయంపై సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సదరు అధికారి అద్దంకి ఏఎస్‌డబ్ల్యూవోను విచారణాధి కారిగా నియమించారు. విచారణ పూర్తయి సదరు అధికారి ఉన్నతాధికా రులకు నివేదిక సమర్పించారని అయినా నేటికీ చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నాలుగు నెలల పింఛన్ లబ్ధిదారుకి అంద కుండా చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్‌పై తక్షణమే చర్యలు తీసు కోవాలని, నాగరాజుకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న చీరాల ఏడీఏ ఎఫ్రాయియ్

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

చినగంజాం, జూన్ 15 : వర్షాలు కురిసి అనుకూల వాతావరణంలో సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చీరాల, బాపట్ల ఏడీఏలు బీ ఎఫ్రాయియ్, టి.రత్నకుమారి అన్నారు. వ్యవసాయ కార్యాలయంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తంపై గ్రామ వ్యవసాయ సహాయకులకు, విత్తన ఎరువుల షాపు డీలర్లకు శని వారం జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయా సాధికారి కే.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రత్నకుమారి మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకో వాలని సూచించారు. విత్తనాలు లైసెన్స్ కలిగిన దుకాణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా కొనుగోలు రశీదు పొందాల న్నారు. పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు త్వరితగతిన ఈకే వైసీ చేయించాలని తెలిపారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కచ్చితమైన ధరలకే విక్రయించాలని చీరాల ఏడీఏ ఆదేశించారు. విత్త నాలు అమ్మడానికి ముందే మొలకశాతం 90శాతం ఉండాలని సూచిం చారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను గురించి తెలియజేసి వరి నేలలో సేంద్రియ కర్బనం పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్ర మంలో ఆర్‌బీకే సిబ్బంది, విత్తనాలు, ఎరువుల, పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.

శింగరకొండకు జనసేన నేతల పాదయాత్ర

మద్దిపాడు జూన్ 15: ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్ విజ య్‌కుమార్ విజయం సాధించడంతో శనివారం మద్దిపాడులో జనసేన పార్టీ నాయకులు శింగరకొండకు మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్ర చేపట్టారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద మండలాధ్యక్షుడు సున్నా బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పాదయాత్రను ముఖ్యఅతి థిగా హాజరైన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు కడియాల రఘుబాబు, ఆర్ఎం.వెంకటేశ్వర్లు, దమ్ము సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు దుర్గభవాని పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

అద్దంకిటౌన్, మే 15 : బడి వయస్సు పిల్లం దరినీ బడిలో చేర్పించాలని ప్రభుత్వం పలు శాఖల సమన్వయంతో జూలై 11వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని ఎంఈవోలు గంగాధరరావు, బీ సుధాకరరావు తెలిపారు. శనివారం పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బాలికోత్స వాన్ని హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్‌వా డీ కార్యకర్తలు, పార్ట్‌టైం బోధకులు, సీఆర్పీలు సమన్వయంలో బడి వయస్సుగల చిన్నారు లను గుర్తించి వారిని బడిలో చేర్పించాల న్నారు. సీడీపీవో కృష్ణకుమారి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో నిలవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవా లని సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది పదివ తరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన పూజిత(571)కి బహుమతిని ఎంఈవో అందజేశారు. ఇంగ్లీష్‌లో ఎక్కువ మార్కులు సాధించిన మరో ముగ్గురు విద్యార్థి నులకు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ముక్కు పుడకలను అందజేశారు.



విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న ఎంఈవో

'నేనూ బడికి పోతా'ను విజయవంతం చేయాలి

మార్టూరు : బడిఈడు పిల్లలందరూ పాఠ శాలలో చేరేలా బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో వస్రాంనా యక్ కోరారు. శనివారం విద్యా శాఖ కార్యాల యంలో సీఆర్పీలు వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమా వేశాన్ని ఏర్పాటు చేశారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు పెరిగే విధంగా అందరూ కృషి చేయాలని ఎంఈవో కోరారు. ప్రతి ఇంటా సర్వే చేపట్టి ప్రతి పాఠశాలలో హాజరు శాతం పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. వచ్చే నెల 12వ తేదీ వరకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావే శంలో మండల పరిషత్ ఏవో బసవ రాణి ఎంఈవో ప్రేమలత, సీఆ ర్పీలు రామారావు రమేష్ పాల్గొ న్నారు.

కారంచేడు (పర్చూరు) : బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించి వారి భవిష్యత్‌కు దోహదప డాలని కారంచేడు ఎంఈవో ఎం వీవీ సత్యనా రాయణ అన్నారు. బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయా ఆయా పాఠశాలల సిబ్బం దితో సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభు త్వ పాఠ శాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు తదితర అంశాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి బడి బయట ఉన్న చిన్నారులను బడిలో చేర్పించాలన్నారు. దీనికి వలంటీర్లు, గ్రామస్థులు, తల్లిదండ్రుల సహకారం తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐకి ప్రశంసాపత్రం అందజేత



సీఐ, ఎస్ఐలకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎస్పీ

మార్టూరు, జూన్ 15 : అసెంబ్లీ ఎన్నికల విధి నిర్వహణలో ఎ లాంటి గొడవలు లేకుండా ప్ర శాంత వాతావరణంలో నిర్వహిం చడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులకు శుక్రవారం ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. అందులో భాగంగా మార్టూరు సీఐ రాజశేఖర్ రెడ్డికి, యద్దనపూడి ఎస్ఐ జీవీ చౌదరికి ఎస్పీ జిందాల్ బాపట్లలో అభినందించి సత్కరించారు.

ఎస్ఐ తిరుపతిరావు అవార్డు

పంగులూరు : ఎస్ఐ కేకే తిరుపతిరావు ఎస్పీ వకుల్ జిందాల్ నుంచి అవా ర్డ్‌ను అందుకున్నారు. సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసు కోకుండా విధులు నిర్వహించిన సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఎస్ఐ తిరు పతిరావుకు అవార్డ్‌తో పాటు ప్రశంసాపత్రం అందచేశారు.

స్టాక్ రిజిస్టర్లపై ఏవో ధ్రువీకరణ తప్పనిసరి



డీలర్లకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

పంగులూరు, జూన్ 15 : మండలంలోని ఇన్‌పుట్ డీలర్లు స్టాక్ రిజిస్టర్లు, బి ల్ బుక్‌లపై విధిగా ఏవో ధ్రువీకరణ తీసుకోవాలని ఏడీఏ కేవీ శ్రీనివాసరావు ఆదేశించారు. వెలుగు కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బంది, ఇన్‌పుట్ డీలర్ల శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి మాట్లాడు తూ ప్రతి ఎరువుల దుకాణదారుడు తమ విక్రయ కేంద్రానికి సంబంధించిన పేరు, డోర్ నెంబర్‌తో పాటు, స్టాక్ వివరాలు వాటి ధరలను నేమ్ బోర్డులో ప్ర దర్శించాన్నారు. ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి మట్టి నమూ నాలు, వాటి ప్రయోజనాలు రైతులకు తెలియజేయాలన్నారు. పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ టెక్నికల్ ఏవో తిరుమలరావు, డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన విక్రయాల తనిఖీ

పంగులూరు, జూన్ 15 : మూల విత్తనాలకు సంబంధించి ధ్రువపత్రం స రిలేకపోవడంతో పత్తి విత్తన విక్రయాలను నిలుపు చేయాలని ఇంటర్నల్ స్క్వాడ్ ఏడీఏ ఎస్.రామ్మోహనరావు పంగులూరులోని మనగ్రోమోర్ కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని విత్తన విక్రయ దుకాణాలలో ఇంటర్నల్ స్క్వాడ్ ఏడీఏ ఎస్.రామ్మోహనరావు తన సిబ్బందితో కలసి శని వారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అమ్మకాలు నిలుపు చేసిన విత్తనాల విలువ 25 వేల 920 రూపాయలుగా నిర్ధారించారు. ఈ తనిఖీలో ఏవో సుబ్బా రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు యూనిఫాం అందజేత



యూనిఫాంలను అందజేస్తున్న ఎన్‌సీసీ అధికారి

ఇంకొల్లు, జూన్ 15 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 23వ ఆంధ్రబెటా లియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్‌గౌతమ్ ఆదేశాల మేరకు ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు యూనిఫాం మెటీరియల్‌ను అందజేశారు. ఒకొక్కరికీ రూ పా.3800 విలువైన యూనిఫాం మెటీరియల్‌ను ఎన్‌సీసీ అధికారి ఎ.శ్రీమన్నా రాయణ ఆధ్వర్యంలో 30మంది క్యాడెట్స్‌కు శనివారం పంపిణీ చేసారు. కార్యక్ర మంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు టి.ఆదినారాయణ, ఉపా ధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్లమో కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 15: వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆ ఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీలో డిప్లమో కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈనెల 20లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు బీ ఉదయ్‌కుమార్ శనివారం తెలిపారు. ఇం టర్ ఎంపీసీ, పదో తరగతితో పాటు ఐటీఐ రెండేళ్ల పాటు ఉత్తీర్ణులైన విద్యా ర్థులకు నేరుగా డిప్లమో ద్వితీయ సంవత్సరం ప్రవేశం ఉంటుందన్నారు. ప్రథ మ సంవత్సరంలో నెలకు రూ.వెయ్యి, ద్వితీయ రూ.1100, తృతీయ సంవత్సరం లో రూ.1200 చొప్పున ఉపకార వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 11,90,912

వలేటివారిపాలెం : మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.11,90,912 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమి షనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ.7,750, కుంకుమార్చన ద్వారా రూ.24,360, వివాహాల ద్వారా రూ.6 వేలు, తలనీలాల ద్వారా రూ.63,150, వాహనపూజల ద్వారా రూ.5,680, ప్రత్యేకదర్శనం ద్వారా రూ.4,05,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.640, రూముఅద్దెల ద్వారా రూ.24,120, కవర్ల ద్వారా రూ.7,800, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,06,070, అన్నదానం ద్వారా రూ.4,09,642, విరాళాల ద్వారా రూ.30,600 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.



• ప్రతి ఒక్కరి రియల్ హీరో ఆయనే! • కనిపించే దైవం.. మార్గదర్శకుడు

నాన్నకు ప్రేమతో..

ఓర్పునకు మారుపేరు.. మార్పునకు మార్గదర్శి.. నీతికి నిదర్శనం.. ప్రగతికి సోపానం.. క్రమశిక్షణకు చిరునామా.. మొదటి స్నేహితుడు.. ఆత్మబంధువు.. శ్రేయోభిలాషి... గురువు... దైవం.. నేస్తం.. త్యాగమూర్తి.. కష్టజీవి.. రోల్‌మోడల్.. ఇలా అన్నీ నాన్నే అవుతాడు.. ఆడిస్తాడు.. నడిపిస్తాడు.. నడవడిక నేర్పుతాడు.. నేనున్నానంటూ ధైర్యాన్ని ఇస్తాడు.. భయం వద్దని భరోసా నింపుతాడు.

నాన్న... రెండక్షరాల పదం. కానీ ఈ రెండక్షరాల్లోనే జీవితం మొత్తం దాగుంది. ప్రతి అబ్బాయికి మొదటి హీరో తండ్రి అయితే, ప్రతి అమ్మాయికి మొదటి స్నేహితుడు నాన్నే. తల్లి 9 నెలలు కడుపులో పెట్టుకుంటే మిగిలిన జీవిత మంతా తండ్రి తన భుజాలపై పెట్టుకుంటాడు. ఇలా నాన్న గురించి చెప్పుకుంటూ పోతే పదాలు చాలవు. అటువంటి తండ్రి కోసం ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించడం మన అదృష్టం. అంతటి గొప్ప తండ్రికి ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే ఫాదర్స్‌డే సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..


- నెల్లూరు (విద్య/ఆంధ్రజ్యోతి బృందం)

భవిష్యత్తుకు భరోసా ఇచ్చారు!



ఆడపిల్లలమనే ఆలోచన, భయం కలగకుండా మా భవిష్యత్తుకు భరోసాగా మా నాన్న అన్నీ తానై వ్యవహరించారు. దగదర్తి మండలం ఉలవపాళ్ల మా ఊరు. నాన్న సంజీవరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ వజ్రమ్మ. నలుగురు ఆడబిడ్డలు, ఒక మగ సంతానం. కానీ ఆడమగ తేడా లేకుండా అందరినీ సమానంగా పెంచారు. ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు ఆడపిల్లలకు విద్యే ఆభరణమని నమ్మిన వ్యక్తి మా నాన్న. కన్నపిల్లలతోపాటు వేలాదిమంది విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దారాయన. సమాజంలో మాకు లభిస్తున్న గౌరవాన్ని చూసి సంజీవరావు పిల్లలమని గర్వంగా చెప్పుకుంటాము. ఒక స్నేహితుడిగా, మార్గదర్శిగా నిలవడం వల్లే మేమంతా ప్రయోజకులుగా స్థిరపడ్డాము.

- కోండ్రు సౌజన్య, సీడీపీఓ, కావలి



నా మొదటి గురువు ఆయనే!



మా నాన్నే నా మొదటి గురువు. మాది అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం వేపగుంట గ్రామం. నాన్న కే నాగానందం బీఈడీ చదువుకుని ట్యూషన్ చెబుతూ అంచెలంచెలుగా ఎదిగి నాలుగైదు గ్రామాల్లో ప్రైవేట్ స్కూల్స్ నడిపేవారు. 7వ తరగతి వరకు మా నాన్న దగ్గరే చదువుకున్నా. ఆ తర్వాత ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో చదివాను. కొడుకు కన్నా మిన్నగా నన్ను చూసుకుని చదివించారు. నాన్న కోరిక మేరకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసినా.. పేదలకు మరింత సేవ చేయాలనే నాన్న ఆశయంతో గ్రూప్-1కు సిద్ధమయ్యాను. 2013లో మొదట గ్రూపు-1 సాధించా. 2016లో గ్రూపు-1కు ఇంటర్వ్యూ వరకు వెళ్లా. 2019-20లో గ్రూపు-1 నోటిఫికేషన్ వచ్చింది. అప్పటికే నాకు వివాహమైంది. నాన్న ఆశయం, నా భర్త సాయికుమార్ కుటుంబ సభ్యుల సహకారంతో పట్టుదలతో పరీక్షలకు హాజరయ్యాను. సత్యసాయి జిల్లాలో మొదట ఏడాది శిక్షణ, ఆ తర్వాత 2023లో ఆర్డీవోగా ఆత్మకూరులో బాధ్యతలు తీసుకున్నాను. నా ఉన్నతి కారణమైన మా నాన్న స్ఫూర్తిగా సేవా, సంస్కారం అబ్బాయి. ప్రయోజకురాలినై పది మందికి సేవ చేయాలన్నదే ఆయన ఆశయం. ఆ దిశగానే అంకితభావంతో నా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నా. నా ఉన్నతికి ఎంతో శ్రమించినా మా నాన్నగారు 2009లో చనిపోయారు. అప్పటి నుంచి మా అమ్మ అన్నీ తానై తండ్రి లేనిలోటు తీర్చింది. నా ఉన్నతికి కారణమైన నాన్నకు ప్రేమతో ధన్యవాదాలు.

- కె మధులత, ఆర్డీవో, ఆత్మకూరు

పిల్లలు వేసే ప్రతి అడుగు వెనుకే ఉంటాడు. తప్పటడుగులు వేసే వయసు నుంచి తప్పుడు అడుగులు వేసినా వెంట ఉండి మంచి మార్గాన్ని చూపించేది తండ్రే. తన పిల్లల కోసం ఏం చేయడానికైనా ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఎంతకష్టం వచ్చినా ఆ కష్టాన్ని పిల్లలకు తెలీయకుండా పెంచుతాడు. వారికోసం తన సర్వస్వాన్ని వదులుకోవడానికి సిద్ధపడతాడు. తాను ఏ పరిస్థితుల్లో ఉన్నా పిల్లలు ఏదైనా గొప్పపని చేశారని తెలిస్తే చాలు తనకున్న బాధలన్నిటినీ మరచిపోయి ఆనందంగా గడిపేస్తాడు. ఏ కుటుంబానికైనా ధైర్యాన్ని, ఆసరాన్ని కల్పించేది మాత్రం నాన్న మాత్రమే. నాన్న అన్నీ సమకూరిస్తే వాటిని పిల్లలకు అందించేది అమ్మ. జీవన ప్రయాణంలో తనకు ఎదురయ్యే కష్టాలను తన పిల్లలకు కన్పించకుండా ఉండేందుకు నాన్న పడే తాపత్రయం అంతా ఇంతా కాదు. బాధలతో గుండె బరువెక్కిన క్షణంలో కన్నీళ్లు వరదలా వస్తున్నా వాటిని కనురెప్పలచాటున దాస్తాడే తప్ప బయటకు కనిపీయడు.

• ఫాదర్స్ డేకు నాంది..

ప్రాంతాలు వేరైనా.. దేశం ఏదైనా బిడ్డల కోసం తండ్రి పడే తపన మాత్రం ఒక్కటే. బిడ్డల ఎదుగుదల కోసం చేసే త్యాగం ఒక్కటే...దాన్ని గుర్తించి వందనం చెప్పడం కోసమే ప్రపంచమంతా ఫాదర్స్‌డే జరుపుకుంటుంది. తండ్రి త్యాగాలను కొనియాడుతుంది. పిల్లల ఎదుగుదల కోసం తల్లిదండ్రులు పడే తపన అంతాఇంతా కాదు. కానీ తల్లికి లభించినంత గుర్తింపు తండ్రికి లభించలేదు. ఇలాంటి ఆలోచన ఓ అమ్మాయి మదిలోకి రావడంతోనే వచ్చింది ఫాదర్స్‌డే...

వాషింగ్టన్‌కు చెందిన సోనారాకు 6 నెలల వయసులోనే తల్లి చనిపోయింది. జోలపాటల నుంచి గోరుముద్దలు తినిపించే వరకు సర్వస్వం నాన్నే అయ్యారు. తల్లి రూపం కూడా తెలియని ఆ చిన్నారికి నాన్న హెన్రీజాక్సన్ పడిన తపన, కష్టం తెలుసు. తన కోసం నాన్న చేసిన త్యాగాలూ తెలుసు. అందుకే 27 ఏళ్ల వయసు వచ్చేసరికి నాన్నకు ఓ గుర్తింపు ఇవ్వాలన్న ఆలోచన ఆమెలో బలపడింది. ఆ అమ్మాయి దృఢసంకల్పం వల్ల 1910, జూన్‌లో తన తండ్రి హెన్రీజాక్సన్ పుట్టిన రోజున ఫాదర్స్‌డేగా ఊపిరిపోసుకుంది. తనతండ్రి పుట్టిన రోజు మాత్రమే కాదు ప్రపంచంలోని తండ్రులందరికీ గుర్తింపు తేవాలన్న లక్ష్యంతో పోరాటం మొదలుపెట్టింది సోనారా. చివరకు 1910 జూన్ 19న ప్రపంచంలోనే మొదటిసారిగా అమెరికాలో ఫాదర్స్‌డే వేడుకలు జరిగాయి. 1916లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉండ్రోవిల్సన్ జూన్ 3వ ఆదివారం ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించుకునేందుకు ఆమోదం తెలిపారు.

ఫాదర్స్ డే వేడుకలను ప్రపంచమంతా నిర్వహిస్తున్నా వివిధ కారణాల వల్ల దీన్ని ఒకేరోజు జరుపుకోవడంలేదు. ఏ దేశంలో ఎప్పుడు జరుపుకున్నా నాన్నకు పెద్దపీటనే వేసి గౌరవిస్తున్నారు. తండ్రికి ఉన్న ప్రాముఖ్యతను చాటుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా మీ నాన్న మీ కోసం చేసిన త్యాగాలను స్మరణకు తెచ్చుకుని ఆరాధించండి. కనీసం ఈ ఒక్కరోజైనా తండ్రితో కలిసి ఆనందంగా గడుపుతారని, గడపాలని ఆశిద్దాం.

నాన్న ప్రేరణతోనే..



నాన్న ప్రేరణే నన్ను ఈస్థాయికి చేర్చింది. మాది గుంటూరు జిల్లా తెనాలి. నాన్న కృష్ణారెడ్డి రిటైర్డు హెడ్‌మాస్టర్. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు అయినా అందరినీ సమానంగా పెంచి విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకులను చేశారు. అన్నయ్య చెన్నైలో ఉండగా, చెల్లి డాక్టర్. నేను మాత్రం నాన్నను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నా. ఎంఏ బీఈడీ చేసి 1998లో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరాను. ఆ తర్వాత గ్రూప్-2లో ఎంపికై డీఎల్‌పీవో స్థాయికి ఎదిగాను. తండ్రి ప్రేరణతోపాటు ఆయన ప్రతి విషయంలో మా వెనుక ఉండి మంచి నడవడికలతో మమ్మల్ని తీర్చిదిద్దారు. మా నాన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

- రాధామాధవి, డీఎల్‌పీవో, కావలి

ఎరువుల ఫ్యాక్టరీ వద్దే వద్దు!

- ముక్తకంఠంతో వ్యతిరేకించిన గ్రామస్థులు
- వారి అభిప్రాయాలు ఆలకించని అధికారులు
- మొక్కుబడిగా సాగిన ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు, వివరణ ఇస్తున్న ఫ్యాక్టరీ నిర్వాహకులు



మాట్లాడుతున్న గ్రామస్థులు

ఉలవపాడు, జూన్ 15 : తమ బతుకులు బుగ్గిపాలు చేసే ఎరువుల తయారీ ఫ్యాక్టరీ వద్దేవద్దంటూ ఉలవపాడు, రాజుపాళెం గ్రామస్థులు తేల్చి చెప్పారు. అయితే, వారి అభిప్రాయాలను తెలుసుకోకుండా అధికారులు వెళ్లిపోవడంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయాన్ని కూడా మొక్కుబడిగా నిర్వహించారంటూ మండి పడ్డారు. ఉలవపాడుకు చెందిన వైసీపీ నాయకుడి కుమారుడు జాతీయ రహదారి పక్కన తనకున్న 2.91 ఎకరాల్లో రూ.9.7 కోట్లతో ఏడాదికి 1.2 లక్షల టన్నుల ఉత్పత్తి కలిగిన ఎరువుల తయారీ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారు. ఏ రకం ఎరువులు తయారు చేస్తారు? దానివల్ల సంభవించే కాలుష్య ప్రభావంపై గ్రామస్థుల్లో నెలకొన్న ప్రశ్నలకు ఎవరూ నివృత్తి చేయలేదు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ప్రాంతంలో జిల్లా కాలుష్య నివారణ బోర్డు ఈఈ చింతపల్లి రాజశేఖర్, కందు కూరు ఇన్‌చార్జి ఆర్డీవో శీనా నాయక్ (కావలి), ఇన్‌చార్జ్ తహసీల్దారు గుడ్లూరు ఏవీ రమణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ముందుగా సింగిల్ సూపర్ పాస్ఫేట్ తయారీ ద్వారా వచ్చే వ్యర్థాలను రీసైకిల్ విధానంలో శుద్ధి చేస్తారని, భూ కాలుష్యం కాకుండా ప్రత్యేక పద్ధతిలో చర్యలు తీసుకుంటారని ఫ్యాక్టరీ నిర్వాహ కులు వివరణ ఇచ్చారు. ఉలవపాడు, రాజుపాలెం గ్రామస్థులు వీటన్నిటిపై అనుమానాలు ఉన్నాయని, గ్రామ సమీపంలో ఫ్యాక్టరీ ఉన్నందున గాలిలో విషవాయువులు వెలువడతాయని, భూసారం, మట్టి కలుషితం అవుతాయని అధికారులను నిలదీసేందుకు ప్రజాభిప్రాయవేదిక వద్దకు భారీగా తరలివెళ్లారు. ప్రతిరోజు ఎరువుల తయారీకి సుమారు 2 లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుంది. భూగర్భ జలాలు వాడేపనైతే చుట్టు పక్కల మామిడి తోటలకు, రాజుపాలెం, ఉలవపాడు గ్రామాలకు భూగర్భ జలాలు ఇంకుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, కాలుష్య నియంత్రణ అధికారులు మాత్రం అక్కడకు విచ్చేసిన సామాజిక కార్యకర్తలు, పర్యావరణ పరిరక్షణ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, స్థానికంగా వైసీపీ నాయకుల అభిప్రాయాలు చెప్పిన వెంటనే కార్యక్రమం ముగిసిందని మమనిపించి వెళ్లిపోయారు. గ్రామస్థులు తమ అభ్యర్థనలను అర్జీల రూపంలో విన్నవించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఆర్డీవో, పొల్యూషన్ బోర్డు ఈఈ హడావుడిగా వెళ్లిపోయారు. చివరకు ఇన్‌చార్జ్ తహసీల్దారు రమణకు అర్జీలు ఇచ్చారు. తమ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా ముందస్తు ప్రణాళిక మాదిరి ఒక గంటలో కార్యక్రమం ముగించుకొని అధికారులు వెళ్లిపోవడాన్ని గ్రామస్థులు తప్పుబట్టారు. దీనిపై ఎమ్మెల్యేకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.



నెల్లూరు : ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు



గాంధీబొమ్మ వద్ద మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు

కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన

- ప్రజల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం
- అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు
- రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ
- జరిగిన దోపిడీలపై ప్రత్యేక విచారణ కమిటీ
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి
- నెల్లూరులో 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో భారీ ర్యాలీ
- పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు

నెల్లూరు (విద్య), జూన్ 15 : రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన జరుగుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు స్వస్తి పలుకుతూ ప్రజలంతా తమ ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి, యువత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఐదు సంతకాలు చేశారన్నారు. అంతేగాక ఇచ్చిన హామీలతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నిటికీ శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మున్ముందు ప్రజా పరిపాలన ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అన్యాయంపై న్యాయం విజయకేతనం ఎగురవేసి రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి 164 ఎమ్మెల్యే సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరుణంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో ఓ ఎంపీ, పదిమంది ఎమ్మెల్యేల విజయంతో చారిత్రాత్మిక తీర్పు ఇచ్చిన ప్రజల రుణం తీసుకునే సమయం ఆసన్నమైందన్నారు. వైనాట్ 175 అని 2019లో వచ్చిన సీట్లలో మధ్యలో ఐదు పోగొట్టుకున్నారని జగన్‌కు తగినశాస్తి జరిగిందన్నారు. చంద్రబాబుకు అండగా నిలిచి పవన్ కల్యాణ్ నిజమైన హీరో అనిపించుకున్నారన్నారు. మాజీ కాకాణి ఇరిగేషన్‌లో పనులు చేయకుండానే కోట్ల రూపాయలను దిగమింగారని ఆరోపించారు. జిల్లాలో జరిగిన భూ కుంభకోణం, మైనింగ్‌దోపిడీ, జగనన్న కాలనీల పేరుతో అక్రమాలు, ఇరిగేషన్‌లో జరిగిన దోపిడీలపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి అక్రమాలను వెలికితీస్తామన్నారు. మంత్రి నారాయణ ఇప్పటికే దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, త్వరలోనే ఈ అవినీతి, అక్రమాలను బట్టబయలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం నిర్వహించి ర్యాలీగా గాంధీబొమ్మ వరకు చేరుకున్నారు. అక్కడ గాంధీజీకి పాలభిషేకం చేసి, బాణాసంచాతో సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశిం సునీల్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకుందాం

• మత పెద్దలతో ఎస్పీ సమన్వయ సమావేశం

నెల్లూరు (క్రైం), జూన్ 15 : ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు జరుపుకోవాలని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. శనివారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం బక్రీదు పండుగ సందర్భంగా హిందూ, ముస్లిం మతపెద్దలతో ఎస్పీ సమావేశమై మాట్లాడారు. మతసామరస్యాన్ని కాపాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద పోలీస్ పికెట్‌తోపాటు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మత సామరస్యానికి భంగం కలిగించేలా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా 112కు సమాచారాన్ని అందించాలని కోరారు. అనంతరం ఇరు మతపెద్దలు ఒకరినొకరు సహకరించుకుంటామని ఎస్పీకి హామీ ఇచ్చారు.



మత పెద్దలతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నేటి నుంచి అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అడవి పేరంటాలమ్మ అమ్మవారు

ఉదయగిరి రూరల్, జూన్ 15: మండలంలోని గన్నేపల్లి పంచాయతీ లో ఉన్న శ్రీ అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆదివారం గడ్డంవారిపల్లి నుంచి నిలుపు కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సోమవారం కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీ, గన్నేపల్లి, మంగళవారం మిట్టపల్లి, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, పేరంటాలమ్మ నగర్‌లో గ్రామోత్సవం జరుగుతుంది. బుధవారం పసుపుకుంకుమ బండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, గురువారం పొంగళ్లు, బండలాగుడు పోటీలు, విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గంగాభవాని తిరునాళ్ల...



సీతారామపురం, జూన్ 15 : మండలంలోని సింగారెడ్డిపల్లిలోని గంగాభవానీ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవాలను ఆదివారం నుంచి మూడురోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు సింగారెడ్డిపల్లి, నాంచారమ్మపల్లి యాదవ సంఘ సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం నిలుపు, విశేష పూజా కార్యక్రమాలు, సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు ఉత్సవం, మంగళవారం సాయంత్రం బండ్ల పొంగళ్ల నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి సంతానలక్ష్మి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉదయగిరి రూరల్, జూన్ 15: పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో స్వయంభుగా వెలసిన సంతానలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 17న గణపతి పూజ, పుణ్య హవచనం, గోపూజ, అమ్మవారి పంచామృతాభిషేకాలు, నవగ్రహ హోమాలు, కుంకుమార్చనలు, హారతి, పుట్ట మన్ను తెచ్చుట, 18న అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకరణ, హోమాలు, 19న పసుపు, కుంకుమ ప్రదానోత్సవం, సంతానంలేని వారు వరపడుట, అమ్మవారి గ్రామోత్సవం, 20న ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం, 21న అభిషేకాలు, ధనలక్ష్మి అలంకరణ, బండ్లుపొంగళ్ల కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు భక్తులకు అన్నదాన సౌకర్యం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

సీతారామపురం, జూన్ 15 : ఉపాధి హామీ పథకం కింద సీతారామపురం గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనులను ఏపీఓ సుభాషిణి శనివారం పరిశీలించారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి పూర్తిస్థాయి వేతనం పొందాలని, ఉదయం 6గంటల నుంచి 10 గంటల్లోపు పనులు పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు.

అంగన్‌వాడీల బడిబాట ర్యాలీ

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 15: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని శనివారం మండలంలోని నందిపాడు, రెడ్లదిన్నె, బొటికర్లపాడు, శ్రీరాంనగర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యాబోధన తదితర అంశాలను తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భోగ్యం సరస్వతి, జయమ్మ, ప్రమీల, అన్నపూర్ణ, విజయ, సుభాషిని, ప్రభావతి, చిన్నక్క, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం నిధులకు ప్రతిపాదనలు

ఉదయగిరి, జూన్ 15: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలో 16వ ఆర్థిక సంఘం నిధుల అంచనాలకు ప్రతిపాదనలు రూపొందించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఈవోపీఆర్డీ మల్లికార్జున అంచనాలకు ప్రతిపాదనలు తయారు చేశారు. 15వ ఆర్థిక సంఘ నిధుల్లో మంజూరైన నిధులు, వాటి ఖర్చులు తదితర అంశాలను అంచనాలు వేస్తూ 16వ ఆర్థిక సంఘం నిధుల విడుదల అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుపై అన్నదాతల హర్షం

ఉదయగిరి రూరల్, జూన్ 15: ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతకాలు చేశారు. రాక్షస చట్టంగా ఉన్న ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేయడంతో అన్నదాతలు, తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేయడం హర్షణీయమని, గత ప్రభుత్వ పాలనలో ఈ చట్టం రద్దు చేయాలని న్యాయవాదులు చేసిన పోరాటాలకు ఫలితం దక్కిందని టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు అన్నారు. ఈ చట్టం రద్దు పట్ల రైతులు గడ్డం వెంకటేశ్వర్లు, ఈర్ల శంకర్, సుబ్బారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు పెద్దల పండుగ
- రేపు సామూహిక ప్రార్థనలు
- ఏర్పాట్లలో ముస్లింల నిమగ్నం


తోటలచెరువుపల్లిలో ముస్తాబైన ఈద్గా

వరికుంటపాడు, జూన్ 15: ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ పండుగను సోమవారం నిర్వహించుకునేందుకు ముస్లింలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మసీదులతో పాటు సామూహిక ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈద్గాలను ముస్తాబు చేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు: తొలిరోజైన ఆదివారం ఇంటిల్లిపాది పెద్దల పండుగను నిర్వహించి మృతి చెందిన కుటుంబీకులకు నూతన వస్త్రాలు, వంటకాలతో నైవేద్యాలు పెట్టి ప్రార్థనలు చేపడతారు. అలాగే రాత్రి సమయంలో జాగారణ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లోను అవసరమైన వసతులను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం సామూహిక ప్రార్థనలు చేసే ఈద్గాల వద్ద ప్రత్యేక వసతులను సైతం ఏర్పాటుచేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉన్నవారు స్వగ్రామాలకు చేరుకోవడంతో ప్రతి కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది.

పని చేయని వీడియో కాన్ఫరెన్స్ టీవీలు

- అధికారుల అవస్థలు


ఎంపీడీవో కార్యాలయంలో పనిచేయక నిరుపయోగంగా ఉన్న టీవీ

ఉదయగిరి, జూన్ 15: నియోజక వర్గ కేంద్రమైన ఉదయగిరి తహసీల్దారు, మండల పరిషత్ కార్యాల యాల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు పనిచేయకపోవడంతో అధికారులు అవస్థలు పడుతున్నారు. ప్రతి సోమవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుంది. అలాగే మండల పరిషత్ కార్యాల యంలో మిగిలిన రోజుల్లో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్‌లకు అవకాశం కల్పిస్తారు. అయితే గత కొన్ని నెలలుగా ఈ రెండు కార్యాలయా ల్లో వీడియో కాన్ఫరెన్స్ టీవీలు పనిచేయక సంబంధిత అధికారులు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుత్తలూరుకు పరుగులు తీయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి వీడియో కాన్ఫరెన్స్ టీవీలు పనిచేసేలా చూడాలని అధికారులు కోరుతున్నారు.

వైభవంగా నాగూరమీరా గంధోత్సవం


గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంగం, జూన్ 15: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో శనివారం తెల్లవారు జామున నాగూర మీరా గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ గ్రామంలో పది కుటుంబాలు మాత్రమే ముస్లింలు. మిగిలిన కుటుంబాలన్నీ హిందూవులవే. సాయిబాబా ఆలయం, నాగూరమీరా దర్గా ఒకే ఆవరణంలో ఉంటాయి. కాంపౌండ్ కూడ ఒక్కటే. గంధ మహోత్సవంలో ముస్లింల కంటే హిందూవులే ఎక్కువగా పాల్గొనడం గమనార్హం. సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఏటా గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

పెంచలకోనకు టీడీపీ శ్రేణుల పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

అనంత సాగరం, జూన్ 15: మండల టీడీపీ అధ్యక్షురాలు మునగ పాటి సునీత ఆధ్వర్యంలో శనివారం కార్యకర్తలు చిలకల మర్రి నుంచి పాదయాత్రగా రాపూరు మండలం పెంచల కోనకు వెళ్లారు. అక్కడ శ్రీలక్ష్మీనర సింహస్వామిని దర్శించుకు న్నారు. టీడీపీ అధికారంలోకి రావడం, ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ఎన్నిక కావడంతో తన మొక్కు తీర్చుకొన్నట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో చల్లా శివారెడ్డి, కేతా శ్రీనివాసలురెడ్డి, కిరణ్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి మాతమ్మ జాతర

సంగం, జూన్ 15: స్థానిక తూర్పు దళితవాడలోని మాతమ్మ ఆలయంలో ఆదివారం నుంచి జాతర ప్రారంభం కానున్నది. ఈ జాతర ఐదు రోజులపాటు జరగనున్నది. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదటి రోజు కలశస్థాపనతో జాతర ప్రారంభమవుతుంది. ప్రతి రోజు అమ్మవారికి అభిషేకాలు, పూలంగిసేవ, ప్రత్యేక ముత్యాల, చందన అలంకరణ, అన్నదానం జరుగుతాయి. చివరి రోజు పొంగళ్లు, ఎడ్లబండ్ల ఉత్సవం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు వైష్ణవి ఎంపిక

ఏఎస్ పేట,జూన్15: ఎన్‌ఎంఎంఎస్ జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు జమ్మవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని వైష్ణవి ఎంపిక అయినట్లు హెచ్‌ఎం హరిప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన శనివారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమెకు 9 నుంచి 12వ తరగతి వరకు ప్రతి ఏటా రూ. 12వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు.దీంతో ఆ విద్యార్థినిని ఎంఈవో జ్యోతి, ఎంఈవో-2 సాయి ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

కలగా మిగిలిన పేదవాడి సొంతింటి కల

- లబ్ధి పొందింది వైసీపీ నేతలే..!

ఉదయగిరి రూరల్, జూన్ 15: ప్రతి పేదవాడికి ఉచిత స్థలంతో పాటు నాణ్యమైన ఇల్లు నిర్మించి ఇస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి ఐదేళ్ల అధికారంలో ఉండి చివరకు పేదల కలను నెరవేర్చలేకపోయారు. ప్రస్తుతం జగనన్న లేఅవుట్లలో కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తి ఇళ్లు, నాసిరకం బేస్‌మట్టాలు దర్శనమిస్తుండగా, మరికొన్ని ప్రాంతాలు చిట్టడవిని తలపిస్తున్నాయి. కాలనీలకు సేకరించిన స్థలాలు కొండలపై, శ్మశానాలు, చెరువుల పక్కన, లోతట్టు ప్రాంతాల్లో ఇచ్చారు. నివాసయోగ్యమైన స్థలాలు లేకపోవడంతో పలువురు వెనుకంజ వేయగా, మరికొంత మంది ముందుకొచ్చి అష్టకష్టాలు పడి బేస్‌మట్టాలు నిర్మించగా, మరికొంతమంది అరకొరగా ఇళ్లు నిర్మించారు. కొన్ని పంచాయతీల్లో ఒక్క ఇల్లు కూడా నిర్మించకపోవడంతో ప్రస్తుతం జగనన్న లేఅవుట్లు చిట్టడవిని తలపిస్తున్నాయి.


ఉదయగిరి మండలం కొండాయపాలెం జగనన్న లేఅవుట్‌లో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం


దుత్తలూరు మండలం వెంకటంపేటలో బేస్‌మట్టాలకే పరిమితమైన జగనన్న ఇళ్లు

ప్రజాధనం దోచుకున్న వైసీపీ నేతలు

లేఅవుట్ల అభివృద్ధి పేరుతో జంగిల్ క్లియరెన్స్, అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీటి బోర్ల ఏర్పాట్లతోపాటు మొక్కల పెంపకం చేపడుతున్నట్లు భారీగా నిధులను ఖర్చు చేసింది. ఇళ్లు నిర్మించకపోయినా అభివృద్ధి పేరుతో వైసీపీ నాయకులు ప్రజాధనాన్ని దోచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో స్థలం దొరక్క ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసి రూ.లక్షలు స్వాహా చేసి తమ జేబులు నింపుకున్నారని, ఐదేళ్ల వైసీపీ పాలనలో అర్హులైన వారికి ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదనే పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ పరిస్థితి ఏమిటని అరకొరగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

భక్తులకు మెరుగైన వసతులు : ఎమ్మెల్యే ఇంటూరి


వలేటివారిపాలెం : నృసింహస్వామి గర్భగుడిలో ఇంటూరి కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

వలేటివారిపాలెం, జూన్ 15: మాలకొండకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గోశాలను సందర్శించి గోమాతకు పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురైతే సహించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఎలక్ట్రికల్ ఆటోలో ఎక్కి తిరిగారు. తదనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీసీ కేబీ శ్రీనివాసరావు, వలేటివారిపాలెం, గుడ్లూరు, కందుకూరు మండలాల టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, దామా మల్లేశ్వరరావు, నాయకులు చెరుకూరి వంశీకృష్ణ, కామినేని అశోక్, తదితరులు పాల్గొన్నారు.

- **మాలకొండను దర్శించుకున్న ఎమ్మెల్యేలు**

మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యలు వేర్వేరుగా దర్శించుకున్నారు. వాళ్లకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా వారు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేలకు అర్చకులు శాలువా పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆలయంలో భక్తులకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని ఆలయ అధికారులను ఎమ్మెల్యేలిద్దరూ అభినందించారు.

- **మాలకొండకు పాదయాత్ర**

లింగసముద్రం : కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో మండలంలోని ఎర్రారెడ్డిపాలెం టీడీపీ నాయకులు శనివారం మాలకొండకు పాదయాత్ర చేశారు.ఉదయం 7 గంటలకు గ్రామంలోని రాములోరి ఆలయం, నాగార్పమ్మ గుడిలోనూ ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉట్లపల్లి పెద్ద మాధవరావు, పార్టీ నాయకులు రాజారపు మాలకొండయ్యల ఆధ్వర్యంలో నాయకులు, తెలుగు యువత నేతలు పాదయాత్రగా మాలకొండకు చేరుకున్నారు.మాలకొండలో 101 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి


సాంఘిక సంక్షేమశాఖామంత్రి స్వామిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సీ సెల్ నాయకులు

కందుకూరు, జూన్ 15: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. తొలిసారిగా నియోజకవర్గంలో శనివారం అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలికలకు విద్యాకిట్లు పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీమేరకు మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేశారని, నారా లోకేష్ విద్యాశాఖామంత్రిగా ఉన్నందున విద్యారంగం అభివృద్ధికి కృషిచేస్తారని తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఎమ్మెల్యే ఇంటూరిని ఘనంగా సత్కరించారు. ఎంఈవో సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడారు. బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ద్వారాకారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ప్రసాదరావు, ఎంఈవో సుబ్బారెడ్డి, హెచ్‌ఎంలు నరసింహమూర్తి, మాల్యాద్రి, షౌకత్‌అలీ, కమలకుమార్, దామా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

- **ఎమ్మెల్యేలకు ఆత్మీయ సన్మానం**

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యలను శనివారం కందుకూరులో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ యాదవ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న ఎంఎం కొండయ్య నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వీరిద్దరిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు బీసీలకు మంచి గుర్తింపునిస్తున్నారని, అందులోనూ యాదవ సామాజికవర్గానికి ఆయన ఇచ్చే ప్రాముఖ్యత అందరికీ తెలిసిందేనన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎంతోమంది చీరాలకు వచ్చి తన విజయంకోసం పనిచేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఎంఎం కొండయ్య సతీమణి కొండమ్మ, యాదవసంఘం నాయకులు అప్పనబోయిన నరసింహం, వై. లక్ష్మీనారాయణ, జనిగర్ల నాగరాజు, పీలా శ్రీనివాసరావు, కుర్రా సూర్యనారాయణ, రామకృష్ణ, గెట్టిబోయిన మల్లికార్జున, పలువురు యాదవసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

- **మంత్రి స్వామికి ఎస్సీ సెల్ నేతల శుభాకాంక్షలు**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రిగా నియమితులైన కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని కందుకూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు శనివారం అమరావతిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్వామిని కలిసిన వారిలో నెల్లూరు పార్లమెంటు అధికారప్రతినిధి గోచిపాతల మోషే, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు జీ ప్రసాదరావు, కసుకుర్తి నవరత్నం, దువ్వూరి రమేష్‌చంద్ర, గొడపేరు అనిల్ తదితరులు ఉన్నారు.

- **మున్సిపల్ మంత్రి నారాయణను కలిసిన ఇంటూరి**

రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొంగూరు నారాయణను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం రాత్రి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరులోని నారాయణ నివాసానికి వెళ్లిన ఇంటూరి ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

రాగి తీగ చోరీ యత్నం

లింగసముద్రం : మూడు భారీ నీటి పథకాలకు ఏర్పాటు చేసిన 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను చోరీ చేసేందుకు శుక్రవారం అర్ధరాత్రి దొంగలు ప్రయత్నించారు. సాధ్యం కాక ట్రాన్స్‌ఫార్మర్‌ను కింద పడేశారు. దీంతో అందులోని ఆయిల్ కొంత కింద పడింది. విషయం తెలుసుకున్న కందుకూరు గ్రామీణ తాగునీటి సరఫరా డీఈ రామ్మోహన్‌రావు, ఏఈ రాజశేఖర్, ఏఈ షేక్ ఫిరోజ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాన్ని బాగు చేయించేందుకు గుడ్లూరుకి తరలించారు.ఈ సందర్భంగా డీఈ రామ్మోహన్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ బాగయ్యేందుకు 3 రోజులు పడుతుందన్నారు.అప్పటి వరకు నీటి సరఫరా ఉండదని చెప్పారు.అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

పైపులైన్ మోటార్‌సెట్ చోరీ

గుడ్లూరు : గుడ్లూరులో కుళాయిలకు నీరు అందించేందుకు ఉప్పుటేరు వద్ద ఏర్పాటుచేసిన పైపులైన్ మోటార్ సెట్‌ను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి చోరీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మహేష్ శనివారం తెలిపారు. గతంలో కూడా ఈ మోటార్ సెట్ చోరీకి గురైందని తెలిపారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందచేశామన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

వలేటివారిపాలెం : మండలంలోని నేకునాంపురం సర్పంచి కొల్లూరు లక్ష్మమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మాధవి శనివారం విద్యుత్ సిబ్బందితో వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు వీధిలైట్లు మరమ్మతులకు గురయ్యాయి. గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంచాయతీ కార్యదర్శి వీధిలైట్లు వేయించారు.

అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు !

బిట్రగుంట : బేతనీపేటలో దాతలు ఎవరైనా అభివృద్ధి పనులు చేయాలని ముందుకు వస్తే కొందరు నేతలు అడ్డుకునేవారు. అయితే ఇప్పుడు ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డి (దగుమాటి) వచ్చారు... అభివృద్ధిని ఎవరూ ఆపలేరని మండల టీడీపీ యువనేత గోచిపాతల సంజయ్ అన్నారు. బోగోలులోని బేతనీపేటలో పేరుకుపోయిన చెత్త, కంపచెట్ల తొలగింపును శనివారం ఆయన చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో స్థానికులకు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు.


అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

గుడ్లూరు : అనుమానాస్పదంగా ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన గుడ్లూరు మండలంలోని నరసాపురం అటవీ ప్రాంతంలో శనివారం వెలుగుచూసింది. నరసాపురం ఎస్టీ కాలనీకి చెందిన తలపల రమణయ్య (60) శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి ఇంటి దగ్గర నుంచి సమీప అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకులాడారు. అటవీ ప్రాంతంలో రమణయ్య మృతి చెంది పడి ఉండడాన్ని గమనించిన కొందరు పశువులకాపరులు మృతుడి బంధువులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసు పిల్లలు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి : ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూన్ 15: పోలీసు పిల్లలు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెదగాలని జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ సూచించారు. ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం పోలీసు పిల్లలకు కౌన్సెలింగ్ నిర్వహించి కార్పొరేట్ కళాశాలలో ఉచిత అడ్మిషన్‌లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ 101 మంది పోలీసు పిల్లలకు 11 కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత, రాయితీ అడ్మిషన్లు కేటాయించామన్నారు. ఉచిత అడ్మిషన్లు పొందడమే కాకుండా కష్టపడి చదవాలన్నారు.

వైభవంగా పోలేరమ్మ, గంగమ్మల గ్రామోత్సవం


పులివాహనంపై ఊరేగుతున్న గంగమ్మ

బిట్రగుంట, జూన్ 15 : బోగోలులోని యాదవపాలెంలో గంగమ్మ, పోలేరమ్మల తిరునాళ్లలో భాగంగా శనివారం అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అశ్వవాహనంపై ఆశీనురాలైన పోలేరమ్మకు ఆహ్వానం పలుకుతూ గంగమ్మ సన్నిధి చేరగా భక్తులు మంగళహారతులతో పూజించారు. గ్రామోత్సవానికి ముస్తాబైన అమ్మవార్లను గ్రామపెద్దగొళ్ల చిలకపాటి జనార్దన్ యాదవ్, క్రిష్ణయ్య, గ్రామకమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కావలి ఏఎంసీ మాజీ ఛైర్మన్ దేవరాళ్ల సుబ్రహ్మణ్యం యాదవ్, సామాజికకర్త కుందుర్తి వరప్రసాద్ దంపతులు దర్శించి పూజించారు. కీలుగుర్రాలు, బుట్టబొమ్మలు, అమ్మవార్ల వేషధారణ నృత్యాలతోపాటు వీరతాళ్ల నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి. పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవార్లకు గ్రామస్థులు కాయాకర్పూరం అందచేశారు.

ఎట్టకేలకు పాపిరెడ్డి చెరువులో ఆక్రమణల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

కావలి, జూన్15: పట్టణంలోని పాపిరెడ్డి చెరువులో ఉన్న అక్రమ నిర్మాణాన్ని శనివారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పాపిరెడ్డి చెరువులో వైసీపీ నేత అక్రమంగా నిర్మాణాన్ని చేపట్టారు. ఎన్నికలకు ముందు అక్కడ నిర్మాణం చేపట్టడంతో అప్పట్లో ఆంధ్రజ్యోతిలో 'కోటి రూపాయల స్థలం.. కబ్జాకు యత్నం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే అప్పట్లో నిర్మాణ వేగాన్ని మున్సిపల్ అధికారులు తగ్గించారు. దశలవారీగా పునాది మట్టానికి నిర్మాణం పూర్తి చేసిన తర్వాత దాన్ని పూర్తిగా నిలిపివేశారు. ఆ స్థలం పాపిరెడ్డి చెరువులో ఉండటంతో ఇరిగేషన్ అధికారులకు కూడా ఫిర్యాదులు అందాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాన్ని శనివారం తొలగించారు. నిర్మాణాన్ని తొలగిస్తున్న సమయంలో ఆక్రమణదారులు అడ్డుకుని గొడవకు దిగినా, పోలీసులు వారిని పక్కకు నెట్టి నిర్మాణాన్ని తొలగించారు.

కొమ్మిలో బడిబాట

కొండాపురం : మండలంలోని కొమ్మి గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం డేగ మహేష్ శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, బడిబాట కార్యక్రమంపై విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. ముఖ్యఅతిథిగా లోక్‌సత్తా సభ్యుడు మాలకొండారెడ్డి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కొమ్మి క్లస్టర్ అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

కందుకూరు : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల వ్యవసాయాధికారి వీ రాము శనివారం పట్టణంలోని విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఖరీఫ్‌లో అన్నిరకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని, రైతులకు విధిగా రసీదు ఇవ్వాలని విత్తన డీలర్లకు సూచించారు. విత్తన నిల్వలు, ధరలను సూచిస్తూ బోర్డులు ఉంచాలని చెప్పారు. విత్తన దుకాణాలలో నువ్వులు, కందులు, పెసర్లు, సజ్జల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ శాఖ కార్యాలయంలో పొద్దుతిరుగుడు విత్తన మినీకిట్లు ఉచితంగా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

సామూహిక జంతువధ, గోవధ నిషేధం

కావలి : సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు బక్రీద్ సందర్భంగా సామూహిక జంతువధ, గోవధలను నిషేధించామని కావలి ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌లు వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. ముస్లింలు ఈ ఆదేశాలను గమనించాలన్నారు.

శ్రీశ్రీకి నివాళులు

కందుకూరు : విప్లవ కవిత్వాన్ని కొత్తపుంతలు తొక్కించిన మహాకవి శ్రీశ్రీ అని పలువురు వక్తలు ఘనంగా నివాళులర్పించారు. శ్రీశ్రీ 41వ వర్ధంతిని పురస్కరించుకుని జామువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం కందుకూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ముప్పవరపు కిషోర్, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, గాండ్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్ నాయుడుకు సత్కారం

కావలిటౌన్ : వైద్యరత్న బిరుదాంకితులు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన్ను పలువురు వైద్యులు, ప్రముఖులు సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలందిస్తు పేదల వైద్యుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ ప్రభాకర్‌నాయుడు 87వ జన్మదినం జరుపుకోవడం శుభపరిణామన్నారు. సత్కరించిన వారిలో అమ్మ ఆదరణ సంస్థ అధ్యక్షుడు నున్నా మురళీ, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, ఖాదర్ బాష, డాక్టర్ హాలీమౌలాలి తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

ఆదివారం 16, జూన్ 2024 ప్రకాశం 8 పేజీలు









వ్యక్తిగత
జీవితమైనా, రాజకీయ పయనమైనా
నిర్దిష్ట లక్ష్యం.. నిబద్ధత, విధేయత, నిజాయితీ
ఉంటే సామాన్యులు మాన్యులు కావచ్చు. అందుకు
రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జీవితం దర్పణం పడుతోంది.
ఆయన పుట్టింది ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని సామాన్య దళిత కుటుంబం..
పెరిగింది చిన్న పల్లెటూరులో.. అయినా వ్యక్తిగత జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని
గౌరవప్రదమైన డాక్టర్ పట్టా పొందారు. జీవిత సోపానాలను పక్కనపెట్టి వృత్తిలో రాణించారు.
అయినా వినమ్రత, విధేయతలను వీడలేదు. చేతిలో చిల్లిగవ్వలేకపోయినా దామచర్ల కుటుంబ
చేయూతతో రాజకీయ అరంగేట్రం చేశారు. తొలిప్రయత్నంలో ఓటమి ఎదురైనా వెరవలేదు. లక్ష్యాన్ని
వీడలేదు. మరింత ఉత్సాహంతో ముందడుగు వేసి మలిదశలో విజయం సాధించారు. అవకాశం
ఇచ్చిన టీడీపీ, చేయూతనిచ్చిన దామచర్ల కుటుంబం పట్ల విధేయతను ప్రదర్శిస్తూ ప్రజాసంబంధాలను
మెరుగుపర్చుకున్నారు. అవే ఆయన విజయంలో కీలకమయ్యాయి. ఇటు పార్టీ, అటు దామచర్ల
కుటుంబం, అంతకుమించి ప్రజల మద్దతుతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సొంతం
చేసుకున్నారు. అదేసమయంలో దామచర్ల కుటుంబం నుంచి రెండో వారుసుడిగా వచ్చిన సత్య
ప్రోత్సాహం వెన్నుదన్నుగా నిలిచింది. ఇద్దరి సమన్వయాన్ని మెచ్చిన సీఎం చంద్రబాబు.. స్వామికి
కీలక మంత్రిత్వ శాఖలు అప్పగించి ప్రోత్సహించారు. తద్వారా రాజకీయంగా రెండో
దశలోకి ప్రవేశించి ఆదివారం సొంత నియోజకవర్గానికి వస్తున్న స్వామికి జేజేలు
పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం
చేసిన అనంతరం తొలిసారి
డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
కొండపి నియోజకవర్గానికి
వస్తున్న సందర్భంగా
ప్రత్యేక సంచిక







కొండపి అభివృద్ధికి కొండంత కృషి

- దామచర్ల ఆంజనేయులు స్ఫూర్తితో సాగిని ఎమ్మెల్యే స్వామి
- అండగా నిలిచిన సత్య
- టీడీపీ హయాంలో రూ.1,500 కోట్లతో పనులు
- రోడ్లు, వంతెనల నిర్మాణంతో పెరిగిన రవాణా సౌకర్యం
- తాగు, సాగునీటికి ప్రాధాన్యం
- ఇతర మౌలిక వసతుల కల్పన
- అదేస్థాయిలో సంక్షేమ పథకాల అమలు


కొండపిలోని రక్షిత మంచినీటి పథకం

ఒంగోలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతమైన కొండపి నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఆపార్టీ అధికారంలో ఉన్న 2014-19 మధ్య కాలంలో పెద్దఎత్తున నిధులు తెచ్చి అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి విశేష కృషి చేశారు. ఆ నియోజకవర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా అదే స్ఫూర్తితో స్వామి ముందుకు సాగారు. దామచర్ల కుటుంబ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చి, ఎమ్మెల్యేగా ఎన్నికైన స్వామి అహర్నిశలు అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పనిచేశారు. ఆయనకు రాజకీయపరంగానే కాక, ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో యువనేత దామచర్ల సత్య పూర్తి అండగా నిలిచారు. దీంతో ఎమ్మెల్యే స్వామి ఆ ఐదేళ్ల కాలంలో దాదాపు రూ.1,500 కోట్ల మేర నిధులను సాధించారు. నియోజకవర్గంలోని మండల కేంద్రాలను కలిపే ప్రధాన రోడ్లతోపాటు పలు ముఖ్యమైన గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రహదారులను తారురోడ్లుగా అభివృద్ధి చేయించారు. ఇక వర్షాకాలం వస్తే వాగులు, వంకలు పొంగి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి అధికం కాగా భారీగా నిధులు తెచ్చి కాలువలు, బ్రిడ్జిలు, వంతెనలు నిర్మించారు. ఇక తాగునీటి పథకాలు, సాగునీటి సౌకర్యం, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యాల పెంపు, శ్మశానాలు, ఇతర పలు మౌలిక సదుపాయాల కల్పనపైనా ప్రత్యేక దృష్టి సారించి పనిచేశారు. అలాగే విద్య, వైద్య సౌకర్యాల మెరుగునకు చర్యలు తీసుకున్నారు. డాక్టర్ స్వామి కృషితో చేపట్టిన అభివృద్ధి పనుల ఫలాలను ప్రస్తుతం నియోజకవర్గ ప్రజలంతా అనుభవిస్తున్నారు.

సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న కొండపి, టంగుటూరు, ఎస్.కొండ, మర్రిపూడి, మండలాల్లోని 35 గ్రామాలకు దాదాపు రూ.40 కోట్లతో భారీ తాగునీటి పథకాన్ని సాధించి అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే స్వామి పూర్తి చేయించారు. రామతీర్థం రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు ఈ పథకం ద్వారా కొండపి ప్రాంత ప్రజలకు అందుతున్నాయి. కొండపి పెద్దచెరువుకు ముసి నీరు మళ్లింపుతోపాటు పలుఎత్తిపోతల పథకాలు, రక్షిత తాగునీటి పథకాలను పునరుద్ధరణ చేయించి సాగు, తాగునీటి తీవ్రత నుంచి ఉపశమనం కలిగించారు. కొండపి, ఎస్.కొండలలోని పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయించడం వల్ల అనేక గ్రామాల ప్రజలకు వైద్యం సౌకర్యం మెరుగుపడింది. విద్యా సౌకర్యాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎమ్మెల్యే స్వామి కృషితో పొన్నలూరులో రూ.5 కోట్లతో ఎస్టీ గురుకుల పాఠశాల, టంగుటూరులో మరో రూ.5 కోట్లతో బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయించారు. కొండపిలోని కాలేజీకి ఎస్సీ హాస్టల్ సౌకర్యం ఏర్పడింది. ఇక ఇంచుమించు అన్ని గ్రామాలలో అంత ర్గత సిమెంటు రోడ్లు, డ్రైన్లు, శ్మశానాల అభివృద్ధి, తాగునీటి పైపులైన్ల నిర్మాణం, చెరువుల అభివృద్ధి, పాఠశాలల్లో సౌకర్యాల కల్పన, విద్యుత్ సౌకర్యం మెరుగునకు భారీగా నిధులు తెచ్చి చేయించారు. ఏప్రాంతం వెళ్లినా ఇలాంటి అనేక పనులతో స్వామి మార్క్ కనిపిస్తోంది.

ఎమ్మెల్యే అయిన వెంటనే కీలక రంగాలపై దృష్టి

కొండపి నుంచి టీడీపీ అభ్యర్థిగా తొలుత 2009లో పోటీచేసి ఓటమి చెందిన డాక్టర్ స్వామి తిరిగి 2014లో పోటీ చేసేంత వరకూ విరామం లేకుండా నియోజకవర్గంలో పర్యటించారు. ఆ సమయంలోనే ఏప్రాంతంలో ఏది ప్రధాన సమస్య, దానిని తీర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై అవగాహన పెంచుకున్నారు. గతంలో మంత్రిగా దామచర్ల ఆంజనేయులు చేసిన కృషిని పలు గ్రామాల ప్రజలు కీర్తించడం గమనించిన స్వామి అభివృద్ధి పనుల్లో ఆయన స్ఫూర్తితోనే ముందుకు సాగారు. 2014లో ఎమ్మెల్యే అయిన వెంటనే కీలకమైన రవాణా రంగంపై దృష్టి సారించారు.

రూ.200 కోట్లతో రోడ్ల అభివృద్ధి, విస్తరణ

రోడ్డు సౌకర్యాలు మెరుగుపర్చడంతోపాటు బ్రిడ్జిల నిర్మాణం అత్యంత ముఖ్యంగా భావించిన ఎమ్మెల్యే స్వామి అప్పటి టీడీపీ ప్రభుత్వం దృష్టికి పలు ప్రతిపాదనలు తీసుకెళ్లి నిధులు రాబట్టారు. సుమారు రూ.200 కోట్ల మేర నిధులను రోడ్ల అభివృద్ధి, విస్తరణ, పటిష్టతకు తీసుకొచ్చి పనులు చేయించారు. టంగుటూరు-కొండపి-కామేపల్లి రింగ్‌రోడ్డును రూ.50 కోట్లతో అభివృద్ధి చేయించారు. అగ్రహారం డబుల్ రోడ్డును రూ.25 కోట్లతో, అలాగే కొండపి-మర్రిపూడి రోడ్డును భారీగా నిధులు తెచ్చి చేయించారు. కొండపి మండలం కె.ఉప్పలపాడు నుంచి జరుగుమల్లి మండలం చిరకూరపాడు వరకు రూ.5.50 కోట్లతో తారు రోడ్డు నిర్మించారు. దీంతో ఒంగోలు కొండపి, కందుకూరు నియోజకవర్గాల మధ్య లింక్ ఏర్పడి తక్కువ దూరంతో ప్రయాణించే అవకాశం ఏర్పడింది. ఇక నియోజకవర్గంలోని పలు ప్రధాన గ్రామాలను కలుపుతూ అనేక రోడ్లను నిర్మించారు.

వంతెనల నిర్మాణంతో తీరిన ప్రజల కష్టాలు

పలు వాగులు, వంకలలో నీటి ప్రవాహ సమయంలో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్న విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే స్వామి దాదాపు రూ.50 కోట్లు తెచ్చి అనేక బ్రిడ్జిలు, వంతెనలు నిర్మింపజేశారు. టంగుటూరు మండలం రావివారిపాలెం వద్ద సుమారు రూ.11.50 కోట్లతో పాలేరుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి ఆప్రాంత ప్రజలకు ఎంతో ఉపకరిస్తోంది. అలాగే పొన్నలూరు మండలం కె.అగ్రహారం డబుల్ రోడ్డులో మూడుచోట్ల వాగులుపై సుమారు రూ.5.15 కోట్లతోనూ, మర్రిపూడి మండలంలోని జువ్విగుంట-శివరాయునిపేట మధ్య రూ.3 కోట్లతో, కట్టుబడిపాలెం-కమ్మవారిపాలెం మధ్య రూ.3.50 కోట్లతో, జరుగుమల్లి మండలంలో రామచంద్రాపురం సమీపంలో కందన వాగుపై రూ.4.50 కోట్లతో వంతెనలు నిర్మించారు. దీంతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరాయి.


వల్లాయపాలెం రహదారిలో నిర్మించిన హైలెవెల్ వంతెన


విజయం అనంతరం సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు (ఫైల్)

ఫలించిన నేతల సమన్వయం

మర్రిపూడిలో పట్టు నిరూపించుకున్న టీడీపీ

మర్రిపూడి, జూన్ 15 : టీడీపీ నేతల సమష్టి కృషి పార్టీ విజయానికి ఎంతగానో దోహదపడింది. శాసనసభ్యుడు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి గతంలో చేసిన అభివృద్ధి, యువనేత దామచర్ల సత్య, మరో కీలక నేత దామచర్ల పూర్ణచంద్రరావులు వేసిన వ్యూహాత్మక అడుగులు పార్టీ విజయానికి సోపానాలయ్యాయి. ముఖ్యంగా చిలంకూరు, వేమవరం, గార్లపేట, సన్నమూరు, కూచిపూడిలలో అసంతృప్త వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకోవడం ద్వారా ఆయా గ్రామాల్లో పార్టీకి స్పష్టమైన ఆధిక్యత లభించింది. గతంలో వైసీపీ బలంగా ఉన్న ఆయా గ్రామాలలో టీడీపీ అనూహ్యంగా పుంజుకుంది. నరసరాజుపాలెం పంచాయతీలో టీడీపీ వ్యూహం ఫలించడంతో ఆపార్టీకి స్పష్టమైన ఆధిక్యత వచ్చింది. ముందుగా పోలింగ్ బూత్‌ల వారీ పార్టీ ఓటర్ల బలాబలాలను అంచనా వేయడంలో బూత్ కన్వీనర్లు సఫలీకృతులయ్యారు. దీనికితోడు క్లస్టర్‌ల ఏర్పాటు వల్ల పార్టీ నాయకుల పనితీరుపై స్పష్టమైన అవగాహన ఏర్పడింది. పోల్ మేనేజ్‌మెంట్‌లో సైతం టీడీపీ శ్రేణులు అవిరళ కృషిచేశాయి. రావిళ్లవారిపాలెం, వెంకటక్రిష్ణాపురం గ్రామాల్లో ఎన్నికల ముందు తీసుకున్న పలు నిర్ణయాలు కలిసొచ్చాయి. వైసీపీ బలంగా ఉన్న మర్రిపూడి, రేగలగడ్డ, గంగపాలెం, చిమట, కాకర్ల, ధర్మవరం గ్రామాలపై టీడీపీ నాయకత్వం ప్రత్యేక దృష్టిసారించి వైసీపీ మెజారిటీని గణనీయంగా తగ్గించగలిగారు. ముఖ్యంగా టీడీపీ మండల స్థాయి నాయకులు ఎర్రమోతు శ్రీనివాసులు, రేగుల వీరనారాయణ, చేరెడ్డి నర్సారెడ్డి, తుళ్లూరు నరసింహారావు, గొంటు హనుమారెడ్డితోపాటు యువనేతలైన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుర్రా మల్లికార్జునరావు, మలసాని కోటేశ్వరావు, గుళ్లాపల్లి మల్లికార్జున్‌లు వారివారి గ్రామాలలో పార్టీ విజయదుందుబి మోగించేందుకు శక్తివంచన లేకుండా పనిచేశారు. దీనికి తోడు ఎమ్మార్పీఎస్ నాయకులు కాలికి బలపం కట్టుకొని వాడవాడలా తిరిగి టీడీపీ అభ్యర్థి స్వామి విజయానికి అహరహం శ్రమించారు. వైసీపీ అభ్యర్థి మంత్రి ఆదిమూలపు సురేష్ ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అటువైపు మొగ్గుచూపుతారన్న ప్రచారం ఒకదశలో విరివిగా జరిగినప్పటికీ పోలింగ్ సరళినిబట్టి చూస్తే టీడీపీ అభ్యర్థికే ఎక్కువ శాతం మద్దతు ఇచ్చినట్లు వెల్లడవుతోంది. దీనికితోడు వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడే అన్న చందంగా తయారవడంతో గ్రామీణ ప్రజల్లో వైసీపీ పాలనపట్ల అసంతృప్తి పెద్దఎత్తున వ్యక్తమైంది. అంతేకాకుండా నిరుద్యోగ యువకులు, ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఏకపక్షంగా టీడీపీ వైపు మొగ్గు చూపడంతో మండలంలో ఆపార్టీకి మంచి మెజారిటీ వచ్చింది. 21 గ్రామ పంచాయతీల్లో 14 చోట్ల ఈ ఎన్నికల్లో టీడీపీకి స్పష్టమైన అధిక్యం లభించింది. దీనికితోడు రాష్ట్రమంత్రివర్గంలో ఎమ్మెల్యే స్వామికి చోటుదక్కడంతో టీడీపీ శ్రేణులు మంచి జోష్‌లో ఉన్నాయి.


స్వాగతం.. సుస్వాగతం...
కొండపి నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం సాధించి
సమర్థతకు, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అయిన
ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి
కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి
తొలిసారి నియోజకవర్గానికి వస్తున్న
మా ప్రియతమ నాయకుడు
డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారికి
హార్ధిక స్వాగతం పలుకుతూ...
గోనుగుంట పున్నయ్య చౌదరి
టీడీపీ నాయకులు,
నేతివారిపాలెం, కొండపి మండలం
డా॥ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
శ్రీ దామచర్ల సత్యనారాయణ (సత్య) గారు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
టీడీపీ ఉత్తరాంధ్ర(జోన్-1) ఇన్‌చార్జి
శ్రీ దామచర్ల పూర్ణచంద్రరావు గారు
టీడీపీ సీనియర్ నాయకులు


స్వాగతం - సుస్వాగతం
హ్యాట్రిక్ ఎమ్మెల్యే, నిగర్వి, ప్రజాసేవకుడు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు
మంత్రి పదవి చేపట్టాక జిల్లాకు తొలిసారిగా విచ్చేయుచున్న సందర్భంగా ఇవే
స్వాగతం.. సుస్వాగతం...
పోకూరి లక్ష్మీనరసింహం
టీడీపీ గ్రామ పార్టీ
అధ్యక్షులు, వెన్నూరు
గార్రెపాటి శ్రీనివాసరావు
టీడీపీ నాయకులు
వెన్నూరు
పోకూరి చినలక్ష్మీనరసింహం
టీడీపీ నాయకులు
వెన్నూరు
బెజవాడ వెంకటరమేష్
టీడీపీ నాయకులు
వెన్నూరు
మానం శ్రీనివాసరావు
టీడీపీ నాయకులు
వెన్నూరు
పోలినేని వెంకటేశ్వర్లు
టీడీపీ నాయకులు
వెన్నూరు
పోలినేని శేషయ్య
టీడీపీ నాయకులు
వెన్నూరు
పోలినేని చినవెంకటేశ్వర్లు
టీడీపీ నాయకులు
వెన్నూరు
పోకూరి హరిబాబు
టీడీపీ నాయకులు
వెన్నూరు
పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి
టీడీపీ నాయకులు
వెన్నూరు
మేడిబోయిన రామారావు
టీడీపీ నాయకులు
వెన్నూరు
కలికివాయి మాలకొండయ్య
టీడీపీ నాయకులు
వెన్నూరు
టి.వి.సుబ్బయ్య
టీడీపీ నాయకులు
వెన్నూరు
గద్దం వెంకటేశ్వర్లు
టీడీపీ నాయకులు
వెన్నూరు
గూడూరి శ్రీరామచంద్రమూర్తి
టీడీపీ నాయకులు
వెన్నూరు
కాకాని కోటయ్య
టీడీపీ నాయకులు
వెన్నూరు
రాయల మురళి
టీడీపీ నాయకులు
వెన్నూరు
మసనం అంకమ్మరావు
టీడీపీ నాయకులు
వెన్నూరు
మసనం సురేష్
టీడీపీ నాయకులు
వెన్నూరు
తెలుగుదేశంపార్టీ
వెన్నూరు,
కొండపి మండలం
డా॥ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
శ్రీ దామచర్ల సత్యనారాయణ (సత్య) గారు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
టీడీపీ ఉత్తరాంధ్ర(జోన్-1) ఇన్‌చార్జి

సింగరాయకొండ.. అభివృద్ధికి అండ!

ఎమ్మెల్యేగా చెరగని ముద్రవేసిన స్వామి

- రూ.500 కోట్లతో గ్రామాల రూపురేఖలు మార్చిన వైనం
- రామతీర్థం నీటితో తొలగిన తాగునీటి ఇక్కట్లు

సింగరాయకొండ, జూన్ 15 : సింగరాయకొండ మండల అభివృద్ధిలో గత టీడీపీ హయాంలో (2014-2019) ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెరగని ముద్ర వేశారు. మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు తర్వాత అంత పెద్దఎత్తున పనులు చేసిన ఘనత స్వామికే దక్కుతుంది. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే స్వామి సుమారు రూ.500 కోట్లమేర నిధులను మంజూరు చేయించి గ్రామాల రూపురేఖలు మార్చారు. రూర్బన్ పథకం కింద రూ.100 కోట్ల కేంద్ర నిధులను ప్రత్యేకంగా మండలానికి తీసుకొచ్చారు. అందులో రూ.50 కోట్లపైగా వెచ్చించి గ్రామాల్లో మెజారిటీ భాగం సీసీ రోడ్లు పూర్తిచేశారు. అంతర్గత డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు, కమ్యూనిటీ హాల్స్, పార్కుల నిర్మాణంతోపాటు పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పాకల రోడ్డు నుంచి కందుకూరు రోడ్డు వరకూ ట్రంకురోడ్డుకు ఇరువైపులా డివైడర్‌ను నిర్మించి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయించారు. రైల్వేస్టేషన్ రోడ్డును విశాలమైన డబుల్ రోడ్డుగా మార్పించి సెంట్రల్ లైటింగ్‌తో ఆధునీకీకరించారు. పాకలరోడ్డు నుంచి సోమరాజుపల్లి వరకూ రూ.కోటి, ఊళ్లపాలెం రోడ్డు నుంచి పాతసింగరాయకొండ ఎస్సీ కాలనీ వరకూ రూ.95 లక్షలతో తారురోడ్ల నిర్మాణం చేయించారు. సింగరాయకొండ-ఊళ్లపాలెం ఓవీ రోడ్డు ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. మండలంలో పది గ్రామాలుండగా వాటిలో సింగరాయకొండ, మూలగుంటపాడు, పాతసింగరాయకొండ, సోమరాజుపల్లి, కనుమళ్ల, కలికివాయి గ్రామాలకు రామతీర్థం నీటిని తీసుకొచ్చి ప్రజల తాగునీటి ఇక్కట్లను తొలగించారు. ప్రతి గ్రామంలోనూ ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌లను నిర్మించారు. కేవలం రెండు రూపాయలకే 25 లీటర్ల నీటిని ప్రజలకు అందజేశారు. రూ.35 లక్షలు వెచ్చించి చేపల మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టారు. మండలంలో దాదాపు 30 శ్మశాన వాటికలను రూ.3కోట్లతో అభివృద్ధి చేయించారు. పాకల పోతయ్యగారి పట్టపుపాలెం, చెల్లమ్మగారి పట్టపుపాలెంలో రెండు తుఫాన్ షెల్టర్లను నిర్మించారు.


రూ. 7 కోట్లతో నిర్మించిన పాతసింగరాయకొండ, ఊళ్లపాలెం రోడ్డు ఫ్లైవోవర్


సింగరాయకొండలో నిర్మించిన చేపల మార్కెట్


సింగరాయకొండలో గత టీడీపీ హయాంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

రూ.1.36 కోట్లతో మండల కాంప్లెక్స్ అభివృద్ధి

మండల కాంప్లెక్స్‌లో రూ.87.50 లక్షలు వెచ్చించి అంతర్గత సీసీ రోడ్లు, ఆర్వో ప్లాంట్, పార్కు, లైట్ల నిర్మాణం చేయించారు. అదనంగా రూ.49 లక్షలతో మండల కాంప్లెక్స్‌లోని కార్యాలయాలకు రక్షణగా ప్రహరీ నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద రిసోర్స్ భవనాన్ని నిర్మించారు.

జూనియర్ కళాశాలకు నూతన భవనం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.55 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం చేపట్టారు. మాజీమంత్రి దామచర్ల ఆంజనేయులు హయాంలో మండల కాంప్లెక్స్ సమీపంలో 2003 ప్రారంభించి అర్ధంతరంగా నిలిచిపోయిన రెండు బీసీ హాస్టళ్లకు రూ. 1కోటి నిధులు తీసుకొచ్చి భవాలను స్వామి పూర్తి చేయించారు. అలాగే రూ.కోటితో మూలగుంటపాడు హైస్కూల్‌లో నూతన తరగతి గదులు, ఉర్దూ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. ఊళ్లపాలెంకు బీసీ బాలికల గురుకుల పాఠశాలను మంజూరు చేయించారు. భవన నిర్మాణం కోసం స్థానికంగా స్థలాన్ని కూడా కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆస్థలంలో జగనన్న లేఅవుట్‌ను వేసింది. దీంతో పాఠశాల నిర్మాణం అటకెక్కింది. ప్రస్తుతం తరగతులను టంగుటూరులోని ఎస్సీ బాలుర వసతిగృహంలో చాలీచాలని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు.


ముట్టేరుపై నిర్మించిన బ్రిడ్జి

రూ.10 కోట్లతో బ్రిడ్జిల నిర్మాణం

ఎమ్మెల్యే స్వామి చొరవతో శానంపూడి గ్రామంలోని పటికినేనివారిపాలెం వద్ద ముట్టేరుపై 2014-19లో టీడీపీ ప్రభుత్వంలో రూ.3.55 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం జరిగింది. ముట్టేరు పొంగినప్పుడు వాగుకు ఇరువైపులా ఉన్న ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. రైతులు పంట పొలాలకు వాగు దాటుకొని వెళ్లాల్సి వచ్చి ఇక్కట్లు పడేవారు. బ్రిడ్జి నిర్మాణం తర్వాత గ్రామస్థులు, రైతుల రాకపోకలు సజావుగా సాగిస్తున్నారు. రూ.7 కోట్లతో పాతసింగరాయకొండ ఆర్చి సమీపంలో రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జిని నిర్మించారు.


పాకలలో స్వామి కృషితో ప్రారంభించి వైసీపీ పాలనలో ఆగిన టూరిజం రెస్టారెంట్

పాకల పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

పాకల బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయడంపై 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే స్వామి ప్రత్యేక దృష్టి సారించారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.4 కోట్లతో పర్యాటకుల కోసం టూరిస్ట్ రెస్టారెంట్ పనులను ప్రారంభించి సగం పూర్తి చేయించారు. స్వామి కృషితో లోకల్ టూరిజం ప్రాజెక్టు కింద రూ.40 లక్షలు మంజూరయ్యాయి. నందమూరి తారకరామారావు, దామచర్ల ఆంజనేయులు పర్యాటక కేంద్రంగా నామకరణం చేసి పనులకు శ్రీకారం చుట్టారు. బీచ్ ఒడ్డున సీసీరోడ్డును నిర్మించారు. రోడ్డుకు ఆనుకొని సైడ్‌వాల్‌ను నిర్మించి దానిపై సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో పనులు పూర్తవుతాయన్న నమ్మకాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

రూ.2కోట్లతో ఎత్తిపోతల పథకం

మన్నేరు వద్ద రూ.2కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే స్వామి ఏర్పాటు చేయించారు. దీని ద్వారా కనుమళ్ల పంట చెరువుకు నీటి తరలింపునకు కృషిచేశారు. 600 ఎకరాల్లో రైతులు పంటలు పండించుకోవడానికి లిఫ్ట్ ఇరిగేషన్ ఉపయోగపడుతోంది. అంతేకాకుండా పంట పొలాలకు వెళ్లే రోడ్లపై రైతులు రాకపోకలు సాగించటానికి పెద్ద సంఖ్యలో కాల్వర్టులు నిర్మింపజేశారు. ఎన్టీఆర్ జలసిరి కింద రైతులకు ఉచితంగా బోర్లు వేయించారు. నీరు-చెట్టు పథకం ద్వారా రూ.కోట్లు వెచ్చించి పంట చెరువులను అభివృద్ధి చేశారు.

సింగరాయకొండపై సత్యకు ప్రత్యేక అభిమానం

సింగరాయకొండ మండలంపై మాజీమంత్రి దామచర్ల అంజనేయులుకు ఎనలేని మమకారం ఉండేది. ఇక్కడి నాయకులకు ఆయన ప్రత్యేక గౌరవం ఇచ్చే వారు. అదే పంథాను ఆయన మనవడైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య కూడా అనుసరిస్తున్నారు. సింగరాయకొండపై ప్రత్యేక అప్యాయతను కనబరుస్తూ ఇక్కడి ప్రజల మనసులు గెలుచుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మండల అభివృద్ధిలో సత్య ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మండలంలోని టీడీపీ పాత, కొత్త తరాల నాయకులతో సత్య మమేకమవుతారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా అప్యాయంగా పలకరిస్తారు. ఒకవైపు సీనియర్లను, మరోవైపు యువనాయకులను సమన్వయం చేసి మండలంలో టీడీపీని బలోపేతం చేయడంలో సత్య సఫలీకృతులయ్యారు.

సత్య కీలకపాత్ర

గత సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి కంచుకోటగా ఉన్న సింగరాయకొండ మండలంపై స్వామి, సత్య, పూర్ణచంద్రరావు ప్రత్యేక దృష్టి సారించారు. ముగ్గురి త్రయం ప్రణాళికాబద్ధంగా వ్యూహరచనలు చేసి ఐదేళ్లలో సింగరాయకొండ మండలంలో టీడీపీని తిరుగులేని శక్తిగా తయారు చేశారు. ఎన్నికల ముందు సత్య మండలంలో నియోజకవర్గ బీసీల సమావేశం, వడ్డెరుల ఆత్మీయ సమావేశాలు.. మాగుంట, స్వామిలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి నాయకులు, కార్యకర్తలలో జోష్‌ను నింపారు. ఎన్నికల ఖర్చు విషయాల్లో కూడా వైసీపీకి ఏమాత్రం తగ్గకూడా సత్య దూకుడుగా వ్యవహరించారు. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా సింగరాయకొండ మండలంలో ప్రస్తుత సార్వత్రి ఎన్నికల్లో 6,332 భారీ మెజారిటీని టీడీపీకి ప్రజలు కట్టబెట్టారు.


ఊళ్లపాలెం దారి నుంచి పాతసింగరాయకొండ ఎస్సీ కాలనీ వరకూ నిర్మించిన బీటీ రోడ్డు



కొండపి ఎమ్మెల్యేగా రికార్డు మెజారిటీతో హ్యాట్రిక్ విజయాన్ని
సాధించి నియోజకవర్గ చరిత్రను తిరగరాసి దార్శనికుడు
మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
క్యాబినెట్‌లో సాంఘిక సంక్షేమం, దివ్యాంగుల మరియు వృద్ధుల
సంక్షేమం, సచివాలయం, గ్రామ వాలంటీర్ల వ్యవహారాల శాఖ రాష్ట్ర మంత్రివర్యులు
నియమితులై తొలిసారి జిల్లాకు విచ్చేస్తున్న నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం,
నిగర్వి, స్నేహశీలి, అభివృద్ధి కాముకుడు, మాకు అత్యంత ఆప్తులు, రాష్ట్ర మంతిరవర్యులు
డాక్టర్ శ్రీ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గారికి
స్వాగతం - సుస్వాగతం
డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
గాలి హరిబాబు
టిడిపి సీనియర్ నాయకులు,
పాతసింగరాయకొండ
మించల బ్రహ్మయ్య
టిడిపి నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షులు
పాతసింగరాయకొండ
నక్కా బ్రహ్మేశ్వరరావు
ఉపసర్పంచ్,
పాతసింగరాయకొండ
సవిడిబోయిన మురళి
టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు
పాతసింగరాయకొండ
పిగిలి హరికృష్ణ
టిడిపి యువనేత (గౌదగట్లవారిపాలెం)
పాతసింగరాయకొండ



స్వాగతం
సుస్వాగతం
కొండపి ఎమ్మెల్యేగా రికార్డు మెజారిటీతో హ్యాట్రిక్ విజయాన్ని
సాధించి నియోజకవర్గ చరిత్రను తిరగరాసి దార్శనికుడు
మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
క్యాబినెట్‌లో సాంఘిక సంక్షేమం, దివ్యాంగుల మరియు వృద్ధుల
సంక్షేమం, సచివాలయం, గ్రామ వాలంటీర్ల వ్యవహారాల శాఖామాత్యులుగా
నియమితులై తొలిసారిగా జిల్లాకు విచ్చేస్తున్న కొండపి నియోజవకర్గ
అభివృద్ధి ప్రధాత, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం, నిగర్వి, స్నేహశీలి,
మాకు అత్యంత ఆప్తులు, గౌరవనీయులు రాష్ట్ర మంత్రివర్యులు
డాక్టర్ శ్రీ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గారికి
స్వాగతం - సుస్వాగతం
కాత్తూరి శ్రీరంగనాయకులు
టిడిపి నాయకులు, ప్రకాశం జిల్లా
ఆర్యవైశ్య సంఘం కోశాధికారి, సింగరాయకొండ
కోట శ్రీనివాసులు
టిడిపి నాయకులు
సింగరాయకొండ
ఇమ్మడిశెట్టి రామారావు
టిడిపి నాయకులు
సింగరాయకొండ
డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
మునగా సుబ్రమణ్యం
టిడిపి నాయకులు
సింగరాయకొండ
పద్మనాభుని వెంకట
సురేష్ కుమార్
టిడిపి నాయకులు, సింగరాయకొండ
పొదర్తి కోటేశ్వరరావు
3వ వార్డు సభ్యులు,
సింగరాయకొండ



స్వాగతం...
సుస్వాగతం...
నిగర్వి నిజాయితీపరుడు, మృదుస్వభావి, మంచి మనిషి కొండపి నియోజకవర్గ
ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామాత్యులుగా
బాధ్యతలు చేపట్టి నేడు జిల్లాకు విచ్చేయుచున్న గౌరవనీయులు
డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారికి స్వాగతం... సుస్వాగతం...
కొమ్మాలపాటి రాఘవరావు
టిడిపి నాయకులు, చోడవరం,
కొండపి మండలం
రావిపాటి శివకృష్ణరావు
చోడవరం గ్రామ టిడిపి అధ్యక్షులు,
కొండపి మండలం
రావిపాటి నారాయణ
మాజీ సర్పంచ్, చోడవరం
కొండపి మండలం
శ్రీ డా॥ డోలా శ్రీ బాల
వీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ
మంత్రివర్యులు
తెలుగుదేశం పార్టీ, చోడవరం
శ్రీ దామచర్ల
సత్యనారాయణ (సత్య) గారు
టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

డోలా.. భళా!

- నియోజకవర్గ అభివృద్ధికి అహరహం కృషి
- గత టీడీపీ హయాంలో పెద్దఎత్తున నిధులు
- లింకురోడ్లు తారు రోడ్లుగా మార్పు
- రామతీర్థం జలాలతో ప్రజలకు సాంత్వన
- కొండపి చెరువుకు ముసి నుంచి పైప్‌లైన్
- ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు
- నాలుగు కొత్త మినీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణం
- బీసీ, ఎస్సీ హాస్టళ్ల ఏర్పాటు


కొండపి- టంగుటూరు ఆర్అండ్బీ రోడ్డు

కొండపి, జూన్ 15 : నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మార్క్ అడుగుగునా కనిపిస్తోంది. గత టీడీపీ హయాంలో పెద్దఎత్తున నిధులు తెచ్చిన ఆయన అనేక పనులు చేయించారు. ప్రధానంగా కొండపి, టంగుటూరు, జరుగుమల్లి, కామేపల్లి రింగ్ రోడ్డు అభివృద్ధికి, మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మెటల్‌రోడ్లను తారురోడ్లుగా మార్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధతో పనిచేశారు. నిధులు మంజూరు చేయించి, పనులు పూర్తి చేయించారు. 2014-19 మధ్య కాలంలో రింగ్ రోడ్డును రూ.50 కోట్లతో అభివృద్ధి చేయించారు. మండలంలో పెట్లూరు నుంచి గుర్రప్పడియ వరకు దాదాపు 6 కిలోమీటర్ల రోడ్డును రూ.1.50కోట్లతో తారురోడ్డుగా మార్చారు. టంగుటూరు-పొదిలి ఆర్అండ్‌బీ రోడ్డులోని కోయవారిపాలెం నుంచి జాళ్లపాలెం వరకు పది కిలోమీటర్లు రోడ్డును రూ.5.50కోట్లతో తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. వెన్నూరు నుంచి కట్టుబడివారిపాలెం వరకు ఏడు కిలోమీటర్ల రహదారిని రూ.1.75 కోట్లతో తారురోడ్డుగా మార్చారు. కట్టుబడివారిపాలెం నుంచి కమ్మవారిపాలెం అడ్డరోడ్డుకు వెళ్లే మార్గంలో నల్లవాగుపై దాదాపు రూ.3.50కోట్లతో హైలెవల్ బ్రిడ్జిని నిర్మించారు. దీని నిర్మాణంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సత్య కూడా ప్రధాన పాత్ర పోషించారు. కె.ఉప్పలపాడు నుంచి చిర్రికూరపాడు వరకు దాదాపు పది కిలోమీటర్ల రహదారిని రూ.5.50కోట్లతో తారురోడ్డుగా మార్చారు. దీంతో జరుగుమల్లి, కొండపి మండలాల్లోని దాదాపు 20కి పైగా గ్రామాల ప్రజలు అటు నెల్లూరు జిల్లా కందుకూరుకు, ఇటు ఒంగోలుకు వెళ్లేందుకు దగ్గరదారి ఏర్పడింది. ప్రజలకు ప్రయాణ భారంతోపాటు సమయం ఆదా అయ్యింది. అదేవిధంగా ముప్పవరం నుంచి గోగినేనివారిపాలెం వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం తారురోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించడంతోపాటు పనుల పూర్తికి సత్య ప్రత్యేక కృషి చేశారు. పలుగ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లే అంతర్గత రోడ్లు, గ్రామాలకు కనెక్టివిటీ రోడ్ల నిర్మాణంలో ఎమ్మెల్యే స్వామి కీలకపాత్ర పోషించారు. జరుగుమల్లి మండలంలోని అక్కచెరువుపాలెం రోడ్డును తారురోడ్డుగా మార్చారు. పొన్నలూరు మండలంలోని లింగోరుగుంట నుంచి రెడ్డిపాలెం వరకు తారురోడ్డు నిర్మించారు.

కొండపి చెరువుకు ముసి నీరు

కొండపిలోని పీడబ్ల్యూడీ చెరువుకు 4 కిలో మీటర్ల దూరంలో ఉన్న ముసి నుంచి సాగునీటిని మళ్లించే కార్యక్రమానికి గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యే స్వామి శ్రీకారం చుట్టారు. అందుకు అవసరమైన పైపులైన్లు, పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేయించి ముసిలో నీరు సమృద్ధిగా ఉన్నప్పుడు చెరువుకు పెట్టుకునే విధంగా పనులు పూర్తి చేయించారు. ఏటా కొండపి చెరువుకు సాగునీరు పెడుతున్నారు. అనకర్లపూడి, పెరిదేపి, ముప్పవరం, నెన్నూరుపాడు గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించారు. రైతుల క్షేమం కోసం పలు గ్రామాల్లో మినీ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయించారు.

సబ్‌స్టేషన్‌ల నిర్మాణం

విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదనంగా పొన్నలూరు మండలంలోని మాలెపాడు, చవటపాలెం, కొండపి మండలంలోని పెట్లూరు, జరుగుమల్లి మండలంలోని కామేపల్లి గ్రామాల్లో అదనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే ప్రత్యేక కృషి చేశారు. తద్వారా మారుమూల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తినా వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుని ప్రజల మన్ననలు పొందారు.

విద్య, వైద్య సౌకర్యాలు

కొండపిలోని 30 పడకల వైద్యశాల స్థాయి పెంచి వైద్యవిధాన పరిషత్‌లో కలిపి సౌకర్యాలు పెరిగేలా ఎమ్మెల్యే స్వామి కృషి చేశారు. కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు హాస్టల్ వసతి, బీసీ గురుకుల పాఠశాలను టంగుటూరులో మంజూరు చేయించడంతోపాటు, పొన్నలూరులో ఎస్టీ గురుకుల పాఠశాలకు భవన వసతికి నిధులు సాధించారు. నిత్యం ప్రజల్లో ఉండే స్వామి అన్ని గ్రామాల వారితో సత్సంబంధాలు కలిగి ప్రజా సమస్యల పరిష్కారంలో సత్వర కృషి చేశారు. సకాలంలో స్పందించి గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేసి విజయం సాధించారు. ఎటువంటి బేషజాలు లేకుండా ప్రజల మనిషిగా పేరు పడిన స్వామి వారితో మమేకమై పనిచేసే ఆయన భళా.. డోలా.. అన్న ప్రశంసలు నియోజకవర్గ ప్రజల నుంచి అందుకుంటున్నారు. రామతీర్థం నుంచి నీటిని తీసుకువచ్చి కొండపిలో రక్షిత పథకం ఏర్పాటు చేసి మంచినీటిని అందించే కార్యక్రమానికి స్వామి, సత్య విశేష కృషి చేశారు. మంచినీటి ప్రాజెక్టు నుంచి కొండపి, జరుగుమల్లి, టంగుటూరు, సింగరాయకొండ మండలాల్లోని 35 గ్రామాలకు రక్షిత నీరు అందించే కార్యక్రమం చేపట్టారు. పథకం పూర్తికి దాదాపు రూ.40 కోట్లను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి సకాలంలో పనులు చేయించారు.


జువ్విగుంట సబ్‌స్టేషన్

స్వామి బయోడేటా



పేరు : డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి
పుట్టిన తేదీ : 4-12-1970
పుట్టిన స్థలం : తూర్పునాయుడుపాలెం, టంగుటూరు మండలం
తల్లిదండ్రులు : కోటయ్య సిద్ధాంతి, సుబ్బమ్మ
భార్య : రాజేశ్వరి, ఎంఎస్సీ బీఈడీ (ఫిజిక్స్)
పిల్లలు : ఒక కుమారుడు
విద్యార్హత : ఎంబీబీఎస్ (ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే పూర్తి చేశారు. ఇంటర్మీడియట్ ఒంగోలు మంగమ్మ కళాశాలలో చదివారు. ఎంబీబీఎస్ విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కళాశాలలో పూర్తి చేశారు.)
రాజకీయ చరిత్ర : కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేదు.
బంధుత్వాలు : తక్కువ. గ్రామంలోనే బంధువులున్నారు.
వ్యాపారాలు, ఇతర కార్యక్రమాలు : లేవు.
కేసులు : లేవు
అభివృద్ధి కార్యక్రమాలు : నియోజకవర్గంలో 2014-19 మధ్య టీడీపీ హయాంలో రూ.850 కోట్లతో అభివృద్ధి, దాదాపు రూ.600 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని లింక్ రోడ్లన్నింటినీ తారురోడ్లుగా మార్చారు.
ఆసక్తికర విషయాలు : అందరికీ అందుబాటులో ఉండే నాయకుడు. నియోజకవర్గంలో ఎవరు పిలిచినా వెంటనే పలుకుతారు. ప్రజల వ్యక్తిగత, గ్రామాల్లో ఉమ్మడి శుభ కార్యాలకు హాజరుకావడంలో ముందుంటారు. ఒక రోజులో దాదాపు 15 శుభకార్యాలకు హాజరైన ఉదంతాలు కూడా ఉన్నాయి.


అనంతవరం సమీపంలో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి

తీరప్రాంత ప్రజల తిప్పలు తీర్చిన స్వామి

- గతంలో తుఫాన్‌లు, వర్షాల సమయంలో బిక్కుబిక్కు
- పునరావాస శిబిరాలకు వెళ్లేందుకూ అవస్థలు
- ఎక్కడికక్కడ బ్రిడ్జిల నిర్మాణంతో తీరిన సమస్య

టంగుటూరు, జూన్ 15 : భారీ వర్షాలు, తుఫాన్లు అనగానే మండలంలోని తీరప్రాంత ప్రజలు భయంతో వణికిపోయేవారు. ముసి, పాలేరు, ఇతరత్రా వాగులు, వంకలు పొంగిపొర్లుతాయేమోనని గజగజలాడే వారు. సముద్రపు ఉప్పెన నీరు ఊరి మీదపడుతుందేమోనని నిద్రలేని రాత్రులు గడిపే వారు. తుఫాన్ హెచ్చరికలు వచ్చిన వెంటనే తీరప్రాంత గ్రామాలను అధికారులు ఖాళీ చేయించి టంగుటూరు తరలించే వారు. అందుకోసం ప్రత్యేక వాహనాలు, పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసేవారు. ఈ సమయంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. అధికారుల వాహనాలు సైతం నేరుగా వచ్చేందుకు రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేని పసుకుదురు లాంటి గ్రామాల జనం భయం, భయంగా గడిపేవారు. ఇలాంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు తీరప్రాంత ప్రజలు నేరుగా టంగుటూరు చేరుకునే అవకాశం ఉండేది కాదు. అడ్డుగా ఉన్న పాలేరు, ముసిలపై హైలెవల్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రాథేయపడే వారు. అయితే రూ.కోట్లు వెచ్చించాల్సి రావడంతో ఎవ్వరూ ముందుకు వచ్చేవారు కాదు. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే స్వామి వీటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎక్కడికక్కడ బ్రిడ్జిలను ఏర్పాటు చేయించి ప్రజల్లో భయాందోళనలు తొలగించారు.

ఏడాదికోసారి వచ్చిపోయే ప్రపంచబ్యాంకు ప్రతినిధులు

గతంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ఏటా ఒకసారి తీరప్రాంత గ్రామాల్లో పర్యటించే వారు. గ్రామసభలు పెట్టి తుఫాన్‌ల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తెలుసుకునేవారు. ఈ సమయంలో ప్రజలు తమ కష్టాలను ఏకరువు పెట్టేవారు. నిధులు ఇస్తే వాగులు, ముసి, పాలేటిపై హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించుకుంటామని వరల్డ్ బ్యాంకు అధికారులను నాయకులు, గ్రామీణులు ప్రాథేయపడేవారు. తీరా ఆనిధులు ఇక్కడి దాకా వచ్చేవి కావు. జిల్లాలోనే ఇతర పాంతాలకు తరలిపోయేవి.

టీడీపీ హయాంలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి టంగుటూరు-అనంతవరం రోడ్డు మార్గంలో మూడు హైలెవల్ బ్రిడ్జిలకు, రావివారిపాలెం మార్గంలో పాలేరుపై మరో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు తెచ్చారు. అనంతవరం మార్గంలోని మూడు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ3.20 కోట్లు, అలాగే రావివారిపాలెం వద్ద ముసిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ13.75 కోట్లు విడుదలయ్యాయి. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం నుంచి ఈ నిధులు మంజూరయ్యాయి.

స్వామి చొరవతో నిర్మాణాలు ప్రారంభం

ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో బ్రిడ్జి నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి అనంతవరం రోడ్డు మార్గంలోని మూడు హైలెవల్ బ్రిడ్జిల పనులు పూర్తి చేశారు. రావివారిపాలెం మార్గంలోని ముసిపై భారీ వంతెన వలన టంగుటూరు నుంచి పాకలకు 8కి.మీ రోడ్డు వసతి ఏర్పడింది. రెండు మండలాలైన టంగుటూరు-సింగరాయకొండను కలిపినట్లయ్యింది. పసుకుదురు జనం బాధలు పరిష్కారమయ్యాయి. ఈమార్గంలోని కేసుపాలెం జనం ఇక్కట్లు తొలగిపోయాయి. ఒక్క రావివారిపాలెం వద్ద పాలేటిపై భారీ వంతెన నిర్మాణం చివరి దశకు చేరింది. అనంతరం వైసీపీ ప్రభుత్వంలో కూడా కొన్ని నెలలు పనులు కొనసాగాయి. అయితే రావివారిపాలెం వంతెన పనులు వైసీపీ ప్రభుత్వంలో పూర్తయినా వారు ప్రారంభానికి సాహసం చేయలేకపోయారు. అయితే జనం వంతెన వినియోగించుకుంటున్నారు.

ఎమ్మెల్యేకు జనం జేజేలు

ఎమ్మెల్యే స్వామి సారథ్యంలో హైలెవల్ బ్రిడ్జిల పనులు ఎలాంటి అవరోధాలు లేకుండా కొనసాగడంతో అప్పట్లోనే ఆయనకు జనం జేజేలు పలికారు. నిత్య కృషీవలుడని కీర్తించారు. ప్రజల దీవెనలతోనే వైసీపీ గాలిలోనూ స్వామి రెండో దఫా ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు మూడోసారి ఆయన్ను గెలిపించారు. ఆయన రాష్ట్ర మంత్రి కూడా అయ్యారు.



స్వాగతం - సుస్వాగతం
అద్దంకి నియోజకవర్గ అభివృద్ధిప్రదాత,
మా ప్రియతమ నాయకులు
డా॥ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులుగా
బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు
నిగర్వి, స్నేహశీలి,
కొండపి నియోజకవర్గ
అభివృద్ధిప్రధాత,
మా ప్రియతమ నాయకులు
డా॥ డోలా శ్రీ బాల
వీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ
మంత్రివర్యులుగా
బాధ్యతలు చేపట్టి
తొలిసారిగా నేడు
ప్రకాశం జిల్లాకు
విచ్చేయుచున్న
సందర్భంగా
స్వాగతసుమాంజలులు.
మీ...
చదలవాడ చంద్రశేఖర్
EX.MPP
టంగుటూరు
డా॥ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు



స్వాగతం..
సుస్వాగతం...
రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి
జిల్లాకు మొదటిసారిగా విచ్చేయుచున్న
హ్యాట్రిక్ ఎమ్మెల్యే, రాష్ట్ర సాంఘిక
సంక్షేమ శాఖ మంత్రివర్యులు
డా॥ డోలా శ్రీ బాల
వీరాంజనేయస్వామి గారికి
స్వాగతం..
సుస్వాగతం...
మీ...
రామా గోపి
తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి
డా॥ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
శ్రీ దామచర్ల సత్యనారాయణ (సత్య) గారు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
టీడీపీ ఉత్తరాంధ్ర(జోన్-1) ఇన్‌చార్జి



స్వాగతం.. సుస్వాగతం...
కొండపి నియోజకవర్గంలో తొలిసారి హ్యాట్రిక్ విజయం సాధించి,
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టి
తొలిసారి జిల్లాకు విచ్చేయుచున్న
డా॥ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గారికి
స్వాగతం.. సుస్వాగతం...
మీ...
మూలె కోటేశ్వరరావు
టిడిపి నాయకుడు
పెట్లూరు గ్రామం, కొండపి మండలం
గుజ్జుల శ్రీనివాసరెడ్డి
తెలుగు యువత ఉపాధ్యక్షులు
పెట్లూరు గ్రామం, కొండపి మండలం
డా॥ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గారు
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు
మూలె రామిరెడ్డి
ఉపసర్పంచ్, పెట్లూరు గ్రామం
కొండపి మండలం
కందిమళ్ళ లక్ష్మీనారాయణ
మాజీ ఏఎంసీ డైరెక్టర్, పెట్లూరు గ్రామం,
కొండపి మండలలం
గుజ్జుల శివకోటిరెడ్డి
టీడీపీ నాయకులు, తాటాకులపాలెం
కొండపి మండలలం
శ్రీ మాగుంట శ్రీనివాసులరెడ్డి గారు
పార్లమెంట్ సభ్యులు, ఒంగోలు
తెలుగుదేశం పార్టీ - పెట్లూరు గ్రామం, కొండపి మండలం